భారత నిరుక్తి

ఎఱ్ఱన ధర్మోక్తి

ఆరణ్య పర్వ శేష
కథా సూత్రంతో

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

భారత నిరుక్తి
ఎఱ్ఱన ధర్మోక్తి

ఆరణ్య పర్వ శేష కథా సూత్రంతో

రచయితలు

డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డా॥ సూరం శ్రీనివాసులు

భారత నిరుక్తి - ఎఱ్ఱన ధర్మోక్తి

డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డా॥ సూరం శ్రీనివాసులు

1989 ప్రథమ ముద్రణ: 1000 ప్రతులు

2024 ద్వితీయముద్రణ: ఈ-ముద్రణ / పి.డి.ఎఫ్.

ప్రతులకు

డా॥ సూరం శ్రీనివాసులు

ఫో: 9440242348

e-mail: srinivasulu.suram@gmail.com

డిజైన్:

విట్టుబాబు, హైదరాబాద్

విషయసూచిక

చిన్నవిన్నపము

మరల ఇదేల?.... అన్నచో అది అందుకొనలేక పోతున్నారు గనుక, ఆస్వాదదూరు లవుతున్నారు అనే తపన చెలరేగుతోంది గనుక. అంతా కాకపోయినా కొంతయినా అందించాలనే అభిలాషతో అందుకొని ఆస్వాదించి, ఆనందిస్తారన్న విశ్వాసంతో.

వేదాలలో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానాన్ని మందమధ్యమాధికారులకు అందించడం కోసం వ్యాసుడు పంచమ వేదంగా శ్రీ మహాభారతాన్ని రూపొందించాడు. అది విశ్వజనీనమై ప్రపంచ ప్రఖ్యాతి నార్జించినది. నన్నయ కాలం నాటికి దేశభాషలోకి వస్తేనే కాని ఆ మందమధ్యమాధికారులకు అది అందలేదు. ఆస్వాదయోగ్యం కాలేదు. దానికి నడుం కట్టినవాడు నన్నయ. చక్కగా తీర్చినవాడు తిక్కన. శేషపూరణంతో తుది మెఱుగులు దిద్దినవాడు ఎఱ్ఱన. ఈ కవిత్రయం వారు ఆంధ్రులకు గర్వకారణంగా తెలుగు భారతాన్ని వెలయించారు. కాని వారు కూడ పద్యాలలో వెలయించారు.

ఆంధ్రదేశంలో ఇప్పుడు సాహిత్యంలో ఒక విలక్షణ దశ వచ్చి పడింది. అదేమిటంటే పద్యమంటే పడదు, ఎక్కడా వినబడదు. ఎవరికోకాని బోధపడదు. అనగా అధికారుల స్థాయిలో మరో పరిణామం ఏర్పడింది. ఆ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని యింతకుముందు "భారత నిరుక్తి- నన్నయ రుచిరార్థసూక్తి" అనే గ్రంథం వ్రాశాము. నన్నయ భారతభాగంలోని నీతి ధర్మ బోధకములయిన పద్యాలకు వ్యాఖ్య చేశాము. అది సహృదయుల మన్ననల నందుకొన్నది. అలాగే తిక్కన సరసోక్తి పేరుతో విరాటోద్యోగ పర్వాలకు పరిమితం చేసి, తిక్కన పద్యాలను విశ్లేషించాము కథాసూత్రంతో బంధించి. ఇపుడు ఎఱ్ఱన ధర్మోక్తిని ఇందులో వివరించేందుకు ప్రయత్నించాము.

తెలుగులో ఎఱ్ఱన చేతిలో పడిన ఆరణ్యపర్వశేషం అంతా ధర్మాల పుట్ట. వక్త చాలవరకు మార్కండేయుడు. శ్రోత ధర్మరాజు. ఇరువురూ మహనీయులే. అందుకే విప్రప్రభావం, కలియుగ లక్షణాలు, పతివ్రతా ధర్మాలు, ధర్మవ్యాధోపాఖ్యానం, యక్ష ప్రశ్నలు అన్నీ ధర్మ నిలయాలే. ఎఱ్ఱన ధర్మైక తత్పరుడు. తగిన సందర్భం దొరికింది. ఇరువురు మహాకవుల నడుమపడి నలిగిపోకుండా సమానమయిన పీఠం పొందాడు.

ఆ ఆరణ్య పర్వశేష కథాసూత్రంతో అందులోని నీతులను, ధర్మాలను యథా శక్తి వివరించాము. ప్రసంగవశాత్తు విస్తరించిన రామాయణాన్ని మాత్రం విడిచాము. అది ప్రత్యేక గ్రంథానికి తగిన ప్రణాళిక అనే తలంపుతో.

దీన్ని చదివిన తరువాత మా విశ్వాసం ఎటువంటిదో పాఠకులే నిర్ణయింప సమర్థులు.

1) భారత నిరుక్తి - నన్నయ రుచిరార్థ సూక్తి 2) భారత నిరుక్తి – తిక్కన సరసోక్తి అనే పుస్తకాలను శృంగేరీ పీఠాధిపతులు శ్రీ అభినవ భారతీతీర్థ స్వాముల వారికి సమర్పించాము. వారు వాటిని చూసి ఎఱ్ఱనను వదలిపెట్టారేమి? అని ప్రశ్నించారు. "తిక్కన సరసోక్తి విరాటోద్యోగ పర్వాలకే పరిమితం చేసి వ్రాశాము. మిగిలిన యుద్ధ పర్వాలూ, శాంతి సప్తకమూ వ్రాశాక ఎఱ్ఱనను గురించి వ్రాయాలను కొన్నాము" అని సమాధానం చెప్పాము. వెంటనే వారు "అలాకాదు ముందు ఎఱ్ఱన భాగం వ్రాయండి" అని ఆదేశించారు, ఆశీర్వదించారు. వారి ఆశీస్సుతో ఉత్సాహం బలపడింది. ఈ రూపంగా కొద్ది రోజులలోనే ఈ చిన్ని పుస్తకం తయారయినది. "ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతి" అన్న భవభూతి తళుక్కుమన్నాడు.

భారత ధర్మాసక్తులకు, సాహిత్యాభిలాషులకు ఒక విజ్ఞప్తి. ఆకాశ మంటిన పేపరు ధరను, అధికారుల అభిరుచిని దృష్టిలో పెట్టుకొని, యిష్టం లేకపోయినా పుస్తకం వెల అంత పెట్టక తప్పలేదు. అయినా ధరకు తట్టుకోలేని ఆసక్తులు పోస్టేజితో కలిపి ఎంతపంపివా పుస్తకం పంపగలమని మనవి చేస్తున్నాను. ఆసక్తి కల వారికి అందించాలనే తపనను పాఠకులు గుర్తింతురు గాక.

భారత సంబంధమయిన గ్రంథ ప్రచురణ విషయంలో మా మిత్రురాలు శ్రీమతి కె. అన్నపూర్ణ ఎం.ఏ. గారు ఆర్థికంగా ఎంతో ప్రోత్సాహమిచ్చారు. ఇప్పుడు వారు ఈ గ్రంథానికి ప్రూఫులు కూడా దిద్ది సహకరించారు. వారికి మా మనః పూర్వక నమస్సులు. ప్రెస్‌కు ప్రూఫులు అందించడంలో సహకరించిన చి. ఎ.ఎన్.జి. సుబ్రహ్మణ్యంకు ఆశీస్సులు.

ఈ గ్రంథ రచనలో చెపుతూంటే చక్కగా వ్రాసిపెట్టిన శిష్యురాలు శ్రీమతి ఐ.రాజేశ్వరి ఎం.ఏ.కు ఆశీస్సులు.

ఈ గ్రంథ ప్రచురణకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆర్థిక సహాయం అందించారు. వారికి, వారి అధికారులకు కృతజ్ఞతాభివందనములు.

పుస్తకాన్ని స్వల్పవ్యవధిలో చక్కగా ముద్రించి యిచ్చిన వెరైటీ ప్రింటర్సు, ఏలూరు వారికి, దొర్లిన పొరపాటును ఓపికతో సరిదిద్ది సహకరించిన వారి సిబ్బందికీ మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

** తొలిముద్రణ ముందుమాట*

చిరముగ ధర్మముల్ నడపఁ జిత్తము దేఱుఁ బ్రసన్న చిత్తుఁడై
పరువడి నింద్రియార్థముల భంగులు రిత్తల గా నెఱింగి, చె
చ్చెర నవి యంతవట్టు నిరసించి, తపోదమ సత్యశీలతం
బరిణతి నొందుఁ బొందుఁ బిదపం బరమార్థ పద ప్రభావమున్

ఆరణ్య – 5 – 77

భారత నిరుక్తి – ఎఱ్ఱన ధర్మోక్తి

విశ్వ శ్రేయస్సును కాంక్షించే మహనీయులే మహర్షులు. వారి అనుభవ సారాన్ని అంతటినీ పిండి, భారతీయుల జ్ఞాన తృష్ణను తీర్చినవారు మహర్షులు. నిర్వ్యాజమయిన కృప వారి యీ కృత్యానికి కారకం. జనహితాన్ని కోరి సమాహిత మనస్కులయిన మహర్షులలో అగ్రేసరుడు వేదవ్యాసుడు. భారతీయ సంస్కృతి కంతకూ మూలకందము అతదే. మహర్షులలో అతనికి మహితమయిన పరంపరా గతమయిన స్థానం ఉంది.

"కృష్ణద్వైపాయనాదయో యే ఋషయః తాన్ ఋషీగ్ం స్తర్పయామి" అని బ్రహ్మయజ్ఞంలో నిత్యమూ అతనిని కీర్తించడం భారతీయులకు పరంపరగా వస్తున్నది. దానికి కారణం మన కృతజ్ఞత మాత్రమే కాదు. తనలోని మహితత్వమూ, జనహితాన్ని నిర్వ్యాజంగా కాంక్షించే సత్త్వభావమూ, ప్రజలకు ఎంతమేలు చేయగలనా అనే తపన - అదే వారి తపస్సుకు పరమార్థం. ఆ పరమార్థ దృష్టితోనే వేదవ్యాసుడు భారతాన్ని వ్రాశాడు. ఈ క్రింది శ్లోకంలో వ్యాసుని తపన ఎంతటిదో గోచరిస్తుంది.

ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేషః
నచ కశ్చిచ్ఛృణోతి మామ్
ధర్మాదర్థశ్చ కామశ్చ
సధర్మః కిం న సేవ్యతే.

చేతులెత్తి మొరపెట్టుకొంటున్నాను. ఘోషిస్తున్నాను. ఒక్కడూ నా మాట వినిపించుకోవటం లేదు. ధర్మం నుండే అర్థమూ, కామమూ సంపాదించాలి. అనగా ధార్మికంగా అర్థం సంపాదించాలి, ధార్మికంగానే కామాన్ని సంపాదించాలి. అటువంటి ధర్మాన్ని ఎవడూ సేవించడే! ఏమిటీ వింత?

ఇందులో వ్యాస మహర్షి ధర్మానికెంత ప్రాధాన్యమిస్తున్నాడో, దాని కోసం ఎంత తపిస్తున్నాడో తెలుస్తుంది. ఆ తపనతోటే వ్యాసుడు మహాభారతాన్ని వ్రాశాడు. శిష్యుడయిన వైశంపాయనుని ద్వారా సవిస్తర మధురంగా ప్రచారం చేయించాడు.

వేదాలలో నిక్షిప్తములయి ఉన్న ధర్మాది చతుర్వర్గములను మందమధ్యమాధి- కారులకు తెలియచేయటానికే వ్యాసుడు భారతాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దాడు.

దాన్ని సాకల్యంగా గుర్తెరిగిన నన్నయ భారతాన్ని "కమనీయ ధర్మార్థ కామమోక్ష ములకు నత్యంత సాధనంబయిన దాని" అని కీర్తించాడు. సంస్కృత మహాభారతాన్ని వివిధ కోణాల్లోంచి దర్శించిన మహనీయులు ధర్మానికి పెద్దపీట వేసి యిలా కీర్తించారు.

ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ |
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ ||

ధర్మ విషయంలో కాని, అర్థ విషయంలో కాని, కామ విషయంలో కాని, మోక్ష విషయంలో కాని ఇందులో (భారతంలో) ఏదిఉందో అదే ఇతరత్ర ఉంది. ఇందులో లేనిది ఎక్కడాలేదు.

భారతీయ విజ్ఞాన సర్వస్వం మహాభారతం. వేదాలలో, ఉపనిషత్తులలో, స్మృతులలో, పురాణాలలో ఉన్న సర్వ విషయాల సారాన్నీ ఏకత్ర సమకూర్చి చిక్కని చక్కని కథతో రంగరించి విస్తర మధురంగా అందించాడు వ్యాస భగవానుడు. అందుకే నన్నయ -

ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని
యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిఁ గొనియాడు చుండ

వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాది ముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు

ఇన్ని విధాలుగా ప్రశస్తి కెక్కేటట్లు, విశ్వజనీనమయ్యేటట్లుగా వేదవ్యాసుడు భారతాన్ని రచించాడు. విశ్వజనులకు హిత మొనగూర్చునది - విశ్వజనీనం. ప్రజాహిత కాంక్షతో వ్యాసుడు మహాభారతాన్ని వ్రాశాడు.

సాహిత్యం యొక్క ప్రయోజనాలు స్థూలంగా రెండు. 1.ఆనందం 2.ఉపదేశం. ఈ రెండింటినీ భారతం సమగ్రంగా అందిస్తోంది. అందులో ఒకింత మొగ్గు ఉపదేశం వైపు చూపుతున్నట్లు మనకు కొన్ని సందర్భాలు సాక్ష్యమిస్తాయి. ఆరణ్య పర్వం, విదురనీతి, భగవద్గీత, శాంతిపర్వం, ఆనుశాసనికపర్వం మొదలయిన వీ సందర్భాలు. అంతేకాదు సమయం, సందర్భం చూసుకొని వ్యాసమహర్షి ఉపదేశం చేస్తూనే ఉంటాడు; స్వయంగా కాని, పాత్రల ముఖంగా కాని.

ప్రధానంగా ఈ ఉపదేశ దృష్టితోనే వ్యాసమహర్షి మహాభారతాన్ని వ్రాశాడు. అతని జన్మయే అందుకోసం. తానే ఆ విషయం శాంతి పర్వంలో చెప్పుకొన్నాడు.

నా చరితంబులుఁ ద్రైలో
క్యాచరణంబులును ధర్మమఖిలంబు మదిం
జూచి త్రికాలజ్ఞత్వ స
మీచీనత వెలయు మునులు మేటియనంగన్   6-524

ధర్మ సందేహములు నీవు నిర్మలంపు
వాక్యములఁ బాపి జగములవార లెల్ల
నఖిల సంశయచ్ఛేత్త పుణ్యాత్మకుండు
లోకహితవాణి యనఁగ సుశ్లోకుఁడగుదు   6-528

నారాయణుడు అన్న మాటలివి. వ్యాసుడు పూర్వజన్మలో అపాంతరతముడనే ముని. అతనికి త్రికాలజ్ఞత్వము నిచ్చి, ధర్మసర్వస్వం మదిలో కన్పడేటట్లు చేసి, ధర్మసందేహాలు తీర్చుమని నారాయణుడు ఆదేశించాడు.

అసలా ధర్మోపదేశం కోసమే మహాభారతం అవతరించింది. "మహత్త్వాత్ భారవత్వాచ్చ మహాభారతముచ్యతే" అని కదా, మహితమూ. భారయుతమూ కావడం వల్లనే దాన్ని మహాభారత మన్నాము. బరువయిన, విలువయిన భావాలకు నిలయం మహాభారతం

ఈ విషయాన్ని కవిత్రయంవారు సమగ్రంగా గ్రహించారు. నన్నయ "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" ఇత్యాదిగా, "సకల ధర్మంబులునుం దెలుపుటకునుగా నీ బంచమ వేదంబయి పరగు నిమ్మహాభారత సంహిత యొనర్చె" అని తిక్కన,

(స్వర్గ 81 వ) వివరించారు. వీరిరువురి నడుమ నన్నయ యొక్క సరస సారస్వతాంశ తనను చేరగా ఎఱ్ఱన ధర్మైక తత్పరతతో ఆరణ్య పర్వ శేషమును పూరించినాడు.

ఎఱ్ఱన ఆరణ్య పర్వ శేషమును పూరించి, చివరగా తనను గూర్చి యిట్లు చెప్పుకొనినాడు.

భవ్య చరిత్రుఁ డాప స్తంబ సూత్రుండు
శ్రీవత్స గోత్రుండు శివపదాబ్జ
సంతత ధ్యాన సంసక్త చిత్తుఁడు సూర
నార్యునకును బోతమాంబికకును
నందనుండిలఁ బాకనాటిలో నీలకం
ఠేశ్వర స్థానమై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు
ధన్యుండు ధర్మైక తత్పరాత్ముం
డెఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁ
డయిన నన్నయభట్ట మహాకవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తి దన్నుఁ
జెందుటయు సాధుజన హర్ష సిద్ధిగోరి 7-469

ఎఱ్ఱన తాను ధర్మైకతత్పరాత్ముడనని కంఠోక్తిగా చెప్పుకొన్నాడు. అతని కిరువైపుల ఇరువురు మహాకవులున్నారు. వారి కీర్తిప్రతిష్ఠలకు తక్కువ కాని రీతిలో తాను రచింపవలసి యున్నది. అందుకే ఎఱ్ఱనకు ధర్మైకతత్పరత ఆవశ్యక మయినది. ఆ ఏకాగ్రతతో వ్యవహరించిన ఎఱ్ఱన కవిత్రయహారంలో మధ్యనున్న నాయకమణి వలె విరాజిల్లుతున్నాడని రాధామాధవకవి కీర్తించాడు.

భారత కావ్యహార మొకభాగము నన్నయ భట్టొనర్చె ము
క్తారమణీయ వాక్యములఁ; దక్కిన భాగము సోమయాజి సొం
పార నొనర్చె; రెంటిఁగలయన్ శివదాసుఁడు మధ్య నాయక
శ్రీ రచియించె శారద ధరింపఁ గవిత్రయకీర్తి మించఁగన్.

ఎఱ్ఱనలోని ధర్మైకతత్పరతయే కవిత్రయహారంలో నాయకమణిగా తనను భాసింపజేసింది. దానికి తోడు ఎఱ్ఱనకు లభించిన భారతభాగం సయితం ఆ ధర్మైక

తత్పరతను ఇనుమడించేదయినది. భారతంలో ఉపదేశప్రాధాన్యమును సంతరించు కొనిన పర్వములు 1) ఆరణ్యపర్వం 2) శాంతిపర్వం 3) ఆనుశాసనిక పర్వం. ఇక పర్వాంతర్భాగాలలో ఉద్యోగపర్వంలో విదురనీతి, భీష్మపర్వంలో భగవద్గీత మొదలగునవి పేర్కొనదగినవి.

అరణ్యవాసం చేస్తున్న పాండవుల కడకు వ్యాసుడో, మార్కండేయుడో, బృహదశ్వుడో వచ్చి, ధర్మరాజుకు ధర్మోపదేశం చేయడం ఇందులో కనిపిస్తుంది. ఈ ఉపదేశం కథాపూర్వకంగా ఉంటుంది. సామాన్యంగా కథలో ఇమిడ్చి ఎన్నో ధర్మాలను ప్రపంచిస్తారు. వ్యాసమహర్షి పాండవుల అరణ్యవాసాన్ని నేర్పుగా ఉపయోగించుకొన్నాడు. ఆరణ్యపర్వంలో ప్రధాన కథాప్రసక్తి తక్కువ. కేవలం ఘోషయాత్ర మాత్రమే కనిపిస్తుంది ప్రధాన కథగా. అందులో కూడా ఎఱ్ఱన తన ధర్మైకతత్పరతను విడువక, శరణాగతరక్షణం మొదలయిన ధర్మాలను ప్రపంచిస్తాడు. చాలావరకు వ్యాసుడు వివరించిన ధర్మాలే, మరి ఎఱ్ఱన ప్రమేయమేమి?... అని శంకింప నవసరం లేదు. వ్యాసుని సూక్తులను తెనిగించుటకు కూడ అనువక్తలో ఏకాగ్రత ఆవశ్యకం. అది ఎఱ్ఱనలో పుష్కలంగా ఉంది. అదే అతని ధర్మైకతత్పరత. ఈ ధర్మైకతత్పరతతో ఎఱ్ఱన కొన్ని స్థలాల్లో కొన్ని మార్పులు కూడా చేశాడు. అవి మరింతగా ఔచితీసంధాయకము లయినవి.

ధర్మవ్యాధోపాఖ్యానంలో కౌశికునికి ధర్మవ్యాధుడు ఎన్నో ధర్మాలు చెప్పాడు. అన్ని ధర్మాలూ విని, కౌశికుడు ఇలా అన్నాడు "ఇంత ధర్మపరాయణుడ వయిన నీకు బోయ జన్మ ఎలా కలిగింది?" అని. అపుడు ధర్మవ్యాధుడు తన పూర్వజన్మ వృత్తాంతం చెప్పి, తాను మరల తర్వాత జన్మలో బ్రాహ్మణజన్మ ఎత్తుతానని చెప్పాడు. ఆ మాటలకు సంతృప్తుడయి కౌశికుడు "మరో జన్మవరకు ఎందులకు? నీ పుణ్య చరితవలన ఇప్పుడే నీవు విప్రుడవయ్యావు. బ్రాహ్మణుడయినా పాపవర్తనుడయితే శూద్రుని కంటె నీచుడే. సత్యమూ, శాంతమూ, ధర్మమూ ఆచరించేవాడు శూద్రు డయినా విప్రుడే అని మహర్షులు చెప్పారు. తాను చేసిన గుణదోషాల వల్లనే మేలు కాని, కీడుకాని కలుగుతూ ఉంటుంది. ప్రాజ్ఞులు ఈ రెంటినీ సమానంగా సాత్త్విక దృష్టితో చూస్తారు. ప్రియాలు తొలగినా, అప్రియాలు కలిగినా మూఢులకు హృదయ పరితాపం కలుగుతుంది. ప్రాజ్ఞులకు కలుగదు. అందుకే ఎవరికొరకూ, దేనికొరకూ

విచారింపరాదు. విచారం వల్ల తేజోహీనత సంభవిస్తుంది. దానితో తనకు హిత మయిన కార్యాన్ని తానే చేసుకోలేకపోతాడు. విచారాన్ని వదలి ప్రయత్నిస్తే శుభాలు కలుగుతాయి." అన్నాడు.

ఈ విషయాలు అన్నీ సంస్కృతంలో ధర్మవ్యాధుడు చెప్పినట్లుగా ఉన్నాయి. తెలుగులో అవి కౌశికుని చేత చెప్పించాడు ఎఱ్ఱన. ఈ మార్పులో ఎంతో ఔచిత్య ముంది.

జిజ్ఞాసు వయిన కౌశికునికి పతివ్రత ప్రేరణతో ధర్మవ్యాధుడు ఎన్నో ధర్మాలూ, ధర్మసూక్ష్మాలూ చెప్పాడు. ఉత్తమాధికారి అనిపించుకొనేటట్లుగా కౌశికుడు మధ్య మధ్యలో ఎన్నో జిజ్ఞాసాయుతమయిన ప్రశ్నలు వేశాడు. వాటికి ధర్మవ్యాధుడు తగినట్లు సమాధానాలు చెప్పాడు. ఈ చెప్పిన ధర్మాలన్నీ కౌశికుడు గ్రహించాడా? లేక ఈ చెవిని విని, ఆ చెవిని వదిలేశాడా? ఈ విషయం గురువయిన ధర్మవ్యాధునికి తెలియటానికి ఎఱ్ఱన ఈ మార్పు చేశాడు. తాను చేసిన ధర్మోక్తుల సారమంతా కౌశికుడు సూక్ష్మంగా మరల తనకే చెప్పాడు. అనగా ధర్మవ్యాధుడు చేసిన ధర్మోపదేశం సత్పాత్రదాన మయిన దన్నమాట. ఇటువంటి ఉభయ సంతర్పకమయిన మార్పు ఎఱ్ఱన చేశాడు. దానితో ఒక ఔచిత్యాన్ని చేకూర్చాడు. దానికి ఎఱ్ఱన ధర్మైకతత్పరత మూలమయినది. ఔచితీమహితములయిన యిట్టి మార్పులు చేసి, ఎఱ్ఱన మిగిలిన యిద్దరు కవులతో సమానంగా తూగగలిగాడు. ఇక ఎఱ్ఱన ధర్మోక్తి మాధుర్యాన్ని కథాసూత్రంతో సహా ఆస్వాదించుదాం.

శారద రాత్రులు :

వర్షర్తువు వెళ్లి శరదృతువు వచ్చింది. అందరికీ ఆనందం పంచింది. శరదృతువు వెన్నెలకు పెట్టింది పేరు. ఆ వెన్నెల రాత్రులలో ఆకాశంలో నక్షత్రాలు ముత్యాల హారాల వలె మెరుస్తున్నాయి. కలువలు వికసించి నూతన పరీమళాలు వెదజల్లు తున్నాయి. కర్పూరపుపొడి చల్లుతున్నట్లుగా తెల్లని చల్లని వెన్నెలలు కాస్తున్నాయి.

ఇక్కడితో నన్నయ కవిత్వం పూర్తి అయింది. చివరి పద్యం ఇది :

శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం
జారుతరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో

దార సమీర సౌరభముఁ దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండురుచి పూరములం బరిపూరితంబులై. ఆర-4-142

ఇక్కడ చివరి పాదంలో "పాండురుచి పూరము లంబరపూరితంబులై" – అని మరో పాఠం చెపుతారు. అందులో నన్నయ "పాండురుచి పూరములన్-పర పూరితంబులై" అని భారతరచన "పరులచేత పూరింపబడుతోంది" అనే భావాన్ని - సూచిస్తున్నాడని కూడా చెపుతారు. ఈ అర్థం నన్నయకు అభీప్సితమా? అంటే "ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతి" అని సమాధానం చెపుతారు. నన్నయ ఋషితుల్యుడనీ, వారి మాట ననుసరించి అర్థం వస్తుందనీ సమన్వయిస్తారు. ఇది ఎంత వరకు సముచితమూ, సమంజసమూ అనేది రసజ్ఞులే గ్రహించాలి. కాకపోతే ఈ విశ్లేషణలో కొంత చమత్కారం ఉంది. అంతే.

అరుణాంశువులు :

ఇక్కడ నుండి ఎఱ్ఱాప్రగడ కవిత్వము. ఆయన మొదటి పద్యం ఇది.

స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారద వేళఁ జూడఁగన్ ఆర-4-143

సూర్యోదయ సమయం శరత్కాలంలో ఆనందప్రదంగా ఉంది. ఆకాశంలో ఆవరించిన మేఘాలు విచ్చుకొన్నాయి. కమలాలు వికసించాయి. హంసలూ, సారసములూ, తుమ్మెదలూ విహరిస్తున్నాయి. వాటి ఝుంకారాలు వీనుల విందులుగా ఉన్నాయి.

ఇందులో అరుణాంశు శబ్దంతో తెలుగులో ఎఱ్ఱన సూచింపబడుతున్నట్టు, ఇప్పటి భారతరచనను ఆవరించి ఉన్న మేఘాలు తొలగిపోయాయనీ, సహృదయుల మనః కమలాలు వికసించాయనీ చెప్పడం కద్దు.

అగస్త్యోదయ మయింది. నీటి కాలుష్యం తరిగింది (బురద పోయింది). (దూదిపింజముల వంటి) తెల్లని మేఘాలతో ఆకాశం విలసిల్లింది. దాని ప్రతిబింబమా అన్నట్లు భూమి అంతా తెల్లని ఱెల్లు పొదలతో నిండి కలకల లాడింది.

పాండవులు అప్పటికి మరుభూమిలో ఉన్నారు. అక్కడ సరస్వతీ నదీ స్నానాలతో కొంతకాలం గడపి, తర్వాత ధౌమ్యాది విప్రులతో, ఇంద్రసేనాది భృత్యులతో కామ్యకవనం చేరారు.

ఒకనాడు పాండవులను చూడటానికి కృష్ణుడు వచ్చాడు. కుశల ప్రశ్నలయి, యోగక్షేమాలు తెలుసుకొంటూ ఉండగానే మార్కండేయ మహర్షి వచ్చాడు.

అతనిని ధర్మరాజు యథావిధిగా పూజించి యిలా అన్నాడు. "మహాత్మా! ధార్మికంగా ప్రవర్తించే మాకు కష్టాలూ, పాపబుద్ధులయిన దుర్యోధనాదులకు సుఖాలూ కలగడం చూస్తే నాకు కొద్ది సంశయం కలుగుతోంది. నరుడు తాను చేసిన కర్మకు ఫలం ఈలోకంలో పొందుతాడా లేక పరలోకంలో పొందుతాడా? లేక ఇక్కడా, అక్కడా కూడా పొందుతాడా? చెప్పండి. మరోసంశయం. "అసలు భగవంతుని చూడనివానిని కర్మఫలం పొందదా? ఈ శరీరంతో సహా ప్రారబ్ధం పోతుందా? వివరంగా చెప్పండి" అని అడిగాడు ధర్మరాజు.

కర్మఫలాలు :

అప్పుడు మార్కండేయుడు ఇలా చెప్పనారంభించాడు. "ధర్మరాజా! పూర్వం ప్రథమకల్పంలో మానవులను నిర్మల శరీరులుగానూ, ధర్మతంత్రజ్ఞులుగానూ విధి సృష్టించాడు. వారు మహా శక్తి సంపన్నులూ, సత్య సంకల్పులూ, సత్యవాదులూ, స్వచ్ఛందజీవులూ అయి ప్రవర్తించే వారు. అధిక ఫలసిద్ధి పొందేవారు. వారికి మాత్సర్యం ఉండేదికాదు. బహుసంతానంతో చాలాకాలం జీవించేవారు. ఆరోగ్యంతో దుఃఖరహితంగా జీవించేవారు. తరువాతి కాలంలో వారిని కామక్రోధాలు ఆవేశించాయి. మాయాప్రవర్తన నేర్చారు. దానివల్ల దేవతలకు దూరమయ్యారు. అల్పాయువులూ, దుర్బలులూ, దరిద్రులూ, రోగపీడితులూ, సంశయాత్ములూ, నాస్తికులూ అయి; పరస్పర ద్వేషాలతో పాపకృత్యాలు చేయసాగారు. దానివల్ల నరకం పొందడం మొదలు పెట్టారు. ఇటువంటి సంసారచక్రం ప్రారంభమయింది.

మానవులు పాపపుణ్యాలు చేసి, శరీరం విడిచిపోయేటప్పుడు నీడలాగా కర్మ వెంటాడుతుంది. దానివల్లనే దుఃఖార్హమో, సుఖార్హమో అయిన జన్మ లభిస్తుంది.

తత్రాస్య స్వకృతం కర్మ ఛాయేవానుగతం సదా |
ఫల త్యథ సుఖార్హోవా దుఃఖార్హో వాఽపి జాయతే ॥ సం.భా.ఆర.-181 25

మనుజులు పుణ్య పాపములు మానక యిట్లొనరించుచుం దుదిం
దనువుఁ దొఱంగిపోవునెడఁ దప్పదు నీడయవోలెఁ గర్మమున్
వెనుకొన నేఁగి భూరిసుఖ విస్మృతియుం బటుదుఃఖదైన్యముం
దనుకఁగఁ జేయుఁ గ్రమ్మఱఁగఁ దాన యొనర్చు భవంబు దేహికిన్
ఆర - 4-170

విను మనుజున కెవ్విధమునఁ
దన చేసిన సుకృత దుష్కృతంబులు నెరయం
దన కనుభవింపఁ బాలివి
తనువు సెడుంగాని కర్మతతి సెడ దనఘా! ఆర -4-171

తానుచేసిన పుణ్యంకానీ, పాపంకానీ మానవుడు అనుభవించి తీరవలసినదే. మరణంతో శరీరం నశిస్తుంది కాని చేసిన కర్మ మాత్రం నశించదు. అది వెంటాడుతూనే ఉంటుంది.

ఇక్కడ కర్మసిద్ధాంతం చెప్పబడుతోంది. మానవుడు ఏ పనిని సాధించాలన్నా, పురుష ప్రయత్నంతో పాటు దైవం కూడా అనుకూలించాలి. ఇక్కడ దైవం అంటే పూర్వకర్మ అని కర్మసిద్ధాంతం సమన్వయిస్తుంది. మానవుడు తాను పూర్వం చేసుకొన్న కర్మల యొక్క ఫలితాన్నే ఇపుడు అనుభవిస్తాడు. లోకంలో ఎవరయినా ఇపుడొక ప్రయత్నం చేస్తే దాని ఫలితం వచ్చేందుకు కొంతకాలం పడుతుంది. ఈనాడు ఒక విత్తు నాటితే, అది మొలకెత్తి, పెరిగి, వృక్షమై, ఫలాన్ని ఇవ్వాలంటే కొంత "కాలం" అవసరమవుతోంది. అనగా కాలపక్వమవుతోంది కర్మ. దాన్నే "కాలం, కర్మం కలిసి రావడం" అంటారు. అనగా ఈనాడు చేసిన కర్మ యొక్క ఫలితాన్ని భావిలో ఎప్పుడో అనుభవిస్తాము. అట్లాగే ఇప్పుడు అనుభవించేది పూర్వకర్మయొక్క ఫలితం. అంటే మానవుడు తాను చేసిన కర్మల ఫలితాన్నే తాను అనుభవిస్తున్నాడు. ఎవరో ఈ ఫలితాన్ని ఇస్తున్నారనటం తెలివితక్కువ అంటుంది కర్మ సిద్ధాంతం.

సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా
పరో దదాతీతి కుబుద్ధి రేషా |
అహం కరోమీతి వృథాభిమానః
స్వకర్మ సూత్ర గ్రథితో హి లోకః ||

"నేను చేస్తున్నానీ పని" అని అనుకోవడం కూడా వృథాభిమానం అంటాడు.

నై వాకృతిః ఫలతి నైవ కులం న శీలం
విద్యాపి నైవ న చ యత్నకృతాపి సేవా |
భాగ్యాని పూర్వతపసా కిల సంచితాని
కాలే ఫలంతి పురుషస్య యథైవ వృక్షాః || భర్తృహరి - నీతి - 97

మానవుని బుద్ధి కూడా ఆ కర్మనే అనుసరించి ప్రవర్తిస్తుంది. అందుకే "బుద్ధిః కర్మానుసారిణీ" అన్నారు. బుద్ధి ఒక్కటే కాదు - వారుచేసే ప్రయత్నాలూ, వారికి చేకూరే సహాయాలూ కూడా వారి భవితవ్యతనూ, కర్మను బట్టి కలుగుతూ ఉంటాయి. విజ్ఞానులూ, ప్రజ్ఞావంతులూ కూడా సమయానికి పొరపాటుపడి మరు క్షణంలో "అయ్యో" అనుకొనే సంఘటనలకు కారణం ఇదే అంటుంది సిద్ధాంతం.

ఇంతమంది జనులు ఉన్నారు కదా! వీరు ఎన్నో విధాల కర్మలు పూర్వం చేసి ఉంటారు. ఆ కర్మల ఫలితాలు సరిగా వారికే ఎట్లా చెందుతాయి? పొరబడటం కానీ, కలిసిపోయి తారుమారు కావడం కానీ జరగదా? అని సందేహం కలగవచ్చు. సందేహాన్ని చక్కని ఉపమానంతో నివారిస్తున్నాడు. వేలకొలదీ ఆవులున్నా దూడ తన తల్లి దగ్గరకేపోయి పాలు కుడుస్తుంది. అట్లాగే పొరబడకుండా పూర్వం చేసుకొన్న కర్మ, కర్తనే అనుసరించి వస్తుంది.

యథా ధేనుసహస్రేషు వత్సో విన్దతి మాతరమ్ |
తథా పూర్వకృతం కర్మ కర్తార మనుగచ్ఛతి ||

ఈ కర్మ అనేది పురుషులనే కాదు. పురుషోత్తముని కూడా అనుసరింపక విడవదు. దానికెక్కడా వైయర్థ్యం లేదు. పురుషోత్తమునికి కూడా బుద్ధి పొరబడటం ఈ కర్మ ఫలితమే అంటూ చమత్కారంగా ఈ ఉదాహరణ చెపుతారు.

రాముడు పురుషోత్తముడని కీర్తింపబడుతున్నాడు. అయినా రాముడు ఒకసారి పొరపడ్డాడట. రాముడు అరణ్యంలో ఉంటున్నాడు. తాను ఇంతకుముందు ఎన్నడూ బంగారు లేడిని చూడలేదు. అసలు బంగారు లేడి ఉండదనీ ఆయనకు తెలుసు. కాని, ఆ కనకమృగంకోసం పరువులెత్తాడు. అంటే సమయానికి బుద్ధి పెడతల నుందన్నమాట. పూర్వకర్మఫలితాన్ని బట్టి ఆపద సంభవిస్తూ ఉంటే బుద్ధి పని చెయ్యదు, సరికదా కలుషం కూడా అవుతుంది.

అసంభవం హేమమృగస్య జన్మ
తథాపి రామో లులుభే మృగాయ |
ప్రాయ స్సమాపన్న విపత్తి కాలే
ధియోఽపి పుంసాం మలినీభవన్తి ||

ఈ కర్మనే "విధి వ్రాత" "నుదుటి వ్రాత" అనడం కూడా కద్దు. "నుదుటన్ వ్రాసిన వ్రాత తప్పదు కదా" అనీ, "ఎవరుచేసిన కర్మ వారనుభవింపక ఏరికైనను తప్పదన్నా!" అనీ తెలుగునాట ఈ కర్మ సిద్ధాంతం బాగా ప్రచారంలోకి వచ్చింది.

అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. కర్మ సిద్ధాంతం సరిగా అవగాహనం చేసుకోకపోతే మనిషికి సోమరితనం అలవడే ప్రమాదముంది. "మన కర్మ ఎలా ఉంటే అలాగే జరుగుతుందిలే" అనుకొంటూ, నిర్వ్యాపారత్వం అలవరచుకొనే ప్రమాదం లేకపోలేదు. అందుకే దీన్ని ఉత్సాహపూర్వకంగా పురుష ప్రయత్నం చేసేందుకే సమన్వయించాలి. నిర్వేదం విడవాలి. అపుడే మానవునకు శ్రేయస్సు కలుగుతుంది. "చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహదేవా!" అన్నది మానవుని ఉత్సాహపూరితుని చేస్తుంది.

ఇక్కడ వక్త మార్కండేయుడు. శ్రోత ధర్మరాజు. ఇద్దరూ అర్హులూ, ఉత్తములునూ. గహనమయిన విషయాన్ని సులభంగా చెపుతాడు మహర్షి. సూచిస్తే అల్లుకుపోతాడు ధర్మరాజు. ఈ సిద్ధాంతాన్ని ధర్మరాజు ఎంత చక్కగా గ్రహించాడో కూడా చెపుతాడు యక్షప్రశ్నలకు ముందు. ఇప్పుడు ధర్మరాజుకు బోధ కలిగింది. అప్పుడు సమన్వయం. అనుభవపూర్వకంగా ధర్మజుని చేతనే చెప్పిస్తాడు. ఈ రెండు ఘట్టాలూ ఎఱ్ఱన రచనకు ఆద్యంతాలు కావడం యాదృచ్ఛికం.

మార్కండేయుడు కొనసాగిస్తున్నాడు.

ఇహపరలోక ప్రవృత్తిని గురించి మానవులలో నాలుగు విధాల ప్రజలుంటారు. ప్రజలంతా ఈ నాలుగు మార్గాల్లో ఏదో ఒక మార్గాన్ని అవలంబిస్తారు. 1) కొంత మంది కేవలం ఇహలోక దృష్టిమాత్రమే కలవారు. వీరికి పరలోకదృష్టి ఉండదు. 2) కొంతమంది కేవలం పరలోకదృష్టి కలవారు 3) మరికొంత మంది ఇహలోకం మీదనూ, పరలోకం మీదనూ దృష్టికలవారు. 4) ఇంకా కొంతమంది ఇహలోక దృష్టికాని, పరలోక దృష్టికాని లేనివారు.

ఇందులో మొదటిరకంవారు ఇట్లా ఉంటారు.

ధనములు సాలఁగల్గి సతతంబును నింద్రియ వాంఛ సల్పుచున్
మనమున నెన్నఁడున్ సుకృతమార్గము పొంతకుఁబోక లోభ మో
హ నిహత బుద్ధులై తిరుగునట్టి జనుల్ పరలోక సౌఖ్యముల్
గనుటకు నేర; రిప్పటి సుఖంబులు మేలయి తోచు వారికిన్ ఆర-4-175

వారికి ధనం పుష్కలంగా ఉంటుంది. నిరంతరమూ వాంఛిస్తూ ఉంటారు. ఎన్నడూ సుకృతం జోలికి పోరు. ఇంద్రియ సౌఖ్యాలు, లోభమూ, మోహమూ ఆవేశించి, తిరుగుతూ ఉంటారు. వారు పరలోక సౌఖ్యాలను చూడలేరు. వాటిపై దృష్టి ఉండదు. ఇప్పటి సుఖాలే వారికి మేలుగా కనిపిస్తాయి.

ఇక మరోరకం ప్రజలు - రెండవ తెగ -

ఉపవాసవ్రత సంతతాధ్యయన తీర్థోపాసనాది క్రియై
కపరత్వంబునఁ జేసి యైహికము దుఃఖప్రాయమై పోవఁగా
విపులానందముఁ బొందఁగల్గుఁ దుది నావిర్భూత భోగైక లో
లుప బుద్ధిం జిరపుణ్యశీలురకు నాలోకంబునన్ భూవరా! ఆర-4-176

వారు ఎప్పుడూ ఉపవాసాలూ వ్రతాలూ చేస్తూ ఉంటారు. సంతతమూ అధ్యయనం చేస్తూ ఉంటారు. తీర్థాలు సేవిస్తూ ఉంటారు. ఉపాసనాపరులై యుంటారు. ఇహలోకం వారికి దుఃఖప్రాయంగా కనిపిస్తుంది. ఆ విధంగా పుణ్యశీలురయిన వారికి పరలోక భోగబుద్ధి ఏర్పడుతుంది. వీరికి పరలోకమే మంచిదిగా తోస్తుంది.

ఇక మూడవ తెగవారు -

ధర్మమ సల్పుచుం దగిలి ధర్మపథంబునఁజేసి యర్థముం
బేర్మియుఁ గాంచి ధర్మవిధిఁ బెండిలియై ప్రజలన్ సృజించి స
త్కర్మములన్ బ్రశస్తములుగాఁ గ్రతువుల్ పొనరించు సజ్జనుల్
ధర్మజ! యిందు నందును ముదంబునఁ గాంతు రభీష్ట సౌఖ్యముల్

ఆర-4-177

వీరికి ఈలోకమూ, పరలోకమూ కూడా మేలుగా కనిపిస్తాయి. ధర్మం ఆచరిస్తూ ఉంటారు. ధర్మమార్గంలోనే ధనాన్నీ, ఉన్నతినీ పొందుతారు. ధర్మవిధిగా వివాహమడి, బిడ్డలను కని, సత్కర్మాచరణం చేస్తూ ఉంటారు. ఈ స్వభావం కలవారు. ఇహపర లోకాలు రెండింటిలోనూ సఖసంతోషాలు పొందుతారు.

ఇక నాల్గవ తెగ ప్రజలు.

సత్యమును శమంబు శౌచంబు లేక నా
స్తిక్యమును నిషిద్ధ సేవనంబుఁ
గలిగి తిరుగు దుష్టకష్ట జనశ్రేణి
పొలియు నుభయ లోకములకుఁ గాక ఆర-4-178

వీరికి సత్యమూ, శమమూ, శుచిత్వమూ ఉండవు. నాస్తికులయి ఉంటారు. నిషిద్ధమయిన మద్యమూ, మహిళ మొదలయిన వానిని సేవిస్తూ ఉంటారు. కానిపనులు చేస్తూ ఉంటారు. అటువంటి దుర్మార్గులు ఈలోకానికి, పరలోకానికి కూడా కాకుండా పోతారు. ఉభయ భష్టులవుతారు.

ఇది మానవుల కర్మగతి.

అయితే ఇక్కడొక సందేహం కలుగవచ్చు. మానవుడెల్లప్పుడూ ఏదో ఒకపని చేస్తూనే ఉంటాడు. దానివల్ల సుకృతమో, దుష్కృతమో లభిస్తూనే ఉంటుంది. ఈ లభించిన పుణ్యపాపాలు అనుభవించటానికి మరో జన్మ ఎత్తాలి. ఆ జన్మలో మళ్ళీ పుణ్యపాపాలు ఆచరిస్తాడు. వాటి ననుభవించడానికి మళ్లీ జన్మ ఎత్తాలి. ఈ జన్మ చక్రం ఇట్లా తిరుగుతూ ఉండవలసినదేనా - దీనికేమయినా తప్పించుకొనే మార్గ మున్నదా?...అంటే...

"ఉంది" అని సమాధానం. ఈ విషయం ధర్మవ్యాధోపాఖ్యానంలో చక్కగా వివరింప బడింది.

ఈ కర్మగతిని తెలిసికొన్న వాడెన్నడూ పాపము పొంతకుపోడు. అహంకారమూ, మత్సరమూ విడిచి సంచరిస్తాడు. ధర్మమార్గాన్ని అవలంబిస్తాడు. ధర్మ మార్గంలోని మాధుర్యం తెలిసినవాడు సత్క్రియలు ఆచరిస్తాడు. ధర్మపూర్వకమయిన సత్కర్మలు ఆచరిస్తే, కొంతకాలానికి మనస్సు నిర్మల మవుతుంది. ప్రసన్నమవుతుంది. అప్పుడు అతనికి ఇంద్రియ సుఖాలు వ్యర్థములుగా, మిథ్యలుగా కనిపిస్తాయి. దానితో వాటిని నిరసించి, సత్యధర్మవర్తనతో శమదమాలతో తపస్సులో స్థిరపడతాడు. అప్పుడు జ్ఞానం కలుగుతుంది. అప్పటిదాకా కర్మ వెంటాడుతూ ఉంటుంది. జ్ఞానం కలిగిన తర్వాత చేసే పనులవల్ల పుణ్యపాపాలు ఆ జ్ఞానికి అంటవు. అంత వరకు లభించిన పుణ్యపాపాలు అనుభవించి, హరింప జేసుకొంటాడు జ్ఞాని. దానితో అతనికి ఈ కర్మ చక్రంనుండి విముక్తి లభిస్తుంది. మోక్షం కలుగుతుంది.

అనగా సత్కర్మాచరణం వల్ల క్రమంగా జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వల్ల మోక్షం కలుగుతుంది. ఇదే భావాన్ని ఈ శ్లోకభాగం సూక్ష్మరూపంలో వెలువరిస్తుంది.

కర్మణా జాయతే జ్ఞానం జ్ఞానా త్కర్మ వినశ్యతి

పువ్వునుండి ఫలం పుడుతోంది. ఫలం పుట్టాక పువ్వు నశిస్తుంది. అలాగే సత్కర్మ నుండి జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం వలన కర్మ నశిస్తుంది.

మార్కండేయ మహర్షి ఇంకా ఇలా కొనసాగించాడు. "ధర్మరాజా! మీరు దివ్యులు. దేవహితంకోసం భూమి మీద పుట్టారు. ప్రశస్త పరాక్రమంతో శత్రుసంహారం చేసి, భూభారం తీర్చి, మళ్ళీ దేవభావం పొందుతారు"

ఈ మాటలు విన్న ధర్మరాజు విప్ర ప్రభావాన్ని గురించి ప్రశ్నించాడు వెంటనే. మహర్షి ఇలా చెప్పాడు.

పూర్వం హైహయ వంశంలో పుట్టిన ధుంధుమారుడనే రాజకుమారుడు వేటకు వెళ్ళాడు. ఒకచోట ఒక విప్రుడు జింక చర్మం కప్పుకొని, ఒక పొదరింటిలో తపస్సు చేసుకొంటున్నాడు. ధుంధుమారుడు దూరాన్నుంచి మృగం అనుకొని బాణంతో ఆ విప్రుని కొట్టాడు. వెంటనే అతడు నిశ్చేతనుడయి పడిపోయాడు. అది

చూసి ధుంధుమారుడు ఎంతో దుఃఖించాడు. తన వంశ వృద్ధులకు ఈవిషయం చెప్పి, వారిని తీసుకొనివచ్చి అతని కళేబరం చూపించాడు. వారు చాలా దుఃఖించి, దగ్గరలో ఉన్న తార్క్ష్యుడనే మహర్షి ఆశ్రమానికి వెళ్ళి, అతనికీ విషయం నివేదించారు. అతడు నవ్వుతూ ఇలా అన్నాడు. “మా ఆశ్రమంలో ఎన్నడూ, ఎవరికీ భయం కానీ వ్యాధి కానీ మృత్యువు కానీ కల్గదు. ఇది మీకు ఆశ్చర్యకరంగా ఉంటుంది.” అని తన పుత్రుని చూపించి “ఇతడే కదా ఆ మహర్షి?” అని అడిగాడు. అవునన్నారు అందరూ. వారికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. “చనిపోయినవాడు మళ్ళీ ఎట్లా బ్రతికాడు?” అని అడిగారు. వెంటనే ఆమహర్షి “మాకు సోమరితనం లేదు. మా ఆహారం శుచియైనది. నిత్య కర్మలను మేము విస్మరించము. అతిథిపూజలు చేస్తాము. సత్యమే పలుకుతాము. శాంతి వహిస్తాము. బ్రహ్మాచర్య దీక్ష పూని ఉంటాము. అందుచేత మాకు ఎన్నడూ రోగభయం కాని, మృత్యుభయం కాని కల్గదు. ఇది మా ప్రభావం. మీకు దీనివల్ల ఏమీ పాతకం కల్గలేదు. వెళ్లిరండి” అన్నాడు. హైహయులంతా సంతోషంతో వెనుదిరిగి వెళ్లారు. ఇది విప్రప్రభావం.

మార్కండేయుడు బ్రహ్మక్షత్ర స్వరూపం వివరించే మరోకథ ఇలా చెప్పాడు.

అత్రి అనే విప్రుడు తపస్సు చేసుకొనటానికి అడవికి వెడుతూ, భార్యతో “నీవు నాతో వస్తావా? కొడుకుల దగ్గర ఉంటావా” అని అడిగాడు. ఆమె ఇలా అంది “పుత్రులను కుటుంబ భారవృత్తులలో స్థిరపరచకుండా మీరు గృహస్థాశ్రమం వదలి, వానప్రస్థాశ్రమం స్వీకరించడం ధర్మంకాదు”. అత్రికి భార్యమాటలు సమంజసములే అనిపించింది. అపుడు అత్రి వైన్యుడనేరాజు దగ్గరకు వెళ్ళి ఆశీర్వాద పురస్సరంగా ఇలా ప్రశంసించాడు. “రాజా! నీవే విధాతవు. ఇంద్రుడవు. నీకు అన్ని ధర్మాలూ తెలుసు. నీవంటి రాజులీలోకంలో ఎవరూలేరు. అందుకే మునీంద్రు లంతా నిన్ను కొనియాడుతారు” అన్నాడు.

ప్రక్కనే ఉండి ఈమాటలు వింటున్న గౌతమునికి కోపం వచ్చింది. “ఇతడే విధాతయా! ఇతడే ఇంద్రుడా! ఇతడే ఈశ్వరుడా! ఎందుకట్లా ధనకాంక్షతో నోరరిగేటట్లు పేలుతావు?” అన్నాడు గౌతముడు. అపుడు అత్రి “ఎందుకలా యుక్తాయుక్తాలు తెలియక మాట్లాడుతావు? నిర్మలమయిన నీతి పరాక్రమాలతో

ధార్మికంగా పరిపాలించే రాజును నేను ప్రశంసించడం తప్పా?" అన్నాడు. దానికి గౌతముడు ఇలా అన్నాడు.

కలయ నరలు వచ్చి తల తెల్లనైనంతఁ
జేసి నీకు నెట్లుఁ జేరు నెఱుక
జ్ఞానవృద్ధుఁడైన వాని మాటలు గదా
సభలఁ జెల్లు నార్య జనుల కెక్కి 4-4-200

ముసలితనంతో నీకు తల నెరిసింది కాని జ్ఞానం కలగలేదు. సభలో జ్ఞాన వృద్ధుని మాటలే చెల్లుతాయి - వాటినే ఆర్యులు ప్రశంసిస్తారు.

ఇట్లా వాదించుకొంటూ ఉండగా కాశ్యపుడు "వీరి వివాదం సనత్కుమారుడు తీర్చగల" దని చెప్పాడు. వెంటనే సభ్యులంతా సనత్కుమారుని దగ్గరకు వెళ్ళారు. విషయం నివేదించారు. అతడు ఇలా అన్నాడు "అత్రి చెప్పింది నిజం, ధర్మయుక్తం కూడా. ఈ భూభారమంతా వహించేవాడు రాజు. ఈ ప్రజలందరినీ రక్షించేవాడు రాజు. శత్రు సంహారం చేసేవాడు రాజు. అందుచేత రాజు ఇంద్రుడూ అవుతాడు, ఈశ్వరుడూ అవుతాడు, విధాతా అవుతాడు.

రాజు జనులందరికీ పూజ్యుడు. అతని శాసనం వల్లనే సజ్జనులూ, మునులూ ధర్మమార్గం విడువకుండా ప్రవర్తిస్తున్నారు. ఎవ్వరూ అతని శాసనం దాటరాదు కూడా.

జనులకు నెల్లనుఁ బూజ్యుఁడు
జనపాలుం డతని మహిత శాసనమున స
జ్జనులును మునులను సద్విధిఁ
జనువారలు గాక కడవఁ జనదెవ్వరికిన్. ఆర - 4-203

వేదాలు సయితం రాజును "విరాట్టు, సమ్రాట్టు, విధిజితుండు, సత్యమన్యుడు, యథాజీవుడు, ధర్ముడు అని కీర్తిస్తున్నాయి. పూర్వం విప్రులు అధర్మానికి జంకి, తమ తేజో బలాలను క్షత్రియులలో ఉంచారు. బ్రహ్మక్షత్ర ధర్మాలు రెండూ పరస్పర సంశ్రయాలు. పరస్పర పోషకాలు."

అని క్షత్రియ ధర్మ విశిష్టత చెప్పి, "రాజు సర్వాధికు"దని చెప్పాడు. ఆ మాటలు సభ్యులంతా విని, సంతసించి వైన్యుడికి చెప్పారు. అతడూ సంతోషించి, అత్రి కోరిన ధనం ఇచ్చాడు. అత్రి దానిని పుత్రులకు ఇచ్చి, సుఖంగా తాను వనాలకు తపస్సుకై వెళ్ళిపోయాడు.

సరస్వతీ గీత :

తరువాత మార్కండేయుడు ధర్మరాజుతో సరస్వతీ గీత యిలా చెప్ప నారంభించాడు - పూర్వం తార్క్ష్యుడనే ముని సరస్వతీ దేవి నారాధించాడు. ఆ దేవిప్రత్యక్ష మయితే, ఆ మహర్షి "పురుషున కేది ధర్మం? ఏ ధర్మం ఆచరించి మానవుడు చిరకాలం పుణ్యగతులు పొందుతాడు?" అని అడిగాడు. అతనితో ఆ సరస్వతి దేవి యిలా అంది.

"విప్రుడు వేదాధ్యయనం చేసి, యజ్ఞాదికములు చేస్తే చిరకాలం సర్వసుఖాలు అనుభవిస్తాడు. దూడతో కూడిన తొలియీత ఆవును అర్హుడయిన వానికి దానం చేస్తే, చాలకాలం పుణ్యలోకాలు కలుగుతాయి. బలాఢ్యమయిన వృషభాన్ని దానం చేస్తే పది గోదానములు చేసిన ఫలం కలుగుతుంది. వస్త్రదానం సమగ్రంగా చేసినవాడు చంద్రలోకానికి, సువర్ణదానం చేసినవాడు స్వర్గానికి చేరుతారు. అగ్నిహోత్రం నారూపమే. అగ్నిహోత్రుని, తద్ద్వారా దేవతలను తృప్తిపరచినవాడు నన్ను తృప్తి పరచినవాడు. అటువంటి వారు ఆత్మజ్ఞులవుతారు. వారి సంశయాలన్నీ తీరుస్తాను. ఎల్లప్పుడూ అధ్యయనంచేస్తూ, దానవ్రత పరాయణులయిన తపస్వులు దుఃఖ రహితులై ఎక్కడ ఉంటారో అక్కడ నేనుంటాను."

అపుడు తార్క్ష్యుడు సరస్వతీ దేవికి సమస్కరించి, యిలా ప్రార్థించాడు.

అంబ! నవాంబుజోజ్జ్వల కరాంబుజ! శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్స్ఫుట భూషణ రత్నరోచి రా
చుంబిత దిగ్విభాగ! శ్రుతి సూక్త వివిక్త నిజప్రభావ! భా
వాంబర వీథి విశ్రుత విహారి! ననున్ గృపఁజూడు భారతీ! ఆర - 4-215

అమ్మా! నీవు చేతిలో పద్మాన్ని ధరించావు. శరత్కాలపు వెన్నెల వలె స్వచ్ఛమయిన రూపం కలదానవు. నీ భూషణాల రత్న కాంతులతో దిక్కులన్నీ

ప్రకాశిస్తున్నాయి. నీ ప్రభావం వేదసూక్తాలలో వివేచింపబడుతుంది. మా (భావము లనే) మనస్సులనే ఆకాశవీథులలో స్వేచ్ఛగా విహరిస్తూ ఉంటావు. సరస్వతీ నన్ను కరుణించు.

అని స్తుతించి, అతడు కృతార్థుడయ్యాడు. ఈ పద్యం తెలుగునాట బాగా ప్రచురమయింది. ఈ పద్యంతో సరస్వతీ ప్రార్థన చాలమంది చేస్తారు. పోతన కూడా ముచ్చటపడి తన భాగవతం ఇష్టదేవతాస్తుతిలో దీనిని చేర్చుకొన్నాడు.

ఇది సరస్వతి దేవి చేత చెప్పబడింది కనుక సరస్వతీగీత అన్నారు. భగవంతుని చేత చెప్పబడిన దానిని భగవద్గీత అన్నారు.

తరువాత మార్కండేయుడు ధర్మరాజు కోరికపై వైవస్వత మనువు చరిత్ర ఇలా చెప్పాడు. చాక్షుష మన్వంతరంలో వైవస్వతుడు పదివేల సంవత్సరాలు ఊర్ధ్వ బాహుడై, ఒంటి కాలిమీద తపస్సు చేశాడు. ఒకరోజున అతడు స్నానంచేసి, చెరువు గట్టున ఉండగా ఒక చేప తీరానికి వచ్చి యిలా అంది. “అయ్యా! నేను చిన్న చేపను. మిగిలిన జలచరాలు నన్ను చంపివేస్తాయని భయపడుతున్నాను. నన్ను దీనిలో నుండి తీసి భద్రంగా మరోచోటు చేర్చు”. అతడలాగే చేసి దానిని ఒక నూతిలో ఉంచాడు. అది క్రమక్రమంగా పెరుగ సాగింది. అక్కడనుండి చెఱువుకు, అక్కడినుండి సముద్రానికి దాన్ని చేర్చాడు. అప్పుడా చేప ఇలా అంది.

“నీవు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయాలనిపిస్తోంది. నా మాటలు విను. కొద్దికాలంలో ఈ మన్వంతరం పోయి, మరో మన్వంతరం వస్తుంది. రెండు మన్వంతరాల సంధికాలంలో ప్రళయం సంభవిస్తుంది. సముద్రాలన్నీ పొంగుతాయి. అపుడు నీవు ఒక ఓడ చేసుకొని, దానిమీద సకల ధాన్యాలూ, ఒక పెద్దత్రాడూ, సప్త మహర్షులనూ ఉంచుకొని సముద్రతీరంలో నన్ను ధ్యానించు. నేను పెద్దకొమ్ము కలిగిన ఒక చేప రూపంలో నీకు సాక్షాత్కరిస్తాను. నీకు మేలు జేస్తాను”.

కొంతకాలానికి చేప అన్నదంతా జరిగింది. ఆ చేప చెప్పినట్లే వైవస్వతుడు చేశాడు.

చేప వచ్చింది. తన కొమ్ముకు త్రాటితో ఓడను బంధించి, లాగుకొని పోయింది. సముద్రాలన్నీ పొంగి, భూమి అంతా ఏకార్ణవమైపోయింది. తరువాత కొంత కాలానికి వెల్లువ తగ్గింది. అపుడా చేప ఆ ఓడను హిమవత్పర్వత సమీపంలో నిలిపి, ఒక పర్వత

శృంగానికి ఓడను కట్టమని చెప్పింది. వారు అలాగే చేశారు. (దానినే యిప్పుడు నౌకాబంధమని అంటారు) అపుడా చేప వారిని చూసి, "నేను మీకు ప్రళయభయం లేకుండా చేశాను. ఇక మీరు నిర్భయంగా ఉండవచ్చు. ఇతడు మనువు. నా అను-గ్రహంతో ఇతడు జ్ఞానియై సృష్టి చేస్తాడు" అని చెప్పి, అదృశ్య మయింది ఆ మత్స్యం.

ఆ తరువాత వైవస్వత మనువు ఎంతో తపస్సుచేసి సృష్టికార్యం నిర్వహించాడు. ఇప్పుడు జరుగుతున్న మన్వంతరం పేరు వైవస్వత మన్వంతరమే.

పిమ్మట ధర్మరాజు మార్కండేయునితో "మహర్షీ! నీవు చిరంజీవివి. నీవు ఎన్నో ప్రళయాలు చూసి ఉన్నావు. ప్రళయకాలం ఎలా ఉంటుంది? వివరంగా చెప్పండి" అని అడిగాడు. అతడు భగవంతుడయిన కృష్ణుని ధ్యానించి "అతని ఆజ్ఞతో నీకు చెపుతున్నాను, విను" అని ఇలా చెప్పనారంభించాడు.

"యుగాలు నాలుగు - కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియగం. ఇవి నాలుగూ 12 వేల దివ్య సంవత్సరాల్లో పూర్తి అవుతాయి. దాన్ని ఒక మహా యుగం అంటారు. వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక రోజు. ఆరోజు చివర నూరు సంవత్సరాల పాటు అనావృష్టి ఏర్పడి, సూర్యుడు తీక్షణంగా ప్రకాశించి, మూడు లోకాలనూ భస్మం చేస్తాడు. అపుడు సంవర్త వలాహకములనే మేఘాలు వచ్చి, వర్షించి, భూమ్యాకాశాలు ముంచెత్తుతాయి. పెద్ద చీకటి ఆవరిస్తుంది. ఒక గాలి వీచి, ఆ మేఘాలు తొలగిపోతాయి. ఆ నీటి నడుమ తామరాకుపై భగవంతుడు నిద్రిస్తాడు. ఇటువంటి కల్పాంతములు చాలా జరిగాయి. ఇక ముందూ జరుగుతాయి.

ఒక్క విషయం. జరిగిన కల్పాంతంలో నేను చీకట్లో దిక్కుతోచక భయంతో తిరుగుతుండగా, ఒకచోట నీటిలో ఒక మఱ్ఱిచెట్టు కనపడింది. దానిఆకుమీద సూర్య తేజస్కుడయిన ఒక బాలుడు కనపడ్డాడు, ఆశ్చర్యంతో అతనిని సమీపించాను. అతడు నాతో గంభీరంగా 'నీవు అలసిపోయావు. విశ్రాంతి కావాలంటే నా శరీరంలో ప్రవేశించి, సుఖంగా శయనించు' అంటూ నోరు తెరిచాడు. నాకు తెలియకుండానే పెద్ద గాలి వీచి, నన్ను అతని నోటిలోనికి త్రోసివేసింది.

అక్కడ గంగాది నదులూ, మేరువు మొదలయిన పర్వతాలూ, వివిధ పట్టణాలూ, బహుకార్య రతులయిన ప్రజలూ, పశు పక్ష్యాదులూ, భూమీ, ఆకాశమూ, సూర్య చంద్రులూ, పవన మండలాలూ, స్వర్గమూ, దేవతలూ, ఇంద్రాదులూ, యక్ష

రాక్షసాదులూ - ఒక టేమిటి సర్వమూ చూశాను. అట్లా అతని ఉదరంలో, నూరేళ్లు తిరిగాను. ఎక్కడా నాకు కాలు నిలువలేదు. మనసు నిలువలేదు. ఆ బాలుని పాదపద్మాలు స్మరించాను. వెంటనే అతని నోటిలోనుండి బయట పడ్డాను. అతనికి నమస్కరించి, అతని మహిమనుగూర్చి చెప్పుమని అడిగాను." అతడు కరుణించి యిలా అన్నాడు.

"నీవు పితృభక్తుడవు. కాబట్టి నీకు చెపుతున్నాను. విను. నారములంటే నీళ్లు. అవి నిలయంగా ఉండేవాడను కాబట్టి నన్ను నారాయణుడంటారు. నేను ఈ లోకాలను సృష్టించి, పోషించి, సంహరిస్తాను. చిదానందస్వరూపుడను. బ్రహ్మ, ఇంద్రుడు, ఈశ్వరుడు, మొదలయిన దేవతలంతా నారూపాలే. నాకు భూమి పాదాలు. అగ్ని నా ముఖం. సూర్యచంద్రులు నా కళ్లు. ఈ ఆకాశం నా శిరస్సు. ఇటువంటి అద్భుత రూపం నాది. క్రోధము, అహంకారము, అసూయ - లేని సత్యసంధు లయిన జనులు మోక్షాపేక్షతో నన్ను సేవించి తరిస్తారు. ఈ లోకంలో కనపడేవి, కనపడనిని కూడా నేనే. నేనే అన్నిటా ఉన్నాను. నిర్మలమయిన మనస్సుతో ఊహించు. నీకే తెలుస్తుంది.

ఎప్పుడు ధర్మహాని యగు, నెప్పు డధర్మము మీఱుఁ గ్రూరులై
యెప్పుడు దైత్యు లుబ్బుదురు హీనతఁ బొందుదు రెప్డు వేల్పు లే
నప్పుడు సత్కులీనుల గృహంబుల నుద్భవ మొంది లీలమై
నెప్పటి యట్ల నిల్పుదు సురేంద్రుల నంచిత ధర్మ పద్ధతిన్ ఆర-4-276

ధర్మహాని కలిగి, అధర్మం విజృంభించినపుడు, రాక్షసులు విజృంభించి దేవతలు దైన్యం పొందినప్పుడు, సద్వంశస్థుల యిళ్ళలో పుట్టి, యథాపూర్వంగా ధర్మం స్థాపిస్తాను.

(ఇదే విషయం భగవద్గీతలోనూ
యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత |
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ |

అనీ

ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే
అనీ చెప్పబడింది.)

నావిషయ మంతా నీకు చెప్పాను. కల్పాంతం చూసి భయపడిన నీమీద అనుగ్రహం కలిగి, యిదంతా చెప్పాను. ఇక నీకు భయం లేదు. నా నాభికమలంలో నుండి పుట్టి, బ్రహ్మ లోకాలను సృష్టిస్తాడు. నీవు చూస్తావు" అంటూ అంతర్ధాన మయ్యాడు. అంతా అట్లాగే జరిగింది. స్వర్గంలో కృష్ణుని చూశాను. ఇప్పుడిక్కడ చూశాను. అతడే యితడు. ఇతని కరుణ వల్లనే నాకు ఇప్పుడే పూర్వస్మృతి కలిగింది. అందుచేత ఈ కృష్ణుని శరణు పొందు" అన్నాడు మహర్షి.

అప్పుడు ధర్మరాజు అనుజ సహితంగా కృష్ణుని ప్రశంసించాడు. తరువాత మార్కండేయుని కలియుగ లక్షణాలు అడిగాడు. అతడిలా చెప్పసాగాడు.

కలియుగ లక్షణాలు :

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాల (4/4) నడుస్తుంది. త్రేతాయుగంలో మూడు పాదాలు (3/4), ద్వాపరయుగంలో రెండుపాదాలు (2/4), కలియుగంలో ఒక పాదమూ (1/4) ధర్మం నడుస్తుంది. సత్యం తరిగిపోతుంది. దానితో ఆయువు తగ్గిపోతుంది. విద్యలు క్షీణిస్తాయి. అల్పవిద్యతో మోహం ఏర్పడుతుంది. దానితో లోభమూ, కామమూ, క్రోధమూ, వైరమూ క్రమంగా ఉద్భవిస్తాయి. ఈ వైరంతో జనులంతా ఒకరినొకరు పీడించుకొంటారు. ఒకరి బుద్ధిని మరొక రంగీకరించరు. వర్ణసంకరం ఏర్పడుతుంది. విప్రులు జపతపాలూ, అధ్యయనమూ విడిచివేస్తారు. జనపదాలన్నీ ధర్మం విడిచి అరాజకాలవుతాయి. రాజులు స్వీయధర్మాన్ని విడిచి సంచరిస్తారు. రసగంధద్రవ్యాలు పసచెడిపోతాయి. పంటలు తగ్గిపోతాయి. పాడి తక్కువయి పోతుంది. చెట్లకు కూడా ఫలపుష్పాలు తరిగిపోతాయి.

రాజులు ప్రజలనుండి పన్నులు అధికంగా లాగుతారు. ప్రజలను రక్షించక భయపెడతారు. విప్రులు వర్తకం చేస్తారు. శరీరాన్ని బాగా పోషించుకొంటారు. పుణ్యఫలాలు బొంకులని నిందిస్తారు. సమయానికి వర్షాలు పడవు. విత్తనాలు ఎక్కువపాలు పొల్లు లవుతాయి. క్రయ విక్రయాల్లో మోసం ఎక్కువవుతుంది. ఇల్లడ పెట్టిన సొమ్ములు (దాచుకొన్నవి) అపహరిస్తారు.

సుజనులు దుర్గతిపాలై అల్పకాలంలో చనిపోతారు. పాపాత్ములు ఆయువునూ, సిరినీ పొందుతారు. గొడ్డెలపాడి ఎక్కువవుతుంది. పురుషులకు స్త్రీలే చుట్టా లవుతారు. అందరూ మాంసం భుజిస్తారు. పితృకార్యంలోనూ, దైవకార్యం లోనూ

విప్రులు దొరకక ఇతరేతర భోక్తలవుతారు. (వీరింట వారు - వారింట వీరు భోక్త లవుతారు)

దేశకాల పాత్రాదులు నశిస్తాయి. హేతువాదులు ప్రబలుతారు. వేదనింద చేస్తారు. యజ్ఞాలూ, వ్రతాలూ విడిచి దుర్మార్గంలో ప్రవర్తిస్తారు! స్త్రీ వ్యసనానికి పురుషులు లోబడతారు. దీనుల, బంధుల సొమ్ములు అపహరిస్తారు. స్నేహితులనూ, తల్లిదండ్రులనూ, పుత్రులనూ సయితం చంపడానికి వెరవరు. మంచి చెడు విచక్షణ లేకుండా ఏది తోస్తే అది చేస్తారు. అటువంటి వారిని జనులు ధనాశతో పూజిస్తారు కూడా.

రాజులు ప్రజారక్షణం చేయరు. సజ్జనులను చూస్తూ ఉండగానే దోచుకుంటారు. వారి స్త్రీలనూ, భూములనూ, ధనములనూ ఆక్రమిస్తారు. రాజులు పరస్పరమూ కలహించుకొని జననష్టం కలిగిస్తారు.

తండ్రిని కొడుకు అవమానిస్తాడు. భార్య భర్తను అవమానిస్తుంది. భార్యా భర్తలు ఒకరినొకరు మెచ్చక విచ్చలవిడిగా తిరుగుతారు. దేవకార్యాలూ, పితృకార్యాలూ నడవవు. వేదార్థం ఉపదేశించే పరిస్థితి ఉండదు. మోహం అందరినీ ఆవహిస్తుంది. భూమి అంతా దుర్జనులతో నిండిపోతుంది.

పదహారు సంవత్సరాలు పూర్ణాయువుగా చెల్లుతుంది. కలియుగాంతంలో ఏడెనిమిది ఏళ్ళ వయసులోనే స్త్రీలకు పిల్లలు పుడతారు. ద్రవ్యం తక్కువయి, ఒకరి సొమ్ము ఒకరు అపహరిస్తారు. తెలిసినవారు కూడా పాపం చేస్తారు. అందరూ అన్నం అమ్ముకొంటారు. విప్రులు వేదం అమ్ముకొంటారు. పణ్య వృత్తి సామాన్య మయి పోతుంది. చోరులు ధనం దోచుకోవడమే కాకుండా జనులను చంపి పోతారు.

శూద్రులు వేద ధర్మాలు చెపుతుంటే విప్రులు వింటారు. వారిని సేవించి బ్రతుకుతారు. దేవాలయాలు, అగ్రహారాలు, ఆశ్రమాలు చెడిపోతాయి. దుష్ట స్త్రీ సంపర్కం, మద్యపానం అంతటా చెల్లుతాయి.

గురుఁ గొనియాడఁడు శిష్యుఁడు
గురుఁడును శిష్యునెడ వంచకుండగు, మది నొం
డొరువుల నొల్లరు బంధులు
పొరిఁ బొరిఁ గఱవులగుఁ బ్రజకుఁ బొడమును భయముల్ ఆర - 4-305

శిష్యుడు గురువును ప్రశంసించడు. ఆ గురువూ శిష్యునిపట్ల వాత్సల్యం చూపక మోసం చేస్తాడు. బంధువులకు ఒకరికొకరికి పడదు. తరచు కరవులూ కాటకాలూ సంభవిస్తాయి. ప్రజలంతా భీతావహు లవుతారు.

"ప్రత్యక్షే గురవః స్తుత్యాః" అనే సూక్తి వమ్మయిపోతుంది.

ఈ విధంగా ధర్మములన్నీ తరిగిపోతాయి. జనులంతా తల్లడిల్లి పోతారు. ఎన్నో ఉపద్రవాలు సంభవిస్తాయి. సర్వజనులూ రక్షణలేక ఆతురులయి తిరుగుతారు.

ధర్మ సంస్థాపనం:

ఈ కలియుగం చివర శంబళ గ్రామంలో కల్కిరూపు డయిన విష్ణుయశుడనే విప్రుడు పుడతాడు. అతడు స్మరణమాత్రం చేతనే వేదశాస్త్రాలు నేర్చి, చక్రవర్తి అవుతాడు. అతడు అధర్మవర్తులయిన వారిని వధించి, తన శక్తితో ధర్మసంస్థాపనం చేసి, అశ్వమేధం చేస్తాడు. ఈ భూమి నంతటినీ బ్రాహ్మణధనంగా విభాగించి, యిచ్చి, ధర్మ యశోవర్ధను డవుతాడు. అప్పటినుండి ధర్మానుసారంగా చతుర్వర్ణాలు ప్రవర్తిల్లుతాయి. అపుడు కృతయుగం ప్రారంభమవుతుంది. ఆరామాలు, దేవాలయాలు తపస్విజనులతో నిండి శోభిస్తాయి. పుణ్యప్రదము లయిన యజ్ఞాదులు నిర్వర్తింప బడతాయి. సమయానికి వర్షం పడుతుంది. పంటలు నిండుగా పండుతాయి. అన్ని దేశాలూ నిత్యకల్యాణంగా విలసిల్లుతాయి. ప్రజలందరికీ ఆరోగ్యమూ, సౌఖ్యమూ పుష్కలంగా కలుగుతాయి. ఇది కృతయుగ లక్షణం. ఇటువంటి యుగాలు నేను చాలా చూశాను. ఒక్క హితవు చెపుతాను విను. రాజా! శమదమాది సంపత్తి కల విప్రులను సంతృప్తిపరచు. వారు దేశక్షేమం కోరేవారు. వారు తృప్తి పడితే దేశక్షేమం ఇనుమడిస్తుంది. ప్రాణులన్నిటిపైన దయకలిగి ప్రవర్తించు. ప్రజలందరినీ కన్నబిడ్డల వలె రక్షించు. వృద్ధాచారాలు తెలిసికొని ధర్మం నడిపించు. పాపం పొంతకు పోకు. ఎప్పుడయినా అజ్ఞానంతో (తెలియక) పాపకృత్యం చేస్తే, తెలిసిన వెంటనే దానికి పశ్చాత్తాపంతో ప్రతీకారం చెయ్యి. గర్వం విడిచిపెట్టు. సత్యాన్ని ప్రియంగా పాలించు. కాలగతి తెలిసికొని నిర్మలజ్ఞానం పొందు. నీవు భరత వంశంలో పుట్టినవాడవు. నిర్మలుడవు. ప్రాజ్ఞుడవు. నీకు వేరుగా చెప్పాలా" అంటూ ముగించాడు.

వెంటనే ధర్మరాజు "మునీంద్రా! మీరాదేశించినట్లుగా లోభము, అసూయ మొదలయిన దుర్గుణాలన్నిటినీ నాకు చేతనయినంతగా పరిహరిస్తాను. మీ

ధర్మశాసనాన్ని పాలిస్తాను.” అని నమస్కరించి, యింకా బ్రాహ్మణ శక్తినిగూర్చి ప్రశ్నించాడు. మహర్షి యిలా చెప్పాడు.

సూర్యవంశజుడూ, అయోధ్యాపతీ అయిన పరిక్షితుడు వేటకోసం అడవికి వెళ్ళి, విలాసంగా పూలుకోస్తున్న ఒక యువతిని చూశాడు. ఆమె చతురవచనాలకు ప్రియం పడి, ఆమెను వివాహమాడ దలచాడు. ఆమె ఒక షరతుపెట్టింది “నన్నెప్పుడూ జలవిహారానికి రమ్మనకూడదు. అట్లయితే నేను నిన్ను వరిస్తా” నంది. దానికంగీకరించి ఆమెను వివాహం చేసుకొన్నాడు. ఒకనాడు ఘర్మ పీడితుడై అతడు స్నానం చేస్తూ, షరతు మరచి ఆమెనుకూడా ఆహ్వానించాడు. ఆమె నవ్వుతూ నీటిలో దిగి మాయమైపోయింది.

చెరువు అంతా వెదకినా మగువ కనిపించలేదు. చెరువులోని నీళ్ళన్నీ బయటకు తోడించాడు రాజు. అందులో కప్పలు కనపడ్డాయి. “ఇవే నా ప్రియురాలిని కబళించి ఉంటాయి” అనుకొని, సేవకులను పిలిచి, “కప్ప లెక్కడ కనిపించినా చంపి వేయండి” అని ఆజ్ఞాపించాడు. భటు లట్లా చేయసాగారు. అపుడామండూక నాయకుడు రాజు దగ్గరకు వచ్చి “ఇది అధర్మం” అని వాదిస్తాడు. రాజు విషయం చెప్పుతాడు. అపుడతడు “ఆమె నాకూతురు సుశోభన. ఇలా ఎంతోమందిని ఆమె మోసగించింది” అంటూ ఆమెను రప్పించి, “నీవు చాలామందిని మోసగించావు. నీకు పుట్టే కొడుకులు కపట వర్తను లవుతారు” అని శపించి, ఆమెను పరిక్షితున కప్పగించి వెళ్ళిపోయాడు. ఆ పరిక్షితుడు ఆమెవల్ల శలుడు, దలుడు, వలుడు అని ముగ్గురు కొడుకులను కన్నాడు. కొంతకాలానికి శలుని రాజ్యాభిషిక్తుని చేసి, పరిక్షితుడు తపోవనానికి వెళ్ళిపోయాడు.

శలు డొకనాడు వేటకు వెళ్ళి, ఒక మృగాన్ని కొట్టాడు. బాణం తగిలి ఆమృగం పరుగెత్తసాగింది. రథం మీద శలుడు దానిని వెంటాడాడు. కాని అది అందకుండా వెళ్ళిపోతోంది. రథవేగం చాలటంలేదు. అపుడు సారథి యిలా అన్నాడు. “ఈ గుర్రాలు దాని వేగం అందుకోలేవు. వామ్యము లయితే వేగంగాపోయి దాన్ని పట్టగలవు. అవి వామదేవుని గుర్రాలు” అనగానే రాజు అతని ఆశ్రమానికి చేరి, మహర్షికి నమస్కరించి, విషయం నివేదించి, వామ్యాశ్యములను అర్థించాడు. “నీ కార్యం పూర్తి అయిన వెంటనే నాకు మళ్ళీ గుర్రాల నివ్వాలి. అట్లా అయితేనే తీసుకు వెళ్ళు” అన్నాడు వామదేవుడు. “సరే! అట్లాగే” అని రాజు గుర్రాలను

గ్రహించి, ఆ గుర్రాలనెక్కి, వెళ్ళి, మృగాన్ని వధించి, తన పట్టణానికి వచ్చాడు. "ఈ గుర్రాలు రాజయోగ్యము లయినవి. బాపనయ్యకు ఎందుకు" అని వాటిని అంతఃపురం చేర్చమన్నాడు.

ఒక నెల గడిచింది. రాజు గుర్రాలను తిరిగి ఇవ్వకపోయే సరికి వామదేవుడు తన శిష్యుని రాజు దగ్గరకు పంపి, అడిగించాడు. రాజు ఇవ్వలేదు. అపుడు వామదేవుడే రాజు దగ్గరకు వెళ్ళి "

ఇమ్ము నరేశ్వర ! మా తుర
గమ్ముల నీ కార్య మయ్యెఁ గాదె కడులో
భమ్మున నొండుల సొమ్ములు
రమ్మనినన్ వచ్చునే ! యెరవు సత మగునే !

రాజా! మా గుర్రాలను మాకియ్యి. నీ పని అయిపోయిందికదా ! లోభంతో ఇతరుల సొమ్ములు దోచుకొందామంటే వస్తాయా? ఎరువు సొమ్ము శాశ్వతమా? పర ధనాపహరణం పాపం కాదూ. వరుణ పాశాల్లో కట్టుబడకు. నరకాగ్ని జ్వాలల్లో పడకు. మా గుర్రాలు మాకిచ్చి సత్యసంధుడవు కమ్ము" అన్నాడు వామదేవుడు.

ఆ మాటలకు రాజు కోపించి "వామదేవుని శూలాలతో పొడువు" దని భటుల నాజ్ఞాపించాడు. వెంటనే రోషంతో వామదేవుడు వికటాట్టహాసం చేశాడు. రాక్షసులు అతని నోటినుండి భయంకరాకారులయి ఉద్భవించి, రాజును ఆ శూలాలతోనే పొడిచి చంపారు. వామదేవుడు ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. అనంతరం ఆరాజు తమ్ముడు పట్టాభిషిక్తు డయ్యాడు. కొన్నాళ్ళకు వామదేవుడు వెళ్లి గుర్రాలను అడిగాడు. అత డలిగి ప్రక్కనే ఉన్న సారథితో "ధనుర్బాణాలు పట్టుకురా. వీనిని ఒకే ఒక విషబాణంతో సంహరిస్తాను" అన్నాడు. వామదేవుడు చిరునవ్వుతో "ఆ బాణం అంతః పురంలో ఉన్న నీకొడుకును చంపుతుంది" అన్నాడు. వెంటనే బాలుడు చనిపోయాడు. రాజుకు మరింతకోపం వచ్చింది. వామదేవుని సంహరించడానికి ధనుస్సు సంధింప బోయాడు. వెంటనే అతని చేతులు రెండూ స్తంభించిపోయాయి. అప్పటికి తెలుసుకొని, ఆ రాజు పశ్చాత్తప్తుడై వామదేవుని క్షమించుమని వేడుకొంటాడు. గుర్రాలను ఇస్తాడు. వామదేవుడు సంతృప్తుడై రాజకుమారుని ప్రాణాలను అనుగ్రహిస్తాడు.

ఇది వామ్యశ్వహరణం - అన్నాడు మార్కండేయుడు.

ఇంద్రద్యుమ్నుని చరిత్ర:

తరువాత ధర్మరాజు మార్కండేయునితో "మహాత్మా! మీకంటె వృద్ధుడెవడయినా ఈలోకంలో ఉన్నాడా?" అని అడిగాడు. అతడిలా చెప్పాడు.

ఇంద్రద్యుమ్నుడనే రాజు చాలా కాలం స్వర్గంలో ఉన్నాడు. అతని కీర్తి మాసిపోవడంతో అతనిని అమరులు భూమికి నెట్టివేశారు. అతడు నా దగ్గరకు వచ్చి "నన్ను - ఇంద్రద్యుమ్నుని – ఎరుగుదువా" అని అడిగాడు. "నేను ఎరుగను. కాని నాకంటె ప్రావారకర్ణమనే గుడ్లగూబ చాలా పెద్దది. హిమవత్పర్వత శిఖరాన ఉంటుంది. దాని నడుగు" అన్నాను నేను. అతడు "నీవు నాతోరా" అంటే "నేను రాలేను. శరీర తాపం అధికంగా ఉంది" అన్నాను. అప్పుడతడు గుఱ్ఱముగామారి, నన్ను మోసుకొని, ఆ ఉలూకం దగ్గరకు వెళ్ళి, దానినడిగాడు. అది "నాకు తెలియదు కాని ఇంద్రద్యుమ్నమనే చెరువులో నాళీక జంఘుడనే కొంగ ఉంది. అది నాకంటె పెద్దది. అది నిన్ను ఎరిగి ఉండవచ్చు" అంది. ఇంద్రద్యుమ్నుడు అపుడందరినీ తీసుకొని వెళ్ళి, నాళీకజంఘుని అడిగాడు. "నేనెరుగను నిన్ను, కాని నాకంటె పెద్దదయిన అకూపారమనే తాబేలు ఉంది. అది ఈ కొలనిలోనే ఉంది. దానినడుగుదాం" అని వెళ్లి దాని నడిగారు. అపుడు ఆ తాబేలు కన్నీరొలుకగా చింతించి "ఇంద్రద్యుమ్నుని నేనెరుగకపోవడమేమిటి? అతడు నన్ను ఎన్నోసారులు రక్షించాడు. అతనిని నేనెట్లా మరిచిపోతాను? అతడు యజ్ఞదక్షిణలిచ్చిన గోవుల కాలిగిట్టలవల్లనే కదా ఈ సరస్సు ఏర్పడింది. అందుకే ఈ చెరువుకు ఇంద్రద్యుమ్న మనే పేరువచ్చింది" అంది. ఆమాట విన్న మరుక్షణంలో దేవదూతలు విమానంతో వచ్చి, ఇంద్రద్యుమ్నుని చూచి "నీ కీర్తి లోకంలో శాశ్వతంగా నిలిచింది. నీకు స్వర్గలోకం స్థిరమయింది. రా! విమానం ఎక్కు" అంటూ ఇలా అన్నారు.

తనకీర్తి యెంతకాలము
వినఁబడు నిజ్జగమునందు వెలయఁగ నందాఁ
కను బుణ్యలోక సౌఖ్యం
బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుం డనఘా!

మర్త్యలోకంలో తనకీర్తి ఎంతకాలం వినబడుతుందో అంతకాలం ఒకడు పుణ్యలోక సౌఖ్యం అనుభవిస్తాడు... అన్నారు.

అప్పుడా ఇంద్రద్యుమ్న మహారాజు దేవదూతలతో “ఈ ముసలి మహర్షిని, పక్షిని, నాపనికోసం సాయంగా తీసుకువచ్చాను. వీరిని తమ తమ స్థానాల్లో దింపి వస్తాను. కొద్దిసేపు నిలువుడని వారిచేత అనుమతింపబడి, నన్నూ ఉలూకాన్ని మా స్థానాల్లో నిలిపి, తాను దేవలోకానికి వెళ్లాడు” అని ముగించాడు.

ఈ కథవిని ధర్మరాజు చాలా సంతోషించాడు. (ఈ కథకు ప్రాణమయినది కీర్తి. ఈ కీర్తిని గురించి ముమ్ముందు కర్ణుని చరిత్రలో వివరింపబడుతోంది).

ఇంద్రద్యుమ్నోపాఖ్యానం విని ధర్మరాజు ధుంధుమారుని చరిత్ర చెప్పమని అడిగాడు. మార్కండేయుడు చెప్పసాగాడు.

ఉదంకుడనే మహర్షి విష్ణుని గూర్చి తపస్సు చేసి, అతనిని ప్రత్యక్షం చేసుకొన్నాడు. విష్ణువు ఉదంకుడు కోరిన వరాలిచ్చి “ధుంధుడనే రాక్షసుని చంపేందుకు కువలాశ్వుని నీవు ప్రేరేపిస్తావు. నా అనుగ్రహంవల్ల శక్తిమంతుడై ఆ రాజు, ధుంధుని చంపి, ధుంధుమారు దనిపించుకొంటాడు” అని విష్ణువు అంతర్ధాన మయ్యాడు

అతడు చెప్పినట్లే కొంతకాలానికి బృహదశ్వుడు రాజయ్యాడు. అతని కుమారుడు కువలాశ్వుడు. కువలాశ్వునకు అభిషేకం చేసి, బృహదశ్వుడు తపోవనానికి వెడుతున్న సమయంలో ఉదంకుడు వచ్చి, బృహదశ్వునితో ఇలా అన్నాడు.

మహారాజా! ఒక అద్భుతం చెపుతాను, విను. మధు కైటభులనే రాక్షసుల పుత్రుడు ధుంధుడనే వాడు నా ఆశ్రమ సమీపంలో సముద్రతీరాన ఇసుకతిన్నెలలో పెద్దబిలం చేసుకొని, అందులో నిద్రిస్తూ ఉంటాడు. వాని నిట్టూర్పు గాలు లెగసి, భూమ్యాకాశాలు నిండి, ఇసుక అంతటా పడుతూ ఉంటుంది. వారంరోజుల దాకా భూమి కంపిస్తూ ఉంటుంది. ఇట్లా సంవత్సరాని కొకసారి ఉపద్రవం సంభవిస్తూ ఉంటుంది. వానిని సంహరించి మాకూ, లోకాలకూ హితంచేసి తరువాత తపోవనానికి వెళ్ళు” అన్నాడు ఉదంకుడు. బృహదశ్వుడు తాను తపోవనానికి వెంటనే వెళ్ళవలెనని, ఆ పనిని కువలాశ్వున కప్పగించి వెళ్ళిపోయాడు. ఆ కువలాశ్వుడు తన యిరువదియొక్క వేలమంది కుమారులతో కదలివెళ్ళి, వానిని బ్రహ్మాస్త్రంతో సంహరించాడు. అతడు ధుంధుని సంహరించినవాడు గనుక అప్పటి నుండి ధుంధుమారుడయ్యాడు.

ఈ కథ వింటున్న ధర్మరాజు మధ్యలోనే "మధుకైటభు లెవరు?" అని మార్కండేయుని ప్రశ్నించాడు. మార్కండేయుడిలా చెప్పాడు.

పూర్వం ఒకసారి ప్రళయం సంభవించి లోకాలన్నీ ఏకార్ణవంగా అయిన సమయంలో విష్ణువు యోగనిద్రాపరవశుడయి ఉన్నాడు. అతని నాభి కమలంలో ఉన్నాడు బ్రహ్మ. అతనిని సంహరించటానికి మధువు, కైటభుడు అనే రాక్షసు లిద్దరు వచ్చారు. బ్రహ్మ ఆక్రోశించాడు. విష్ణువు మేల్కొని, రాక్షసులను చూసి, "అతని నెందుకు చంపుతారు? మీకేం కావాలో కోరుకొనండి ఇస్తాను" అన్నాడు. వారు "నీవు మాకేమి ఇస్తావు? మేమే నీకు వరం ఇస్తాం, ఏం కావాలి?" అన్నారు. అప్పుడు విష్ణువు "నాచే మీరు మృత్యువును పొందండి" అన్నాడు. సరే అంటూ వారిరువురూ "మమ్ము నీవు జలంలేని చోట చంపు. అప్పుడు నీచేత చస్తాము" అన్నారు. అంతా జలమయంగా ఉంది. అప్పుడు విష్ణువు తన తొడలపై వారిని పెట్టి చంపాడు. వారి కుమారుడు ఈ ధుంధుడు - అని చెప్పాడు.

ఈ విషయమంతా వైశంపాయనుడు జనమేజయునకు చెప్పాడు. తరువాత ధర్మరాజు మార్కండేయుని పుణ్యసతీ ప్రభావాన్ని గూర్చి ప్రశ్నించి, యింకా యిలా అన్నాడు.

"తల్లి దండ్రు లిద్దరిలోనూ పుత్రుని గూర్చిన ఆయాసం ఎవరికెక్కువ? వారి పట్ల పుత్రు లెట్లా ప్రవర్తించాలి? నీచ జన్మమెత్తిన పురుషుడు ఎటువంటి ప్రవర్తన చేత ధార్మికలోకాలు పొందుతాడు?"

అపుడు మార్కండేయు డిలా సమాధానం చెప్పాడు. "ధర్మరాజా! పుత్రుని విషయమైన ఆయాసం తల్లిదండ్రు లిద్దరికీ సమానమే. ఆ పుత్రుడు తమమీద భక్తి కలిగి, ధర్మబుద్ధితో ప్రవర్తించాలని తలిదండ్రులు ఆశపడతారు. ఆ ఆశ ఫలింపజేసే వాడే పుత్రుడు.

తనయుఁగని తల్లి దండ్రులు దమకు నతఁడు
భక్తుఁడగుటకు ధర్మానురక్తుఁ డగుట
కాస పడుదురు విను మట్టి యాస సిద్ధిఁ
బొందఁజేయు నతఁడ చువ్వె నందనుండు 3-5-5 ఎత్తుగీతి

ఎవని పరిచర్యచేత తలిదండ్రులు ప్రీతిచెందుతారో ఆ తనయుడు ధర్మాన్నీ, కీర్తిని పొందుతాడు.

జననియు జనకుఁడు నెవ్వని
యనువర్తనమునఁ బ్రియంబు నందుదు రెదఁ ద
త్తనయుఁడు ధర్మముఁ గీర్తియు
ననూనముగ బడయుఁ బొందు నక్షయ గతులన్ 3-5-6

అట్లాగే తనపతి సేవలో ఆసక్తురాలయిన పతివ్రతకు యజ్ఞదాన తపః ఫలాలు అన్నీ సమకూరుతాయి. ఒక కథ చెపుతా. దానిలో నీ ప్రశ్నల కన్నిటికీ సమాధానాలు లభిస్తాయి. విను.

పతివ్రత చరిత్ర :

కౌశికుడనే విప్రుడు ఒక చెట్టుక్రింద కూర్చుని వేదాలు పఠిస్తున్నాడు. ఆ చెట్టు కొమ్మమీద నున్న ఒక కొంగ అతనిపై రెట్టవేసింది. కోపంతో కౌశికుడు కొంగను చూశాడు. వెంటనే అది నిశ్చేతనమయి నేలగూలింది. ఆదృశ్యం చూసి కౌశికుడు "అయ్యో! నాహృదయం ఇంత నిర్దయ మయిందేమిటి? నిష్కారణంగా కొంగ చచ్చిపోయిందే!" అని వాపోయాడు చాలా సేపు. అలా వికలమనస్కతతో కౌశికుడు భిక్షాటనానికి బయలుదేరి, ఒక యింటిముందు నిలిచి "భిక్షాం దేహి" అన్నాడు. ఆ మాటవిని యిల్లాలు అతనికి భిక్షపెట్టటానికి పాత్రశోధనం చేస్తోంది. ఆ సమయంలో ఆమె భర్త ఆకలితో తూలిపోతూ వచ్చాడు. వెంటనే ఆమె భర్తకు సపర్యలన్నీ చేసి భోజనం పెట్టింది. ప్రియోక్తులతో అతనిని సంతృప్తిపరచింది. అతడు పరుండుటకు తగిన శయ్య నలంకరించి, ప్రియు డందు పరుండగా తమలపాకులిచ్చి, కాళ్ళు ఒత్తి, ఆ పతివ్రత అపుడు భిక్షకోసం నిలిచిన విప్రుని తలచుకొంది. వెంటనే భిక్ష తీసుకువచ్చింది. కౌశికునికి కోపం చిర్రుమంది. పతివ్రత ఉన్న విషయం వివరించి చెప్పింది. కౌశికుడు "విప్రుల నింత అవమాన పరుస్తావా?" అంటూ కోపించాడు. విప్రుల మహిమల నేకరవు పెట్టాడు. దానికి సమాధానంగా ఆమె "నేను విప్రుల మహిమ లెరుగని దానను కాను. కొఱివితో తలగోకుకొంటానా? నాకు భర్తయే పరమ దైవం.

నేను త్రికరణ శుద్ధిగా పతిహితం కోరుతాను. దీనిని మించిన ధర్మం నేనెక్కడ ఎరుగను. నీవు ముక్కోపి వని తెలుసు. నీ కోపంతో కొంగ చనిపోయింది కదా?

ఇది నా పాతివ్రత్య మహిమచేతనే తెలిసింది. అందుచే క్రోధమును గొప్పగా చెప్పడం మంచిదికాదు.

క్రోధ మోహ నామకు లైన ఘోర శత్రు
లిరువు రెరియించు చుండుదు రెపుడు నంత
రంగ; మయ్యుభయంబు నడంగ కున్నఁ
గలదె యూరక బ్రాహ్మణ్య గౌరవంబు ! 3-5-23

క్రోధమూ, మోహమూ అనేవి రెండూ మనస్సును ఎల్లప్పుడూ దహించి వేస్తూ ఉంటాయి. వాటిని అణచకుండా బ్రాహ్మణ్య గౌరవం చేకూరదు. ఈ రెంటిని అణచుకొన్నవాడే బ్రాహ్మణుడు. ఇంకా విప్రలక్షణాలు చెపుతాను, విను. సత్యము అహింస కలిగినవాడు, గురుజనుల హితంకోరేవాడు, ఇంద్రియాలను జయించి అందరినీ తనతో సమానంగా చూసే ధార్మికుడూ, నిష్కామంగా షట్కర్మలూ ఆచరించే వాడు బ్రాహ్మణుడు. ఆర్జవం, శమం, అధ్యయనం బ్రాహ్మణునకు పరమ ధర్మములు. ధర్మగతికి ఇవే తగిన సాధనాలు. వేదంలో చెప్పిన ముఖ్య విధులు కూడా ఇవే.

ధర్మం చాలా సూక్ష్మంగా ఉంటుంది. ఏకోణంలోంచి చూస్తే ఆరీతిగా గోచరిస్తుంది. నీది కేవలం స్వాధ్యాయం. చదివావు కాని ధర్మసూక్ష్మత నీకు తెలియదు. మిథిలా నగరానికి వెళ్ళు. అక్కడ ధర్మవ్యాధుడనే కిరాతుడు నీకు సకల ధర్మాలు తెలిపి, నీ సంశయాలు తీర్చుతాడు. నా మీద ప్రసన్నుడవు కమ్ము. వనితలకు పరిజ్ఞానం లేదు. కావున వారెట్టి అపరాధం చేసినా సహించాలి కదా!" అని కౌశికుని సాగనంపింది.

ధర్మవ్యాధోపాఖ్యానం :

ఆమె మాట చొప్పున దారి తెలుసుకొంటూ వెళ్లి, కౌశికుడు మిథిలా నగరంలో ధర్మవ్యాధుని మాంసపు కొట్టుకు దూరంగా ఒత్తిగిలి నిలిచాడు. ధర్మవ్యాధుడది గ్రహించి వచ్చి, భక్తితో నమస్కరించి "అయ్యా! నీవా పతివ్రత పంపితే వచ్చావు కదా! రా! నా యింటికి వెడదాం" అని యింటికి తీసుకు వెళ్లాడు. (అది కౌశికుని రెండవ ఆశ్చర్యం. మొదటి ఆశ్చర్యం పతివ్రతకు కొంగచావు తెలియడం)

(ధర్మవ్యాధోపాఖ్యానానికి పతివ్రత చరిత పరిచయ పత్రం వంటిది. ధర్మరాజు మార్కండేయుని మూడు ప్రశ్నలు వేశాడు. 1. పుత్ర లక్షణాలు – వీనిని ముందుగానే

స్వయంగా మార్కండేయుడు చెప్పాడు. 2. పతివ్రతా లక్షణాలు, మహిమ - దానికోసం పతివ్రత చరిత చెప్పాడు. 3. హీనజాతి వాడయినా గౌరవం పొందడానికి తగిన ప్రవర్తన యెట్టిది? అనేది - దానికి ధర్మవ్యాధుని చరిత్ర ఉదాహరణం. ఇందులో గమనింపవలసిన అంశం ఒకటి ఉంది.

ఇక్కడ ఒక వ్యాధుని చేత బ్రాహ్మణునికి ధర్మోపదేశం చేయిస్తున్నాడు. ఇది ఆ కాలానికి విపరీతమయినది. కౌశికుడు వ్యాధుని నుండి ధర్మోపదేశం పొందటానికి ఒప్పుకుంటాడా? ఒప్పుకోడు. కాని ఒప్పించాలి. దాని కోసం పతివ్రత చరిత్రను ఉపయోగించుకొన్నాడు. ఒకరిపై ఒకరికి గురి కుదరాలంటే ఒక నిదర్శనం కనపడాలి. అది ఆశ్చర్యకరమయినదీ, అలౌకికమయినదీ కావాలి. అటువంటి సన్నివేశమే ఇక్కడ కల్పింపబడింది. కౌశికుని కోపంతో కొంగ నేల రాలింది. ఆ విషయం పతివ్రతకు తెలియడమే ఆశ్చర్యకరం. ఆ సన్నివేశం వల్ల కౌశికునికి పతివ్రతపై ముందుగా గురి కుదిరింది.

ఇక్కడ గురి కుదరడంలో మరో విశేషం కూడా లేకపోలేదు. కౌశికుడు సహజంగా జాలిగుండె కలవాడు. కాని ప్రథమ కోపం హెచ్చు. ఈ ప్రథమ కోపం కలవారు ఉన్నట్టుండి ఒక్కసారిగా ఎదుటివారిపై ఎంతో కోప్పడుతారు. అది కేవలం తాటాకు మంట. మరుక్షణంలో చల్లారిపోతుంది. వెంటనే మనస్సు సహజస్థితికి వచ్చేస్తుంది. మనస్సు వికలమయిపోతుంది. పరితపించి, పశ్చాత్తాప పడతారు. ఈ కోవకు చెందినవాడు కౌశికుడు. ప్రథమకోపంతో పిట్ట నేలగూలే సరికి, కౌశికుని మనస్సు వికల మయిపోయింది. ఎంతో విలపించాడు. అది జాలిగుండె కలవాని లక్షణం. కాని ఆ మొదటి కోపం ఉండరానిది. ఆ కోపం ఉంటే అది తనతోపాటు మోహాన్ని, అజ్ఞానాన్ని కూడా తీసుకువస్తుంది. దానితో అన్ని అక్రమాలూ జరిగిపోతాయి. అందుచేతనే పతివ్రత కౌశికునితో 'క్రోధ మోహా నామకులయిన' అనే పద్యం చెపుతుంది. అది కౌశికునికి హితబోధయే కాని అప్పటికి పతివ్రతపై కౌశికునికి గురి కుదరలేదు. కుదిరిన తర్వాత ధర్మవ్యాధుని దగ్గరకు వెళ్ళమంది. కౌశికుడు వెళ్ళాడు. "పతివ్రత పంపితే వచ్చావు కదా" అన్నది కౌశికునికి ఆశ్చర్య కారణమయినది. ధర్మవ్యాధునిపై గురి స్థిరపడింది. ఆతరువాత ధర్మవ్యాధుడు కౌశికునికి సంశయాలన్నీ తీర్చాడు. కౌశికునిలో తగిన జిజ్ఞాస ఉంది. గురి కుదిరి, జిజ్ఞాస ఏర్పడినపుడే ఎవరికయినా చెప్పాలి. లేకపోతే ఎవరికీ

ఏమీ చెప్పరాదు. అది చులకనతనానికీ, అగౌరవానికీ దారితీస్తుంది. "నా పృష్టః కస్యచిత్ బ్రూయాత్" అన్నదానిలోని అంతరర్థం ఇదే.

ఇపుడు ధర్మవ్యాధుని ధర్మోపదేశానికి తగిన పాత్రత లభించింది. తగిన రీతిలో ఉపదేశం ప్రారంభిస్తున్నాడు. ధర్మోపదేశం అనగా జ్ఞానదానం. దానికి పాత్రత ముఖ్యం. అపాత్రదానం చేయరాదుకదా!)

కౌశికుడు అతనిచేత సత్కృతుడయి ఇష్ట కథా ప్రసంగంతో ఇలా అన్నాడు. "నీవు చాలా ధర్మాలు తెలిసినవాడవు. జీవహింసతో జీవనం చేయడం శిష్టాచారమా! నీయీ బుద్ధికి నామనస్సు పరిపరి విధాల పరితపిస్తోంది". ఈ మాటలకు సమాధానంగా ధర్మవ్యాధుడు "చతుర్వర్ణములకూ తగిన ధర్మాలు ఎలా ఉన్నాయో అలాగే మాకూను. మాకు మృగమాంసంతో జీవించడం పరమ ధర్మం. పైగా ఇది వంశక్రమాగత మయిన ఆచారం. అదీగాక, ఈ దేశాన్ని సకల ధర్మరక్షకు డయిన జనకుడు పాలిస్తున్నాడు. అతడు విహిత కర్మలు విడిచిపెడితే పుత్రునయినా దండించి తీరుతాడు. అందుచేత నిజకర్మములను నేను విడువను. అయినా నేనుగా ఎన్నడూ జీవహింస చేయను. ఇతరులు చంపి తెచ్చిన మాంసం అమ్మి జీవిస్తాను. దానితో నామనస్సు ప్రశాంతంగా ఉంటుంది. గురువులనూ, పెద్దలనూ, అతిథులనూ, విప్రులనూ, దేవతలనూ వినయంతో అర్చిస్తాను. సత్యాన్ని, శుచిత్వాన్ని ఎన్నడూ విడవను. ప్రియంతో దానంచేసి సేవకులనూ, బంధువులనూ తృప్తి పరుస్తాను. సహనంతో ప్రవర్తిస్తాను. అసూయను దరికిరానీయను. దేనిమీదా కోరిక పెంచుకోను. ఇతరుల దోషాలు ఎన్నడూ వినటానికి ఇష్టపడను. సతతమూ ఉపవాసాలతో, నియమాలతో కాలం గడుపుతాను. ఏకపత్నీవ్రతుడను. ఋతుకాలంలో మాత్రమే ఆమెతో సుఖిస్తాను. నిందాస్తుతులు రెండిట సమానంగా నా మనస్సు వర్తిస్తుంది. అందుకే నేను హీనజాతి వాడనయినా నా మనస్సు నిర్మలంగా ఉంటుంది. ఏదో ప్రసంగవశాత్తు ఇంత చెప్పవలసి వచ్చింది. నీవు ధర్మ బోధకోసం కదా ఇంతదూరం నా దగ్గరకు వచ్చావు. నీకు ధర్మ విశేషాలు తెలియజేస్తాను.

ధర్మ విశేషాలు :

"తన కులధర్మాన్ని విడిచి పెట్టకుండా జీవించడమే పరమధర్మం. మనసులో దయాగుణం తప్పకుండా ఉండాలి. అన్నిటా సహనభావం ఉండాలి. విషయ

వాంఛలను విడనాడాలి. త్యాగాన్ని మించిన సుగుణం మరొకటి లేదు. త్యాగశీలికి అసాధ్యమేదీ లేదు.

సత్యమూ, హితమూ, చతురమూ అయిన మాట మాట్లాడాలి. సజ్జనులను ఎల్లపుడూ పూజించాలి. కామక్రోధాదులతో మనసు కలత చెందినా కూడా ధర్మాన్ని విడవకుండా ప్రవర్తించాలి. అది చాలా ఉత్తమ మార్గం. అప్రియం కలిగి నప్పుడు దైన్యంతో క్రుంగి పోరాదు. ప్రియం కలిగి నపుడు సంతోషంతో పొంగి పోరాదు. రెండిటా సమానమయిన ప్రవర్తన కలిగి ఉండాలి. తనకు కీడు చేసిన వారికి కూడా హితం చేయాలి. దానికి కారణం ఉంది. ఇతరులకు కీడు చేసినవాడు తన పాపంతో తానే కాలిపోతాడు. వేరుగా మళ్ళీ అతనికి కీడుచేయ నవసరం లేదు. ఇందులో ఒకటి గమనించాలి. ధార్మికులు చేసే ఉత్తమ కృత్యాన్ని నాస్తికులు నిందిస్తారు. వాళ్ల మాట పట్టుకొని ధర్మమార్గం విడిచి పెట్టరాదు. అదీ పండిత లక్షణం. ఎపుడయినా పొరపాటుచేత పాపం సంక్రమించవచ్చును. కాని అది పోయేమార్గం ఉంది. "అయ్యో! ఇట్లా చేశానేమిటి?" అని పశ్చాత్తాపం చెందితే సగం పోతుంది. "ఇక నేనిట్టిపని ఎన్నడూ చేయను" అని ప్రతిజ్ఞచేసి, నెరవేర్చుకొంటే మిగిలిన సగమూ పోతుంది.

పాపములకెల్ల నెక్కుడు పాతకములు
సువ్వె! క్రోధలోభంబులు సువ్రతాత్మ!
వాని రెంటి జయించిన వాఁడు గాని
యెందుఁ బరమ ధార్మికుఁడని యెన్నఁబడఁడు. 3-5-42

అన్నిటినీ మించిన పాతకాలు రెండున్నాయి. అవి క్రోధమూ, లోభమూ. వాటిని జయించిన వాడే ధార్మికుడుగా పరిగణింప బడతాడు.

ఇందులో కూడా కొన్ని శిష్టాచారములు కాని కపటధర్మాలుంటాయి. అవి గడ్డితో మూయబడిన బావుల వంటివి. పైకి మృదువుగా, పచ్చగా కనిపిస్తాయి. కాని మోసగించి, ఆ పతనాన్ని కలిగిస్తాయి. వాటికి దూరంగా ఉంటూ శిష్టాచారాన్ని నడపాలి."

ఈ మాటలు విని కౌశికుడు శిష్టాచారములంటే ఏమిటి అని అడిగాడు. ధర్మ వ్యాధుడు మళ్ళీ కొనసాగించాడు.

“దానం, సత్యం, తపస్సు, యజ్ఞం, ఆర్జవం (ఆర్జవం అంటే త్రికరణశుద్ధి. మనసులో, మాటలో, చేతలో సమానంగా ప్రవర్తించడం), కామ లోభ త్యాగం, గురు శుశ్రూష, క్రోధరాహిత్యం, దమం (ఇంద్రియ నిగ్రహం), సంతోషం, సతతమూ అధ్యయన శీలం, డాంభికత్వం లేక పోవడం, దైన్యం పొందక పోవడం, అసూయ చెందక పోవడం, అహంకారం లేని క్రియాశూరత, నాస్తికులతో భాషించకుండా ఉండటం, శీలరక్షణం, తీర్థసేవ, శుచిత్వం, భూతదయ, మితంగా హితంగా మాట్లాడటం, ఆశ్రిత రక్షణం - ఇవన్నీ శిష్టచరితలు.

విను శిష్ట చరిత గైకొని
యనసూయత నడవ నడవ నంతఃకరణం
బునఁ బొదలు నట్టి సమ్మద
మనఘా! దుర్లభము సూవె యన్యపథములన్. 3-5-45

ఇటువంటి శిష్టాచారాన్ని గ్రహించి, దాన్ననుసరించి, అసూయ లేకుండా పోగా పోగా మనసుకు ఒక విధమయిన ఆనందం కలుగుతుంది. ఆ ఆనందం ఇతర మార్గాలు వేని వల్లనూ కలుగదు. (ఇక్కడ ఒక విషయం గమనించాలి. శిష్టాచారములలో “అసూయ చెందక పోవడం” అని ఒకలక్షణం చెప్పాడు. మళ్ళీ ఇక్కడ “అనసూయత నడవ నడవన్” అంటున్నాడు. ఇది పునరుక్తి కాదు, అసూయాగుణం అంత చెడ్డది అని మాత్రమే భావం. అది ఏ మాత్రం పొడసూపినా తప్పే - ఆ ఆనందం కలుగదని తాత్పర్యం)

అందుచేత శిష్టాచారంతో గురు శుశ్రూష చేసి, అధ్యయన శీలంతో జ్ఞాన పక్వ మయిన మనస్సుతో ఈ మోహ జలధిని తరించు. శిష్టాచారక్రమం తెలుసుకొంటే ధర్మానికి మనసు మొగ్గుతుంది. దానికి అలవాటయితే మనసు నిర్మల మవుతుంది. ఆ మనసులో సత్యమూ, అహింసా చోటు చేసుకొంటాయి.

విను మహింస ధర్మవితతి కెల్లను మేటి
యదియు సత్యయుక్త మైన వెలయు
ననఘ శిష్ట చరితలందు సత్యమ కడు
నధిక మనిరి శ్రుతుల నరసి బుధులు

ధర్మాలన్నిటిలోనూ అహింస చాలా గొప్పది. అది సత్యంతో కలిస్తే ఇంకా బాగా ప్రకాశిస్తుంది. అందుకే శిష్టచరితల్లో సత్యమే మేలయినదని వేదవిదులంటారు.

ధర్మాలు మూడు విధాలు. 1. వేద విహితములు 2. శాస్త్రవిహితములు 3. శిష్ట చరితములు. ఈ మూడు విధాల ధర్మాలూ కూడా సద్గతిని కలిగిస్తాయి. ధర్మాలు ఆచరించే పుణ్యాత్ముడు ప్రజ్ఞ అనే సౌధం ఎక్కి, మోహం అనే బురదలో పడి, కొట్టుమిట్టాడే లోకులను చూసి నవ్వుకుంటూ ఉంటాడు.

అహింస అంటే... ?

నీవు ఇంతకుముందు నా ప్రవర్తన చూసి "ఈ హింసా ప్రవృత్తి ఏమిటి?" అన్నావు. నేను దానికి తగిన సమాధానం చెప్పాను. అయినా అది అట్లా ఉంచు. అసలు "ఇది హింస - ఇది అహింస" అని ఏర్పాటు చేసి ఎవరయినా చెప్పగలరా? పెద్దలు ఇట్లా చెపుతారు.

మును తన చేసిన కర్మం
బునఁ జూవె నశించు భూతములు సంపెడు వాఁ
డు నిమిత్తమాత్ర మింతియె
యని చెప్పఁగ వినమె యంచితాచారులచేన్ 3-5-52

ప్రాణులు తాముచేసిన కర్మ వల్లనే నశిస్తాయి. చంపేవాడు నిమిత్తమాత్రుడు. అంతేకాదు. ఈ ప్రాణులకు ఆహారంగా ఫలాలు, కందమూలాలు, ఓషధులు, శాకములు, పశువులు, మృగాలు - వీటిని కల్పించాడని వేదం చెప్తుతోంది. వేదాన్ని కాదనగలమా?

శిబి చక్రవర్తి తన శరీరాన్ని హింసించి, కోసి ఇంద్రాగ్నులకు మాంసం ఇచ్చాడు. అది హింస కాదా? అతనికి ఉత్తమ లోకాలు రాలేదా ?

రంతిదేవుడనే రాజు రోజుకు రెండువేల గోవుల చొప్పున చంపి వెయ్యి సంవత్సరాలు యజ్ఞం చేశాడు. అతని కెంత పాపం వచ్చింది?

వేదార్థ మెరిగిన విప్రులు యజ్ఞాల్లో పశువులను హింసించడం లేదా! వారికి పుణ్యగతులు లేవా? అదీగాక అగ్ని అధిక మాంసాభిలాషి అని శ్రుతులు చెప్పడం లేదా? పితృకార్యాలలోనూ, దైవకార్యాలలోనూ అతిభక్తితో మాంసం పెట్టాలనీ, ఆ పితృశేషాన్నీ, దేవతా ప్రసాదాన్నీ భుజించాలనీ మునులు చెపుతారు.

ఇంకో విషయం. కర్షకుడు భూమిని దున్నేటప్పుడు నాగలి కఱ్ఱుకు తగిలి ఎన్నో ప్రాణులు చచ్చిపోతున్నాయి. అది హింస కాదా? అంత ఎందుకు, మానవులు

నేలమీద నడుస్తుంటే కాళ్ళక్రిందపడి ఎన్ని కీటకాలూ, క్రిములూ చావటం లేదు? అది హింస కాదా?

ఈ భూమి, నీరు, ఆకాశమూ సర్వమూ జంతుమయమే. మానవుడు ఎక్కడ ఏపని చేసినా అది హింసయే అవుతుంది. అటువంటప్పుడు హింసలేని దేహ యాత్రయే కనపడదు. ఇటువంటి పరిస్థితిలో కొంతమంది అహింస పాటిస్తున్నట్లు చెప్పుకొంటారు - ఇదేమిటి ?

ఈ హింస అందరికీ చెందుతుంది. అహింసామార్గంలో నడుస్తూ, ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే మునులకు మాత్రం హింసచెందదా? కందమూల ఫలాల కోసం చెట్లను పీడించడం హింస కాదా?

అందుచేత అహింస అంటే “అసలు హింస చేయకుండా ఉండటం” అని అర్థం కాదు. తనకు చేతనయినంతలో హింసామార్గానికి దూరంగా ప్రవర్తించడమే అహింస.

హింస సేయని వాఁడు లేఁ డిజ్జగమున
నొక్కడైనను దమతమ యోపి నట్లు
హింస తెరువున కెడగల్లి యేఁగ వలయు
నదియ చూవె యహింస నా నతిశయిల్లు. 3-5-60

ధర్మ సూక్ష్మం

ధర్మం అనేది బహు విధాలుగా ఉంటుంది. దాని సూక్ష్మగతి తెలుసుకోవడం కష్టం. అందుచేత దాన్ని వేద ప్రమాణం చేతనూ, పెద్దల ఆచార నిదర్శనం చేతనూ తెలుసుకోవాలి.

ప్రాణులకు హితం కలిగేటట్లుగా పలికే బొంకు కూడా సత్య ఫలాన్నే ఇస్తుంది. అట్లాగే ప్రాణులకు భయంకరమయిన సత్యం కూడా అసత్యం వంటిదే. ఇది ధర్మసూక్ష్మం.

భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ ద
ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్ల ప్రా
ణాతురుఁ డైనచోఁ బరిణయంబున యందును బల్కు బొంకు స
త్యాతిశయంబ యండ్రు మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్ 3-5-62

ప్రాణాతురు డయినవాడు చెప్పిన అసత్యమూ, వివాహములలో చెప్పే అసత్యమూ కూడా సత్యమే. ఇటువంటివి ధర్మసూక్ష్మాలు.

తన కులధర్మాన్ని విడువరాదని ధర్మజ్ఞులు చెపుతారు. తన కులధర్మం ఎటు వంటి దయినా తన భాగ్యం కొద్దీ లభించిందని సంతోషించాలి.

మానవుడు తాను పూర్వం చేసుకొన్న కర్మలయొక్క ఫలితాలనే సమయానికి పొందుతూ ఉంటాడు. ఆ కర్మ ఫలాలు మానవుని వశంలో ఉండవు. దాన్ని తెలుసుకోలేక మూఢులు దైవాన్ని నిందిస్తూ ఉంటారు.

విను పూర్వ కర్మ ఫలములు
దనకు వశముగాక పొందుఁ దఱితో; వానిం
గనుఁగొన నేరక మూఢుఁడు
దన కాపద యైన చోట దైవము దూఱున్

కార్యఫలం రావడంలో తానే కర్త ననుకోవడం అజ్ఞానం. తానే కర్త అయితే తన పనుల్ని సఫలమయ్యేటట్లు మానవుడు చేసుకోరాదూ? చేసుకోలేడు. అది తన చేతి లోది కాదు కనుక.

కార్య ఫలముల యెడ దాన కర్త ననుట
కడు నెఱుంగమిఁ జువ్వె తాఁ గర్తయేని
తగిలి తనదైన కార్యజాతంబు నెల్లఁ
జెడక ఫలియించు నట్లుగాఁ జేయరాదె?

కర్మఫలం అనేది మానవుని చేతిలో లేదు. ఎట్లా అంటే......

నీతిపరులూ, ధర్మపరులూ చేసిన పనులు కూడా కొన్ని ఫలించవు. దుష్టులూ, క్రూరులూ చేసిన పనులు కొన్ని విశేషంగా ఫలిస్తాయి. కొందరికి ప్రయత్నం లేకుండానే ఎంతో ధనం చేకూరుతుంది. కొందరికి ఎంత ప్రయత్నించినా, ఆయాసపడినా ధనం లభించదు. ఫలితం దక్కదు. కొంతమంది పేదవారికి పిల్లలు ఎక్కువ పుడతారు. ధనవంతులు కొందరికి ఎన్ని దానధర్మాలు ఆచరించినా సంతానం కలుగదు. లోకపరిస్థితి ఇట్లా ఉంటోంది. అంటే కర్మఫలం మన అధీనంలో ఉండదని గ్రహించాలి. కర్మఫలం తన వశంలోనే ఉండేటట్లయితే మానవుడు ఏ ఆపదా, రోగమూ, మరణమూ లేకుండా జీవించేవాడే కదా!

పురుషుఁడు కర్మాధీనత
నరుగక తన వశమ యనిన నాపదలు రుజల్
మరణంబును నివి యేమియుఁ
బొరయక యుండంగ బ్రదుకఁ బోలదె చెపుమా! 3-5-69

అసలీ దేహమే కర్మను బట్టి లభిస్తుంది. మానవుని ప్రవర్తన కూడ కర్మాధీనమే. ఈ దేహం నశిస్తే కర్మ విహిత మయిన మరో చోటికి ఈ జీవుడు పోతాడు.

కర్మవశతఁ జూవె కలుగు దేహము, దేహ
వర్తనంబు కర్మవశతఁ బుట్టు
దేహపాతమైన దేహస్థుఁడగు జీవుఁ
డరుగుఁ గర్మ విహితమైన యెడకు. 3-5-70

జీవు డనగా !

ఆ మాటలకు కౌశికడు జీవుడనగా ఎవడు? ఎట్టివాడు? అని ప్రశ్నించాడు. ధర్మవ్యాధు డిలా చెప్పనారంభించాడు.

జీవుడనేవాడు చాలా సనాతనుడు. తన కర్మవశాత్తు ఆ జీవుడు అస్థిరమయిన ఈ దేహం పొందుతున్నాడు. ఈ దేహం నశిస్తే మరో దేహం పొందుతాడు. అది కూడా తాను చేసిన పుణ్యపాప కర్మవశంగానే జరుగుతుంది. అంతేకాని జీవుడు నశించడు. దేహం మాత్రమే సశిస్తుంది.

ఆ మాటలు విని కౌశికుడు "పుణ్యపాప కర్మల వల్ల దేహబంధం ఎట్లా ఏర్పడుతుంది? వివరించి చెప్పు" మని అడిగాడు ధర్మవ్యాధుడు వివరిస్తున్నాడు.

కేవలం స్థిరమయిన పుణ్యకర్మలనే చేస్తే అతడు దేవతాజన్మను పొందుతాడు. పుణ్యపాపాలు రెండూ చేస్తే మానవజన్మ ఎత్తుతాడు. కేవలం పాపాలు మాత్రమే చేస్తే పశువులుగా, కీటములుగా(పురుగులు) పుడతాడు. ఈ విధంగా పుడుతూ, నశిస్తూ మోహసముద్రంలో పడి కొట్టుమిట్టాడుతూ దరి చేరలేకుండా ప్రయాస పడుతూనే ఉంటాడు జీవుడు.

ఈ విషయాన్ని గ్రహించడం వల్లనే పండితులూ, బుద్ధిమంతులూ (తెలివైన వారు) పాపం జోలికి పోరు. గర్వరహితులై, అహంకార దూరులై అసూయా

ద్వేషాలు విడిచి ప్రవర్తిస్తూ ఉంటారు. ఇదే ధర్మమార్గం. ఈ ధర్మమార్గం ఒకసారి రుచి చూస్తే ఆ ధర్మపరుడు ఇక ఆ మార్గాన్ని వదలడు. సత్కార్యములు మాత్రమే ఆచరిస్తూ ఉంటాడు. అట్లా చేస్తూ ఉంటే కొంత కాలానికి మనస్సు నిష్కల్మష మవుతుంది. ప్రసన్నమయిన మనస్సు ఏర్పడుతుంది. ప్రసన్న చిత్తం కలవానికి ఇంద్రియసుఖాలు వ్యర్థములుగా కనిపిస్తాయి. దానితో ఇంద్రియ సుఖాలను త్యజిస్తాడు. తద్ద్వారా తపస్సు, దమం, సత్యం మొదలగు సద్గుణాలు ప్రధానంగా గల స్వభావమేర్పడుతుంది. అటువంటి స్వభావమే పరిపక్వమయి పరమార్థ పదవిని పొందుతాడు. అనగా మోక్షం పొందుతాడు.

ఈ మాటలు విని కౌశికుడు “ఇంద్రియాలంటే ఏమిటి? అవి నిగ్రహించక పోతే పాపం వస్తుందా? వాటిని నిగ్రహించితే ఫలితం ఏమిటి?” అని పశ్నించాడు. ధర్మవ్యాధుడు సమాధానం చెపుతున్నాడు.

అన్ని విషయాలకూ మూలం మనస్సు.[1] అది కామక్రోధాలతో కూడి మానవుని యింద్రియ సుఖాలవైపు మళ్లిస్తుంది. ఇంద్రియాలకు వశమయినవాడు రాగంతో నిండి పోతాడు. రాగం వల్ల లోభం కలుగుతుంది. పైగా ఈ యింద్రియాలను విచ్చలవిడిగా ప్రవర్తింపనిస్తే మానవుడు పాపాలకు లోనవుతాడు. సజ్జనులు చెప్పే ధర్మమూ, న్యాయమూ పాటించడు. దుర్మార్గుల వైపూ, దుర్మార్గప్రవృత్తి వైపూ ప్రీతి జనిస్తుంది. ఉండవలసిన త్రికరణశుద్ధి లోపిస్తుంది. మనస్సులో ఒక విధంగా, మాటలో మరో విధంగా, చేతలో ఇంకో విధంగా ప్రవర్తిస్తాడు. ఇహలోకంలో పుణ్యహీనుడయి, పరలోకంలో దుఃఖం పొందుతాడు. అందుచేత మానవుడు ఇంద్రియాలకు వశంగాక సజ్జన సంసర్గంతో సుగతిని పొందాలి.

ఇంద్రియము లంటే ఏమిటో చెప్పాలంటే బ్రహ్మవిద్య నుపదేశించాలి. సరే! బ్రహ్మవిదులకు నమస్కరించి నాకు తెలిసినంత వరకు తెలియపరుస్తాను. సావధానంగా విను.

---

1. మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః మైత్ర్యుపనిషత్

బ్రహ్మ విద్య:

ఈ ప్రపంచ మంతా పంచభూతాత్మక మయినది. 1. ఆకాశం 2. వాయువు 3. అగ్ని 4. జలం 5 భూమి. ఈ అయిదింటిని పంచభూతము లంటారు. వీటి గుణాలు ఇవి. ఆకాశమునకు శబ్దం గుణం (శబ్దగుణక మాకాశం); అట్లే వాయువు నకు స్పర్శ; అగ్నికి రూపం; జలానికి రసం: భూమికి గంధం (వాసన) గుణాలుగా ఉంటాయి. ఈ అయిదూ క్రమంగా ఒకదాని నుండి మరొకటి పుడతాయి. అనగా ఆకాశం నుండి వాయువూ; వాయువునుండి అగ్ని; అగ్నినుండి జలమూ; జలం నుండి భూమీ ఉద్భవిస్తాయి. మళ్ళీ నశించేటప్పుడు భూమి జలంలోనూ, జలం అగ్నిలోనూ, అగ్ని వాయువులోనూ, వాయువు ఆకాశంలోనూ లీన మవుతాయి.[1]

మానవుని జ్ఞానేంద్రియాలు అయిదు 1. చెవి 2. చర్మం 3. నేత్రములు 4. నాలుక 5. ముక్కు. పంచభూతాలకు గుణాలున్నట్లుగానే ఇంద్రియాలకు విషయా లున్నాయి. చెవికి శబ్దం; చర్మానికి స్పర్శ; నేత్రానికి రూపం; నాలుకకు రసం; ముక్కుకు వాసన విషయాలు.

ఈ అయిదు ఇంద్రియాలను మించి, ఆరవదిగా మనస్సు (Sixth sense) ప్రవర్తిల్లుతుంది. ఏడవదిగా బుద్ధి, ఎనిమిదవదిగా అహంకారమూ వర్తిస్తాయి.


ఇవి కాక సత్త్వ రజ స్తమో గుణములు మూడున్నాయి. వీటన్నిటితో కూడిన ఈ పంచభూతాత్మక మయిన ప్రపంచం అవ్యక్తతత్త్వంలో మునిగి తేలుతూ ఉంటుంది.

---

1) ఈ విషయమే తైత్తిరీయోపనిషత్తులోని ఆనందవల్లిలో ఇలా చెప్పబడింది.

తస్మా ద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః ఆకాశా
ద్వాయుః, వాయో రగ్నిః అగ్నే రాపః అద్భ్యః పృథివీ.

ఈ పంచ భూతాలకు సంబంధించి మరో విశేషముంది. ఆకాశానికి శబ్దం ఒక గుణం. వాయువునకు శబ్దంతోపాటు స్పర్శగుణం కూడా ఉంది. అధికమయిన ఆ స్పర్శగుణమే ప్రధానగుణంగా చెప్పబడింది. అలాగే అగ్నికి శబ్ద స్పర్శలతోపాటు రూపం కూడా ఉంది. జలానికి శబ్దస్పర్శ రూపాలే కాక రసగుణం కూడా ఉంది. జలంలో నుండి పుట్టిన భూమికి ఆ నాలు లక్షణాలే కాక గంధం (వాసన) అధికం. (గంధవతీ పృథివీ)



6వ ఇంద్రియం ... ... మనస్సు

7వ ఇంద్రియం ... ... బుద్ధి

8వ ఇంద్రియం ... ... అహంకారము

ధర్మవ్యాధుడు ఇంకా యిలా కొనసాగించాడు. ఈ యింద్రియాలు ఎల్లప్పుడూ శబ్దాది విషయాల్లో చరిస్తూ ఉంటాయి. పండితు డా విషయం గ్రహించి, ఆ ఇంద్రియాలను అదుపులో పెట్టాలి. అట్లా యింద్రియాలను అదుపులో నుంచుకొన్న వాడు తననే ఈ పంచభూతాలతో కూడిన పరతత్త్వంగా దర్శిస్తాడు. నిర్మలమయిన తపస్సులతో సమగ్రంగానూ, స్ఫుటంగానూ తనయందే భూతములన్నిటినీ దర్శిస్తాడు. అసలు తపమంటే ఏమిటో తెలుసా?

అన్ని విషయాలకూ దూరమయిన బుద్ధి వైభవమే తపస్సు. తపస్సులో స్థిర పడిన యోగికి ఇతర కర్తవ్యాలు ఉండవు.

తపమనఁగ సకల విషయ
వ్యపేత మగు నట్టి బుద్ధివైభవము సుమీ!
తపమున సుస్థిరుడగు యో
గ పరునకుం గలవె యొండు కర్తవ్యంబుల్ ? 3-5-90

ఇంద్రియాల వల్లనే స్వర్గం కాని, నరకం కాని సంక్రమిస్తుంది. ఇంద్రియాలను నివారిస్తే స్వర్గం లభిస్తుంది. నిరోధించలేకపోతే నరకం సంక్రమిస్తుంది.

ఈ శరీరం ఒక రథం (వంటిది). ఇంద్రియాలు గుఱ్ఱాలు. ఆత్మయే సారథి. ఆ గుఱ్ఱాలను ధైర్యం అనే పగ్గాలతో దృఢంగా బంధించి, తెలివిగా క్షేమకరమయిన మార్గంలో నడచేవాడే బుద్ధిమంతుడనిపించుకొంటాడు.

అరదము దేహ మింద్రియము లశ్వము లాత్ముఁడు సూతుఁ డమ్మహా
తురగచయంబు ధైర్యమను తోరపుఁ బగ్గములన్ దృఢంబుగా
నురవడిఁ బోక యుండ వెరవొప్పఁగఁ బట్టిన వాఁడు సేమపుం
దెరువున నేఁగు నప్పరమధీరుఁడు సువ్వె యుదారుఁ డెయ్యెడన్. 3-5-92

అట్లాకాక ఇంద్రియాలు లాగిన చోటికే మనసు పరువెత్తుతూ ఉంటే, దాని వేగాన్ని అణచకపోతే, బుద్ధి చెడిపోతుంది. సముద్ర మధ్యంలో తుఫానుతో నావ మునిగిపోయినట్లుగా మునిగిపోతాడు. అందుకే ఇంద్రియాలను తన వశంలో ఉంచుకొన్న వాడే ధ్యాన నిష్ఠుడవుతాడు. వానినే దేవతలూ, మునులూ కీర్తిసారు.

గుణత్రయము :

సత్త్వ రజస్తమో గుణాలు మూడింటిలోనూ తమోగుణం అతినింద్యమయినది. శ్రేష్ఠమూ, అతి బోధమయమూ సత్త్వగుణం. అది సదా ప్రకాశయుతమయినది. ఈ రెండు గుణాల సమ్మేళనమే రజోగుణం.

తామస భావాలు: దుఃఖం, నిద్ర, మోహం, దైన్యం, అసహనం.
రాజస భావాలు: రాగం, లోభం, జడత్వం, మానం.
సాత్త్విక భావాలు: ధైర్యం, శాంతి, కరుణ, సంతోషం, విద్య మొదలయినవి.

సాత్త్వికుడు తన జ్ఞానంతో సర్వమునూ పరిశీలించి, లౌకికమయిన ప్రవర్తనను నిరసిస్తాడు. లౌకిక విషయాల సంగమును పరిహరిస్తాడు. మమకారం, అహంకారమూ విడచి పెడతాడు. సంయమ స్వభావం వహించి, ఉత్తమమయిన శాంతిని పొందుతాడు. సత్త్వగుణ నిబద్ధుడయితే శూద్రుడయినా జన్మాంతరంలో వైశ్యత్వం పొంది, అలాగే క్రమంగా రాజ విప్రభావాలు పొంది, విముక్తు డవుతాడు."

అని చెప్పి ఇంకా యోగ దర్శనాన్ని గురించి ఉపన్యసించి, యిలా అన్నాడు.

ప్రాణాపాన సమాహితుడై జీవుల శరీరాల్లో చరించే పావకుడే జీవాత్ముడు. అతడు నీళ్ళలో ఉన్న తామరాకు లాగా శరీరంలో ఉన్నా, నిర్లిప్తుడయి ప్రకాశిస్తూ ఉంటాడు, దానితో అంటకుండా. అటువంటి జీవాత్ముడే పరమాత్ముడు.

పరమాత్ముడు చైతన్యం లేని క్షేత్రానికి చైతన్యం కలిగించి జీవాత్ము డవుతాడు. ఇట్లాగే త్రిలోకాలను సంకల్పించి కల్పిస్తాడు.

ప్రాణులలో వెలిగే ఆ భూతాత్ముని జ్యోతిర్మయునిగా తెలుసుకోవాలి. అట్లా తెలుసుకోగలగడం అద్వైత భావన గల బుద్ధియొక్క సూక్ష్మ ధర్మం. ఆ ధర్మం తోనే జ్యోతిర్మయుని గుర్తిస్తారు.

బ్రహ్మ విద్యాధారణం చేసిన వాని స్వరూపం ఇలా ఉంటుంది. 1. అతనికి శుభాపరకర్మల భేదం ఉండదు. వాటిని పాటించడు. 2. సుఖదుఃఖాలు, శీతోష్ణములూ మొదలగు ద్వంద్వాలలో సమానంగా ప్రవర్తిస్తాడు. 8. ప్రతి దినమూ నియతాశియై ఉంటాడు. అనగా నియమంతో మితంగా భుజిస్తాడు 4. జితేంద్రియుడయి ప్రవర్తిస్తాడు. 5. అంతేకాదు, అతడు పూర్వసంధ్యా సమయంలోనూ, అపరసంధ్యా సమయంలోనూ ధ్యానధారణ నిరతుడై ఉంటారు. అపుడతడు జ్ఞానదీపంతో ఆత్మరూపుని తన ఆత్మలోనే చూస్తూ, నిశ్చలమయిన జ్యోతిలా వెలుగుతూ అమృతత్వాన్ని పొందుతాడు.

కామంబును గ్రోధంబును
నేమఱక జయింపవలయు నెల్ల విధములన్
ధీమహిత! యిదియ సతత
క్షేమంకర మయిన పథము కృతబుద్ధులకున్ 3-5-109

ఏ విధంగా నయినాసరే ఎల్లపుడూ కామక్రోధాలను జయిస్తూనే ఉండాలి. వాటిపట్ల ఏమరుపాటు పనికిరాదు. ఇది సతత క్షేమంకరమయిన పద్ధతి.

నిత్యము గర్మియుం గర్మఫ
లత్యాగియు నగుట లెస్స; లౌల్య వియోగం
బత్యుత్తమ యోగము ద
త్ప్రిత్యయ లక్ష్యుండు సూవె బ్రాహ్మణుఁడు మహిన్. 3-5-110

నిత్యమూ సత్కర్మల నాచరిస్తూ, కర్మఫలాన్ని మాత్రం త్యజించాలి. దేని మీదనూ లౌల్యం పనికిరాదు. ఇది అత్యుత్తమ యోగం. ఆ యోగం లక్ష్యంగా కలవాడే బ్రాహ్మణుడు.

అరయఁగ జీవితంబు గడు నస్థిర; మింత యెఱింగి యాత్మ నె
వ్వరి దెసఁ గీడురోయక ధ్రువంబగు మైత్రి భజించి సత్కృపా
నిరతుఁడు నిష్పరిగ్రహుఁడు, నిత్య తపస్వియు నిత్య తృప్తుడుం
బరమశమాన్వితుండు నగు బ్రాహ్మణుఁడొందు సనాతన స్థితిన్ 3-5-111

1) ఈ జీతం అశాశ్వత మయినదని తెలుసుకొని 2) ఎవరికీ మనసులో కూడ కీడు తలపక, 3) అందరితో స్థిరమయిన మైత్రి కలిగి 4) దయాస్వభావం కలిగి 5) ఎవరి నుండీ ఏమీ గ్రహింపపండా 6) నిత్యమూ తపస్సు చేసుకొంటూ 7) నిత్యమూ సంతృప్తి అనే సద్గుణం కలిగి 8) పరమ శాంతుడయినవాడు సనాతన మయిన మోక్షాన్ని పొందుతాడు.

అని చెప్పి ధర్మవ్యాధుడు "నీ వడిగిన ధర్మాలన్నీ సంక్షేపంగా చెప్పాను. ఇంకా ఏమి కావాలి?" అన్నాడు. అందుకు కౌశికుడు "మహాత్మా! నీవు సర్వజ్ఞుడవని యిపుడు తెలిసింది" అన్నాడు. అపుడు ధర్మవ్యాధుడు "ఆర్యా! నే నిటువంటి ఉత్తమ విజ్ఞానాన్ని పొందటానికి కారణమయిన ఒక ధర్మం ఉంది.

మాతా పితృసేవ :

అది నీకు ప్రత్యక్షంగా చూపిస్తాను." అంటూ కౌశికుని తన యింటిలోపలకు తీసుకొని వెళ్లాడు. నిత్యపూజితులయిన తన తల్లిదండ్రులకు నమస్కరించి, ధర్మ వ్యాధుడు కౌశికునికి వారిని పరిచయంచేస్తూ అంటున్నాడు. "వీరు మా తల్లిదండ్రులు. వీరి శుశ్రూష వల్లనే నాకీ జ్ఞానం లభించింది. వీరే నాపాలిటి వేల్పులు. నేనూ, నా భార్యా, పుత్రులూ అందరమూ వృద్ధులయిన వీరికి సేవ చేస్తాము. వ్రతాలు కానీ, యజ్ఞాలు కానీ అన్నీ వీరే నాకు. ఆర్యులు చెపుతారు "తల్లి, తండ్రి, గురుడు, అగ్ని, పరమాత్మ - ఈ అయిదుగురూ ఎవరివల్ల ప్రసన్నులవుతారో వాడే ధర్మాత్ముడు."

సరే! పతివ్రత పంపిందనే గౌరవంతో నీకు అన్నీ చెప్పాను. నీ మీదనా మనస్సు ప్రసన్నంగా లేదు. నీ వొక అకార్యం చేశావు. నీ మీదనే ఆశలన్నీ పెట్టుకొని వృద్ధులయి జీవిస్తున్న తల్లిదండ్రులను వదలి, నీవు నిశ్చింతగా అధ్యయన శీలంతో వారి అనుమతి లేకుండా క్రూరంగా తిరుగుతున్నావు. నీ కోసం విలపించి వారికి కళ్ళు పోయాయి. ఇకనైనా వెళ్ళి వారి శోకం తీర్చు. వారిని సేవించకపోతే నీ వేదాధ్యయనం అంతా నిష్ఫలమే" అన్నాడు. ఆ మాటలు విని కౌశికుడు ఇలా అన్నాడు.

"నీవు చెప్పినది నిజమే. నా తల్లిదండ్రులకు సేవచేసి ఋణవిముక్తుడ నవుతాను. నీ చెలిమితో నాకు పరమాహ్లాదం కలిగింది. ఈ ధర్మమార్గం సాటిలేనిది. ఇటువంటి ధర్మపరాయణత, ధర్మైకతత్పరత పదివేలమందిలో ఒకరికి ఉంటుందో, ఉండదో చెప్పలేము. నీ చరిత్ర చాలా ఆశ్చర్యకరంగా ఉంది. ఇంత ధర్మపరాయణుడ వయిన నీవు ఈ బోయ జన్మాన్ని ఎందుకు ఎత్తావు?" అని అడిగాడు. దానికి సమాధానంగా ధర్మవ్యాధుడు తన పూర్వజన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు

ధర్మ వ్యాధుని పూర్వజన్మ వృత్తాంతం

నేను పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడను. నా కొక రాజపుత్రుడు స్నేహితుడు. అతనితో నేనొకనాడు వేటకు వెళ్ళి, మృగాలను వధిస్తూ ఉండగా, చెట్ల గుబురులో ఉన్న ఒక మహర్షికి నా బాణం వెళ్ళి తగిలింది. అతడు నాపై కోపించి శూద్రజన్మ నెత్తుమని నన్ను శపించాడు. "ఎరుగక చేసిన తప్పు ఇది, క్షమించు"మని వేడు కొన్నాను. అప్పుడా మహర్షి "నీవు బోయకులంలో పుడతావు. ధర్మాలన్నీ తెలుసు కుంటావు. తలిదండ్రులకు భక్తితో సేవ చేస్తావు. దానివలన నీకు తరువాత జన్మలో బ్రాహ్మణత్వం కలుగుతుంది." అని అనుగ్రహించాడు. ఆ మాటలు విని సంతృప్తుడై కౌశికుడిలా అన్నాడు. "మరో జన్మ ఎందుకు? నీ పుణ్య చరితవల్ల నీవు ఇప్పుడే విప్రుడ వయ్యావు. 'బ్రాహ్మణుడయినా పాపవర్తను డయితే శూద్రునికంటె నీచుడే. సత్యమూ, శౌచమూ, ధర్మమూ ఆచరించేవాడు శూద్రుడయినా విప్రుడే' అని మహర్షులు చెప్పారు.

పాప వర్తనుండు బ్రాహ్మణుఁ డయ్యును
నిజము శూద్రుకంటె నీచతముఁడు
సత్యశౌచ ధర్మశాలి శూద్రుండయ్యు
నతఁడు సద్ద్విజుండ యనిరి మునులు 3-5-137

‘అయ్యో! నేను హీన జన్మ మెత్తవలసి వచ్చిందే’ అని దుఃఖించకు. మానవుడు తాను చేసుకొన్న కర్మల వల్లనే మేలు కాని, కీడు కాని కలుగుతుంది. వానిని ప్రాజ్ఞులు సమానంగా స్వీకరించి మనోవ్యాధిని హిత ధర్మ కర్మలతోనూ, శారీరక వ్యాధిని వైద్యంతోనూ పోగొట్టుకొంటారు. అన్నిటిలోనూ సాత్త్వికమైన దృష్టి కలిగి ఉంటారు.

ప్రియములు వాయుటయును న
ప్రియములు వెసఁ బొందుటయును బెల్లుగ నగుఁ ద
త్క్రియలందు మూఢమతికి హృ
దయ తాపము వాయ దెపుడుఁ దరికొనుచుండున్ 3-5-140

ప్రియములు తొలగినా, అప్రియాలు కలిగినా మూఢులకు మనస్తాపం కలుగుతుంది. అంతేకాదు మనస్తాపం మరింత అధికమవుతూ ఉంటుంది.

వగతు మన్న నెవ్వారికి వగవఁ జనదు
చిత్తమున నేమిటికి సంతసింపరాదు
కాన గతము నందును ననాగతము నందు
వగవ రార్యులు సంతోషవంతు లగుచు 3-5-141

ఎవరి కొరకూ, దేని కొరకూ విచారింపరాదు. ఎంత కలిమి కలిగినా దేనికీ అంతగా సంతసింపనూ రాదు. అందుకే నిత్యసంతోషులయినవారు పోయినదానికీ, రానిదానికీ విచారింపరు.

వగపునఁ దేజో హీనుం
డగు నాత్మహిత క్రియలకు నక్షముఁ డగు న
వ్వగపు దొఱఁగి యుద్యోగము
దగఁ జేయఁగఁ గలుఁగు సంచితములగు శుభముల్ 3-5-142

విచారం వల్ల తేజోహీనత సంభవిస్తుంది. దానితో తనకు హితమయిన పనిని తానే చేసుకోలేకపోతాడు. అందుచేత విచారం వదలి, ప్రయత్నం చెయ్యాలి. అపుడు తగిన శుభాలు కలుగుతాయి. అందుచేత ధైర్యంతో ఉండటమే” అన్న కౌశికుని మాటలు విని, ధర్మవ్యాధుడు “మహాత్మా! నీవు చెప్పినట్లుగానే నేను విచార రహితుడనై ఉన్నాను. భవిష్యత్కాలం మంచిదనే భావంతో ప్రవర్తిస్తున్నాను” అన్నాడు.

కౌశికుడు ధర్మవ్యాధునికి ప్రదక్షిణం చేశాడు. “నీవల్ల నామనస్సు ధర్మంలో లగ్నమయింది. నేనువెళ్ళి వస్తాను అనుమతించు” అని ధర్మవ్యాధుని వీడ్కొని వెళ్లి, తన తల్లిదండ్రులకు అతిభక్తితో సేవచేసి కృతార్థుడయ్యాడు.

ఈ కథ అంతా చెప్పి మార్కండేయుడు “నీవడిగిన విశేషాలన్నీ చెప్పాను. ఇంకేమి కావాలి” అని అడిగాడు. ధర్మరాజు అగ్నిదేవుని తపస్సును గురించి, అంగిరసుడు అగ్ని అయిన రీతిని గురించి ప్రశ్నించాడు.

ధర్మజుని ప్రశ్నలకు సమాధానంగా మార్కండేయుడు అగ్నిదేవుని చరిత్రను సాకల్యంగా వివరించాడు. అనేక శాఖలుగా విస్తరిల్లిన అగ్నివంశాన్ని వివరించి, ఎన్ని శాఖలుగా విస్తరిల్లినా ఆత్మతేజ మొకటే అని ముగించాడు. ఆ తరువాత ధర్మరాజు మరో సందేహాన్ని వెలిబుచ్చాడు. కుమారస్వామి అగ్నికీ, కృత్తికలకూ, శివునికీ ఎలా కొడుకయ్యాడో చెప్పుమని అడిగాడు. మార్కండేయుడు కుమారస్వామి వృత్తాంతాన్ని ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

“రాక్షసులతో ఓడిపోయిన దేవేంద్రుడు సేనాధిపతిని అన్వేషిస్తూ ఒక స్త్రీ విలాపాన్ని విని, ఆమె నెత్తుకొని పోతున్న కేశి అనే రాక్షసుని నుండి ఆమెను విడి పించాడు. ఆమె తన వృత్తాంతాన్ని యిలా చెప్పింది. ‘నేను అరిష్టనేమి అనే ప్రజాపతి కుమార్తెను. నా పేరు దేవసేన. నాఅక్క పేరు దైత్యసేన. మేమిద్దరమూ మానస పర్వత సమీప ప్రదేశాల్లో విహరిస్తూ ఉండగా, ఈ రాక్షసుడు మాముందు తన దుర్విలాసాలు ప్రదర్శించాడు. అవి మా అక్కకు అభిమతం కాగా ఆ రాక్షసుడు మా అక్కను ఎత్తుకొనిపోయాడు. అంతతో ఊరుకొనక, అతడు తిరిగివచ్చి, నన్ను కూడా ఎత్తుకొని పోదలచాడు. ఇంతలో నీవల్ల రక్షింపబడ్డాను’ అని తన కృతజ్ఞతను తెలియజేసింది. ఇంద్రుడు ‘నీవు నాకు చెల్లివి అగుదువు. నీకేమి కావలెనో కోరుకో’ అన్నాడు. ‘నాకు ప్రథిత పౌరుషుడయిన భర్త కావలె’నని ఆమె కోరింది. సరిగా ఆ సమయం సూర్యసోమాగ్ని సమాగమ కాలం అవడం చేత వారి తేజంతో పుట్టినవాడే ఈమెకు భర్త కావలెనని ఇంద్రుడు నిశ్చయించాడు. బ్రహ్మ దగరకు వెళ్ళి ఆమెకు పతిని ఇవ్వవలసినదిగా అభ్యర్థించాడు. అతడు ‘ఆమెకు పతి అయినవాడే నీకూ సైన్యాధిపత్యం వహిసా’దని పరమిచ్చి పంపాడు.

ఇది యిట్లా ఉండగా వసిష్ఠాది మహర్షులు అమావాస్యా హోమాలు చేస్తున్నారు. హవిస్సులను అగ్నిహోత్రుడు దేవతల కందిస్తూ, మునిపత్నులను చూసి, వికల

హృదయుడయ్యాడు. వారిని పొందటం దుర్లభమని తెలిసి, నిర్జన వనానికి వెళ్ళి, అగ్నిహోత్రుడు శరీరత్యాగం చేద్దామనుకొన్నాడు. ఇదంతా తెలిసి అతని భార్య స్వాహాదేవి సప్తర్షులలో అంగిరసుని భార్య అయిన 'శివ' అను నామె రూపాన్ని ధరించి, అగ్నిహోత్రుని కలిసి, అతనిని సంతుష్టుని చేసింది. అతని తేజోధాతువును ధరించి, ఆమె గరుడి రూపాన్ని పొంది, శ్వేత పర్వతానికి వెళ్ళి, అక్కడ రెల్లుగడ్డితో నిండియున్న బంగారు కుండంలో తనభర్త శుక్లాన్ని ఉంచింది. ఇలాగే మిగిలిన ముని పత్నుల రూపాలను దాల్చి, అతని తేజోధాతువుతో ఆ బంగారు కలశాన్ని నింపింది. కాని అరుంధతి రూపాన్ని మాత్రం ధరించలేకపోయింది. ఇట్లా ఆరుసార్లు కలిగిన అగ్నితేజస్సువల్ల షణ్ముఖుడయిన కుమారుడుదయించాడు. పుట్టిన వెంటనే అతను ఆరు ముఖాలతో ప్రళయ భయంకరమయిన ఒక్క అరుపు అరిచాడు. దానితో లోకాలన్నీ ఆకులము లయిపోయాయి. కుల పర్వతాలు కూడా కదలిపోయాయి. సముద్రాలన్నీ సంక్షోభించాయి. మునిపత్నులకు అగ్ని వల్ల పుట్టిన బాలుని వల్ల ఈ అనర్థం కలిగిందని ప్రజలంతా ఆక్రోశించారు. ఈ అపవాదానికి భయపడి వసిష్ఠుడు తప్ప మిగిలిన ఋషులంతా తమ భార్యలను పరిత్యజించారు. అప్పుడు స్వాహాదేవి ఆ మహర్షుల దగ్గరకు వెళ్ళి, విషయమంతా చెప్పింది. మీ పత్నుల రూపాన్ని ధరించి నేనే అగ్నిహోత్రుని కలిశాననీ, మీ పత్నుల దోషం యిందులో ఏమాత్రమూ లేదనీ, సత్పురుషులు కులసతులను విడువ తగదనీ ఎంత చెప్పినా వారు ఒప్పుకోలేదు.

ఆ తరువాత విశ్వామిత్రుడు కుమారుని దగ్గరకు వెళ్ళి, అతన్ని స్తుతించి, అతని ఆజ్ఞతో జాత కర్మాది విధులన్నీ కావించాడు. ఇదంతా తెలిసి దేవతలంతా యింద్రుని దగ్గరకు వెళ్ళి యిలా అన్నారు. 'గర్వస్వభావుడయిన అగ్నిహోత్రుని కొడుకు నిన్ను లెక్కచేయక వచ్చి, నీ పదవిని అధిరోహింప బోతున్నాడు. అంతకుముందే నీ వాతనిని వధించు, దానివల్ల నీ పదవి శాశ్వత మవుతుంది' అన్నారు. వెంటనే యింద్రుడు సప్తమాతృకలను పిలిచి 'ఆ కుమారుని చంపి నాకు ప్రియం చేకూర్చు' డని ఆదేశించాడు. వారువెళ్ళి కుమారుని ఆవేశించారు. కాని నిలువలేక అతని తేజోవిశేషానికి భయపడి, అతనినే శరణుజొచ్చి 'మేము లోకమాతలము, మాయందు నీవు మాతృభావాన్ని ప్రదర్శించు' అన్నారు. కుమారస్వామి వారి నభినందించి స్వీకరించాడు. అంతలో అగ్ని అక్కడకు వచ్చి,

కుమారుని రక్షణ కోసం నిలిచాడు. వెనువెంటనే ఇంద్రుడు కుమారస్వామిపై దండెత్తి వచ్చాడు. అది చూసి కుమారుడు ఒక వికటాట్టహాసం చేశాడు. అతని ముఖం నుండి భయంకర మయిన అగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లాయి. దేవతలంతా భయపడి కుమారస్వామినే శరణు వేడుకొన్నారు. ఇది చూసి, యింద్రుడు కుమారస్వామిపై వజ్రాయుధం ప్రయోగించాడు. అది వెళ్లి కుమారస్వామి కుడిభుజాన్ని తాకింది. వెంటనే అతని భుజంనుండి విశాఖుడనే పురుషుడూ, కన్యాకుమారగణాలూ పుట్టాయి. వారిని చూచి భయపడి, యింద్రుడు కూడా కుమారస్వామినే శరణు వేడాడు. ఇదంతా కుమారస్వామి పుట్టిన అయిదవ నాటి చరిత్ర. ఆరవనాటికి కుమారుడు సంపూర్ణ యౌవనడయ్యాడు. లక్ష్మీదేవి అతనిని వరించి వచ్చింది. శ్రీసమేతుడయిన కుమారస్వామిని చూసి మహర్షులంతా అంజలి ఘటించారు. ఇంద్రుడు తన రాజ్యపదనిని కుమారస్వామికిచ్చి, అమరులను ఏలుకొమ్మన్నాడు. దానికి కుమారస్వామి రాజ్యపదవి అక్కరలేదనీ, శత్రుసంహారానికై దేవసేనా-పతిత్వాన్ని వహిస్తాననీ చెప్పాడు వెంటనే సురలు మునులు కుమారస్వామిని దేవసేనాధిపతిగా అభిషేకించారు. పార్వతీ పరమేశ్వరు లిరువురూ వచ్చి కుమార స్వామిని ముద్దాడి ఒక పుష్పమాలిక నిచ్చారు."

ఈ కథ వింటూ ఉన్న ధర్మరాజుకు ఒక సందేహం వచ్చింది. "కుమారస్వామి రుద్రాంశవల్ల జన్మించాడని చెపుతారు కదా! ఇది ఎట్లా సాధ్యం?" అని అడిగాడు. దానికి మార్కండేయుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

"నిజమే! రుద్రుడు తన వీర్యాన్ని పూర్వం అగ్నిహోత్రునిలో ఉంచాడు. ఆ తేజోవిశేషం చేత అగ్నిహోత్రుడు కుమారస్వామిని ఉత్పాదించాడు. అదీగాక అగ్నినే రుద్రుడని వేదవిదులు అంటారని వినబడుతోంది. అందుచేత కుమారస్వామి అగ్నికుమారుడూ అవుతాడు, రుద్రకుమారుడూ అవుతాడు. కృత్తికలనే పేరు కల మునిపత్నులవల్ల ప్రభవించినవాడు కాబట్టి కార్తికేయుడు కూడా అవుతాడు. శ్వేత శైలంలో రేతస్కందం చేయడం చేత పుట్టినవాడు కాబట్టి స్కందుడనే పేరు కూడా వచ్చింది.

అప్పుడు ఇంద్రుడు పూర్వంనుండి కాపాడుకున్న దేవసేనను కుమారస్వామి కిచ్చి వివాహం చేశాడు. పతులచే విడువబడిన మునిపత్నులు ఆరుగురూ రక్షింపు

మని కుమారుని వేడుకొన్నారు. 'మాకు పుణ్యగతిలేక అలమటిస్తున్నాము. పుత్ర భావంతో వర్తించి మమ్ము కటాక్షించు' అని వేడుకొన్నారు. అపుడు కుమారస్వామి వినయంతో 'నేను మీకు పుత్రుడనే! సందేహం లేదు.' అని తన ప్రక్కనున్న యింద్రుని చూసి, 'వీరికి తగిన పదవిని ఏర్పాటు చెయ్యి' అన్నాడు. ఇంద్రుడు వెంటనే 'అభిజిత్తనే నక్షత్రం చంద్రుని కోరి తపస్సు చేయటానికై వెళ్ళింది, వీరిని ఆ పదవిలో నిలుపు' మని ప్రార్థించాడు. కుమారస్వామి వారి కాపదవి నిచ్చి వారిని గగనానికి పంపాడు.

తరువాత అగ్నిభార్య అయిన స్వాహాదేవి వచ్చి 'నీవు నా కుమారుడవు. నేను నీ దగ్గరే ఉంటాను' అనగానే, కుమారస్వామి సంతోషంతో స్వీకరించాడు; ఇంతలో కుమారమాతృకలు (ఇంద్రుడు పంపినవారు) ఏడుగురు వచ్చి 'పూర్వ మాతృకల కంటె ముందు మమ్మే త్రిలోకాలూ కొలిచేటట్లు వరం ఇ'మ్మని వేడుకొన్నారు. అపుడు కుమారుడు 'పూర్వమాతృకలను లోకాలు ఎందుకు విడవవలెను? మరియొక వరం ఇస్తా, కోరుకొండి' అన్నాడు. 'అట్లయితే మేమీలోకంలోని శిశువులకు పీడలు కలిగిస్తూ, మీ దయతో ప్రవర్తిస్తూ ఉంటాము. మాకీ వరం ఇయ్యవలసిన'దని వేడుకొన్నారు. అపుడు కుమారస్వామి 'మీరు అన్యాయమయిన కోరిక కోరారు. అయినా నేనుముందుగా ఇస్తానన్నాను గనుక మీకీవరమిస్తున్నాను. మిమ్ములను కొలిచినవారిని మాత్రం రక్షించండి. వారికి ఏకీడూ కలుగనీయకండి. మానవులకు 16 ఏండ్లు వచ్చేవరకే మీరు కీడు కల్గింపగలరు. మీకు రక్షగా ఒకనిని పంపుతున్నా'నని చెప్పి, కుమారుడు తన శరీరంనుండి బంగారు రంగు కలిగిన ఒక పురుషుని ఉద్భవింపజేశాడు. వాడు పుడుతూనే ఆకలితో ఆగలేక నేలపడి మూర్ఛితుడయ్యాడు. కుమారుడు వానికి స్పృహ కల్గించాడు. అతడే స్కందాపస్మారం అనే గ్రహమై మాతృకాగణాన్ని రక్షిస్తూ ఉన్నాడు. అంతేగాక పక్షిమాత అయిన వినత, రాక్షసమాత అయిన దితి, గోమాత అయిన సురభి, శునక మాత అయిన సరమ, వృక్షమాత అయిన కరంజ, సర్పమాత అయిన కద్రువ, కుమారుని దాది అయిన లోహితాస్య - వీరంతా ఈ మాతృకలతో కలిసి గర్భపీడనం, శిశుపీడనం చేస్తూ, మనుష్యులచే బలి, మంత్రోపహారాలూ, దానాలూ, సంతర్పణలు పొందుతూ, బాలురకు ఆయురారోగ్య సుఖాలను ఇస్తూ ఉన్నారు.

16 సంవత్సరాల తరువాత కూడా ఉండే గ్రహాలు కూడా ఉన్నాయి. అవి ఏమిటో చెపుతా విను. కొంతమందికి నిద్రిస్తున్నప్పుడు కాని, మేల్కొని ఉన్నప్పుడు

కాని దేవతలు కన్పించినట్లుగా భ్రమపడి విచ్చలవిడిగా మాట్లాడుతారు. దానిని దేవ గ్రహమని అంటారు. అట్లాగే పితృదేవతలు కనపడినట్లు తోస్తే అది పితృగ్రహమని, గంధర్వులు కనపడినట్లు తోస్తే అది గంధర్వ గ్రహమని, యక్షులు కనపడినట్లు తోస్తే యక్ష గ్రహమని అంటారు. ఒక్కొక్కప్పుడు వాత పైత్యాది వికృతుల వలన మతి తప్పడం కూడా మానవుల్లో కనిపిస్తుంది. అది కూడా ఒక గ్రహ వైకృతమే అనుకొంటారు. ఈ గ్రహ వికృతులు మానవులకు డెబ్బదియేండ్ల వరకే కలుగుతాయి. తరువాత ఈ గ్రహాల అవసరమేలేదు. ముసలితనమే వీటిపని నిర్వహిస్తుంది.

నియమంతో జితేంద్రియులయి శుచి, శాంతి కల వారిని ఈ గ్రహాలు ఏ అవస్థలలోనూ బాధింపలేవు. అదీగాక ఆదిదేవుడయిన మహాదేవుని మీద భక్తితో ప్రవర్తించే వారిని ఈ గ్రహవికారాలు ఏమీ చేయలేవు.

గ్రహాలను ఇట్లా వినియోగించిన తరువాత, బ్రహ్మ వచ్చి, మహాసేనుని (కుమారుని) అభినందించాడు. ఆది దంపతులు కుమారుని ఆశీర్వదించి, అతనితో కలిసి భద్రవటానికి వెళ్లారు. ఈశ్వరుడు కుమారుని సప్తమ మారుత స్కందానికి అధిపతిని చేశాడు. (అంతరిక్షంలో ఒకదానిపై ఒకటి ఏడు మారుత స్కందాలు ఉంటాయి. ఏడు గాలి పొరలు అవి. మన భూమినుండి లెక్కిస్తే వానిలో ఏడవపొర కుమారస్వామి అధీనంలో ఉంటుంది.) దేవతలకు అవసరమయినప్పుడు సహాయపడుమని పార్వతీ పరమేశ్వరులు వెళ్లి పోయారు.

ఇట్లుండగా కొద్దికాలంలో మహిషాసురుడు దేవసైన్యం మీద దండెత్తి వచ్చాడు. కుమారస్వామి ఇంద్రునికి తోడ్పడి మహిషాసురుని సంహరించాడు. ఇంద్రుడు కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపాడు."

సతీత్వ ధర్మాలు :

మార్కండేయుడు చెప్పిన కుమారస్వామి చరిత్ర విని, పాండవులంతా ఎంతో సంతోషించారు. వీరీ కథ చెప్పుకొంటూ ఉండగా సత్యభామ, ద్రౌపది వేరుగా ఒక చోట కూర్చొని ప్రియంగా మాట్లాడు కొంటున్నారు. అప్పుడు సత్యభామ ద్రౌపదితో ఇలా అంది 'ద్రౌపదీ! నీవు నీ భర్త లయిదుగురినీ సమానంగా సేవిస్తున్నావు. వారు కూడా ఒకరికంటె ఒకరు నీయందు అనురాగంతో ఉంటున్నారు. నీపట్ల వారు

నవ్వు మొగాలతో కనిపిస్తారు. ఇటువంటి పరిస్థితి నీకేదైనా వ్రతంవల్ల లభించిందా? మంత్రం చేత లభించిందా? లేక ఔషధంచేత లభించిందా? అదీకాక కేవలం నీ విలాస విభ్రమాల వల్లనా? ఆ కారణ మేమిటో చెపితే నేనూ కృష్ణుని వశం చేసుకొని మహాభోగాలను పొందుతాను' అంది.

ఆ మాటలకు ద్రౌపదికి చిరుకోపం కల్గింది. అయినా అణచుకొని, మృదువుగా ఓ చిరునవ్వు నవ్వి, నిర్వికారంగా ఇలా అంది. 'నన్నింత దుష్టురాలిగా తలంపవచ్చునా నీవు? నిజానికి నీవు పురుషోత్తముని భార్యగా తగవు' అని వేళాకోళం చేసి, ఆమె అవివేకాన్ని ఆమెకు తెలియజేసింది. ఇంకా ఇలా అంది.

'భర్తలు మంత్ర తంత్రాల చేతనూ, ఓషధుల చేతనూ వశు లవుతారనుకోవడం చాలా తెలివితక్కువ. అట్లా చేసిన స్త్రీ యొక్క పొత్తును భర్త 'పాము పొత్తు'గా భావిస్తాడు. మందులకూ, మాకులకూ భర్త వశుడు కాడు సరికదా, అవి భర్తకు రోగాన్ని తెచ్చిపెడతాయి. చివరి కా భార్యకు ఇహంలో లోకనింద కలుగుతుంది. పరంలో సద్గతి చెడిపోతుంది. అందుచేత స్త్రీ తన భర్తలకు ఎన్నడూ ఇటువంటి మందులూ, మాకులూ పెట్టరాదు. భర్త భావం తెలుసుకొని భార్య అనుకూలంగా ప్రవర్తిస్తే చాలు, భర్త వశుడవుతాడు. పాండవుల పట్ల నేనట్లా ప్రవర్తిస్తాను. వారి పట్ల ఎన్నడూ నేను అహంకారం ప్రకటించను. గర్వంకాని, ప్రమాదం కాని లేకుండా భక్తితో సర్వకాలాలలోనూ పరిచర్య చేస్తాను. చూపులలో కాని, పలుకులలో కాని, కోరికలలో కాని, చేతలలో కాని వింత ఎప్పుడూ కనపడదు. అమరుడయినా, గంధర్వుడయినా పరపురుషుని తృణంగా భావిస్తాను.

స్నానం కాని, భోజనం కాని, శయనం కాని భర్తకంటే ముందుగా ఆచరింపను. ఇంటికి వచ్చిన భర్తకు ఆసన పాద్యాదులు స్వయంగా నేనే యిస్తాను. నియతంగా స్నానం, భోజనం మొదలయినవి నేనే చేయిస్తాను. ధన ధాన్యాదులు వ్యర్థంగా ఖర్చుపెట్టను. గృహ పరిశుభ్రత, పాత్ర పరిశుభ్రత ఎన్నడూ ఏమరను. ముందర వాకిట్లో అధికంగా తిరగడం, పతిత అయిన స్త్రీలతో సంభాషించడం, కలహించినట్లు మాట్లాడడం, అతిగా నవ్వుతూ మాట్లాడడం - ఇవి నే నెప్పుడూ ఎరగను. పతులు దేశాంతరం వెళ్ళినప్పుడు పూలు కాని, ఆభరణాలు కాని పెట్టుకోను. భర్తయందే మనసు నిలిపి, వారి ఆగమనాన్ని కోరుతూ ఉంటాను. భర్తకు భక్తితో పరిచరిస్తాను.

గురువులను, విప్రులను, అతిథులను భక్తితో సేవిస్తాను. ప్రీతి, సహనం, సద్బుద్ధి కలిగి మృదువుగా ప్రవర్తిస్తాను. భర్తలు నా పట్ల మృదువుగా ప్రవర్తిస్తున్నారని ఎన్నడూ హద్దు మీరి ప్రవర్తించను. వారికి కోపం వస్తే తట్టుకోలేనని భావించి భక్తితో, భయంతో కొలుస్తాను. మా అత్తగారు కుంతిదేవి భూదేవితో సమానమయిన సహనం కలది. ఆమె భోజన స్నానాదులకు నేనే ఏర్పాట్లు గావిస్తాను. ధర్మరాజు యింటిలో బంగారుపళ్లెరాలలో భుజించే వేలకొలదీ విప్రులకు తగిన సాయం నేనే చేస్తాను. భృత్యులందరినీ తగిన పనుల్లో నేనే నియమిస్తాను. దినసరి ఖర్చులన్నీ నాకు తెలియకుండా జరగవు. పాండవులు కుటుంబ భారమంతా నా మీదనే ఉంచి, తాము స్వేచ్ఛగా ప్రవర్తిస్తూ ఉంటారు. ఎప్పుడో రాత్రి పొద్దుపోయిన తర్వాత కొద్దిగా నిద్రిస్తాను. ఈ రాజ్య కార్యభారం చేత ఆహారానికీ, నిద్రకూ కూడ సమయం చిక్కడం లేదు. ఇటువంటి ప్రవర్తనతో నేను పాండవులను వశం చేసుకున్నాను. అంతేకాని నీవు చెప్పిన మందులూ, మాకులూ నాకేమీ తెలియవు'.

ఆ మాటలకు సత్యభామ చాలా చిన్నబుచ్చుకొంది. సిగ్గుతో ద్రౌపదితో 'నాకు తెలియక అడిగాను. నన్ను క్షమించు. ఏదో సరదాగా అడిగినట్లుగా అనుకో' అంది. ద్రౌపది ఓ చిరునవ్వు నవ్వి 'అది అంతేలే' అని, ఇంకా ఇలా కొనసాగించింది.

సతి తన భర్తను ఆకట్టుకొనే ఉపాయం చెపుతున్నా, విను. పతిని మించిన దైవం సతికి లేదు. పతి కరుణిస్తేనే సతికి గౌరవమూ, ప్రతిష్ఠ కలుగుతాయి. లోకంలో ఎంతో కష్టపడితేనేకాని కొద్దిపాటి సౌఖ్యం కలుగదు. కాని పతి శుశ్రూషవల్ల అధిక శుభం, సౌఖ్యం, ధర్మం అన్నీ లభిస్తాయి. అందుచేత నిత్యమూ నీవు నీభర్త పట్ల ప్రేమతో భక్తితో ప్రీతితో ప్రవర్తించు. నీ భావాన్ని గ్రహించి, భర్త నీకు వశుడవుతాడు. కృష్ణుడు ఇంట్లోకి వస్తున్నాడంటేనే ప్రీతిగా ముందు నీవు లేచి ఆహ్వానించు. ఇంట్లోకి వచ్చాక ఆసన పాద్యాదులకు ఎవరినో నియోగించక నీవే ప్రీతిగా ఆచరించు. కృష్ణుడు నీకేదయినా రహస్యం చెపితే అది ఎటువంటి సమయంలో నయినా సరే బయట పెట్టకు. ఎంత ప్రియమయిన వారికయినాసరే చెప్పకు. పతికి హితులయిన బంధుమిత్రులను భోజనాది సత్కారాలతో ఆదరించు. భర్తకు శత్రువు లయినవారు నీకెంత హితులయినా వారిని దరిచేరనీయకు. స్త్రీల చరిత్ర చాలా దుష్కరమయినది. ప్రద్యుమ్నుడు మొదలయిన నీ కుమారులతో కూడ ఏకాంతంగా ఏకాసనంలో

కూర్చోరాదు. నిర్మల మతులయిన కులసతుల తోడనే స్నేహం చెయ్యి. దుర్వికారాలు ప్రదర్శించే వనితలతో ప్రసంగం కూడా చెయ్యకు. అదే నీ సౌఖ్యానికి మూలం' అని ముగించింది.

ఆ ఉపదేశానికి సత్యభామ ఎంతో సంతసించి యిలా అంది, 'నీవు సకల ధర్మాలూ తెలిసిన దానవు. నీ భర్తలు దేవతా సమానులు. త్వరలో మీకు రాజ్యం చేకూరుతుంది. ప్రతివింధ్యుడు మొదలయిన నీ పుత్రులందరూ మొన్ననే ద్వారకకు వచ్చి, సుఖంగా ఉన్నారు. రుక్మిణి, సుభద్ర మొదలయిన వారంతా వారిని తమ కొడుకుల వలె చూచుకొంటున్నారు. (ఇప్పటిదాకా వారు ద్రుపదుని పట్టణంలో ఉన్నారు). వారి పట్ల నిశ్చింతగా ఉండు అని ఊరడించింది. తరువాత కృష్ణుడు పాండవులనూ, మార్కండేయుని విడిచి సత్యభామను తీసుకొని, ద్వారకకు వెళ్ళిపోయాడు. మార్కండేయుడు కూడా పాండవులను వీడ్కొని, తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

పాండవుల తరువాతి చరిత్రను వైశంపాయనుడు జనమేజయునితో ఇలా చెప్పాడు. తరువాత పాండవులు కామ్యకవనం విడిచి మళ్లీ ద్వైతవనం చేరారు. అక్కడికి ఒకరోజున హస్తినాపురి నుండి ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. పాండవులతో సరసంగా సంభాషించి, తిరిగి ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లిపోయాడు. పాండవులు శీతవాత ఆతపాలతో కృశించి, దుఃఖసాగరంలో మునిగి ఉన్నారని, పాంచాలి పరమ శోకార్తయై ఉన్నదని వివరించి చెప్పాడు.

ధృతరాష్ట్ర విలాపము :

ఆ మాటలు విని, ధృతరాష్ట్రుడు విషణ్ణ హృదయంతో ఇలా విలపించాడు. 'అయ్యో! నేను చేసిన కీడువల్లనూ, నా పుత్రుని అజ్ఞానం వల్లనూ పుణ్యవర్తనులయిన ఆ పాండవులకు ఇంత ఆపద వచ్చింది. నా పెద్దకొడుకయిన ధర్మరాజును ఆ విధాత యింత బాధిస్తున్నాడు. నిర్మల సౌధాల్లో హంసతూలికా తల్పాలమీద పరుండి, వైతాళికుల ప్రబోధ గీతాలతో మేల్కొనే ధర్మరాజు ఇప్పుడు అరణ్యాలలో కటిక నేలమీద పరుండి నక్కల అరుపులతో నిద్ర లేస్తున్నాడు. ఆ భీముడు వదివేల యేనుగుల బలం కలవాడు. ఇప్పుడతడు అలసిపోయిన ఏనుగులా పడి ఉన్నాడు.

తమ్ములూ, అన్నలూ, భార్య శ్రమపడుతున్న పరిస్థితిని చూసి, అర్జునుడు అన్నగారి మాటకు కట్టుబడిపోయి ఉగ్రపన్నగంలాగా బుసకొడుతూ, నా కొడుకుతప్పులు ఎంచుతూ ఏమనుకొంటున్నాడో! ఆ కవలలు సుకుమార శరీరులు. సుఖార్హులు. వారెంత విలపిస్తున్నారో! అన్నగారి మాటకు బద్ధుడై ఆ భీముడు సమయతత్పరుడయి ఘోర దుఃఖాలను సహిస్తున్నాడు కాని లేకపోతే వాని మనస్సు పరిపూర్ణంగా క్రోధమయం. శకుని జూదం, దుశ్శాసనుని దుర్మార్గపుపని, కర్ణుని తులువతనం, దుర్యోధనుని దుర్నీతి - ఇవన్నీ భీమునికి మనశ్శల్యములు. అతని క్రోధాగ్ని దావాగ్నిలా చుట్టుముట్టి, వనవాస మనే గాలితో మరింత విజృంభించి, అవయవాలన్నీ దహించుకు పోయేటట్లుగా ఆ భీముడు పెదవి కరచి, ఎఱ్ఱని ముఖంతో, బొమముడులతో భయంకరంగా సంచరిస్తున్న రూపమే నామనస్సులో ఎల్లపుడూ కనిపిస్తూ ఉంటుంది. నాపుత్ర సంతతికి అంతటికి వాడే మృత్యువనిపిస్తున్నాడు. ఆ ధర్మరాజుకి అంత కోపం లేదు. అర్జునునికీ అంతకోపం లేదు. కాని ఆ భీముడు మాత్రం క్రోధం పోతపోసినట్లుగా ఉంటాడు. అర్జును డనే గాలిచే ప్రేరేపింపబడి భీము డనే దావాగ్ని కర్ణశకునులతో సహా నా పుత్రశతం అనే అరణ్యాన్ని కాల్చి వేయక మానదు.

కర్మఫలాలు ఎవరయినా అనుభవింపక తప్పదు. కౌరవులకు పోయే కాలం ఆసన్నమయింది. విచారించి ఏం లాభం? నేను వద్దంటే ఆ రోజున జూదం మాన లేదు దుర్యోధనుడు. వానిని మళ్ళింపలేక కులక్షయానికి పాల్పడ్డాను. విధాతృని చేతలు కూడా దానికి తగినట్లుగానే ఉన్నాయి. రాత్రి చివర పగలు రాకుండా ఉండదు. పగలు చివర రాత్రి రాకుండా ఉండదు. అలాగే సుఖ దుఃఖాలు ఒకదాని వెంట ఒకటి వస్తూనే ఉంటాయి, ఆగిపోవు.

రాత్రి తెగుదల దినమేల రాకయుండు?
దినము తెగుదల రాత్రి యేతేరకున్నె ?
పరగ సుఖదుఃఖములు గాల పర్యయమున
నెందు మనుజుల బొందక యేల యుడుగు? 3-5 340

మేలు కలిగినపుడు పొంగిపోకుండా, కీడు కలిగినపుడు కుంగిపోకుండా ఉండే ధీరులే అన్ని కాలాలలోనూ సుఖిస్తారు.

మేలున సంతసిల్లు నెడ మేకొని యాపద లొందు నాపదల్
దూలఁగ భూరి సౌఖ్యములు దోఁచుఁ గృతంబులు దప్ప నెమ్మెయిం
బోలఁగ నింతయుం గని ప్రబుద్ధ మనస్కులు ఖేదమోదని
ర్గాళిత ధైర్యసాగరులు గాక సుఖింతురు సర్వకాలమున్ 3-5-341

సిరి పోగొట్టుకొని అరణ్యాలలో నివసించిన అర్జునుడు ఎన్నో అస్త్రాలు సంపాదించుకొన్నాడు. బొందితో స్వర్గానికి పోయి తిరిగివచ్చాడు. అద్భుత కృత్యము లంటే అవి. దివ్యమయిన అతని ఆయుధాలతో ఈ భూసంపద అంతా అతని ధనమే అవుతుంది.

ఈ విలాపం వింటున్న దుర్యోధనుడు "ఈ రాజు ఇంత భయపడుతున్నా డేమిటి?" అనుకొని కర్ణశకునులతో మరోచోటికి వెళ్ళి, మంతనాలు సాగించాడు. అప్పుడు కర్ణుడిలా అన్నాడు. "పాండవు లిపుడు అడవుల పాలయ్యారు. పూర్వం ఇంద్రప్రస్థపురంలో ధర్మరాజుకు వశమయిన రాజ్యసంపద అంతా నీ బుద్ధిబలం వల్ల నీకు లభ్యమయింది. ప్రజలంతా నిన్నే కొలుస్తున్నారు. పాండవు లిపుడు ద్వైత వనంలో ఉన్నారని విన్నాం. నీవు నీ రాజ్యవైభవం అంతా ప్రకటిస్తూ శత్రువుల కనులు కుట్టేటట్లుగా ప్రవర్తించు. నిన్నూ, నీ వైభవాన్నీ చూసి పాండవులూ, పాండవాంగన ఎంతో బాధపడాలి. సంపదలున్నందుకు ఫలం మిత్రులు సంతోషించడం మాత్రమే కాదు శత్రువులు దుఃఖించాలి కూడా. తాను సుఖంగా ఉండి, తన శత్రువులు దుఃఖపడుతూ ఉంటే చూసి, సంతోషించడం కంటె ఏ సంపదలూ ఎక్కువకావు. మనం రాజ్యవైభవంతో ఉండి, అర్జునుడు నారబట్టలు కట్టుకొని కందమూల ఫలాలు తింటూ చిక్కి శల్యమైపోయి ఉండగా చూడటం కంటె ఈ కళ్లకు కృతార్థత ఏమి ఉంటుంది? నీ పట్టపు రాణుల వైభవాన్ని చూచి, ద్రౌపది తనను తాను నిందించుకొంటూ, మనసు దహించుకొని పోవాలి."

ఈ మాటలకు దుర్యోధనుడు "నిజమే! నేనూ ఇదే అనుకొంటున్నాను. కాని మనం ఆ ద్వైతవనానికి వెళ్ళడానికి ముసలిరాజు ఒప్పుకోడే! అక్కడ పాండవులున్నారని, వారితోటి విరోధానికే మనం వెడుతున్నామని ఊహిస్తాడు. వారు చాలా పరాక్రమవంతులని ఇప్పటిదాకా చాలా భయపడ్డాడు కదా! ఆ ప్రక్కనున్న విదురుడు కూడా పాండవులనే పొగడుతూ ఉంటాడు. జూదం నాటి నుండీ విదురుడు పాండవ పక్షపాతిగా మనకు స్పష్టపడుతున్నాడు. అతని కే

మాత్రం తెలిసినా మన కార్యానికి అడ్డుపడతాడు. ధృతరాష్ట్రుడు అంగీకరించేటట్లుగా శకునీ, నీవూ ఒక ఉపాయాన్ని ఆలోచించుకొని రండి" అనిచెప్పి, మరునాడు వారి ఉపాయం ప్రకారం ఒక గోపాలకుని సిద్ధపరచి, ధృతరాష్ట్రునితో ఇలా చెప్పించారు. "మహారాజా! పూర్వం ద్వైతవనంలో మా గోవులన్నీ సఖంగా ఉందేవి. ఇపుడచటికి ఎన్నో క్రూరమృగాలు వచ్చి, మా గోవులను బాధిస్తున్నాయి" అన్నాడు. వెంటనే కర్ణశకునులు దుష్టమృగ నాశనానికి దుర్యోధనుని నియోగించమని సలహా ఇచ్చారు. దానికి ధృతరాష్ట్రుడు "అక్కడ పాండవులున్నారు. మీరక్కడకు వెళ్ళడం నాకిష్టంగా తోచదు. ఆ భీమార్జునులు మీచేత ఇంతకు ముందు ఎన్నో అవమానాలు పొందినవారు. మీరు వారికి ఏదో ఒక కీడు చేయక మానరు. వారు మిమ్మల్ని ఒక పట్టు పట్టక మానరు. అందుచేత ఈ గోరక్షణకు మరొకరి నెవరి నయినా పంపుదా" మన్నాడు. అపుడు శకుని[1] కల్పించుకొని "పాండవులకు మేమెందుకు అపకారం చేస్తాం? ఒకవేళ మేము చేసినా ఆ ధర్మరాజు ధర్మం తప్పడు కదా! అతని తమ్ములు అతని ఆజ్ఞ జవదాటరు కదా! మాకు వేట మీద కుతూహలం కలిగింది. అదీగాక మేము వెళ్ళేది గోరక్షణకోసం కదా! కీడెందుకు కలుగుతుంది? అన్నాడు. అ మాట విని, ధృతరాష్ట్రుడు తీవ్రంగా ఆలోచించి, "సరే గోరక్షణం మాత్రం చేసి ఆలసించకుండా రండి" అని వారికి అనుమతి యిచ్చాడు. వెంటనే దుర్యోధనుని ఆజ్ఞతో ఘోషయాత్ర ప్రారంభించబడింది. (ఘోషమంటే గొల్లపల్లె. ద్వైతవనంలోని గొల్లపల్లెకు వెళ్ళడమే ఘోషయాత్ర)

ఘోష యాత్ర :

దుర్యోధనుడు తన సోదరులతో, రాణులతో, బంధువులతో సకల రాజ లాంఛనాలతో ఉజ్జ్వలవాహనాల మీద ఘోషయాత్రకు బయలు దేరాడు. ద్వైత

---

1. శకుని ధృతరాష్ట్రుని తరానికి చెందిన వ్యక్తి. ధృతరాష్ట్రునికి బావమరిది. అతడు పెద్దవాళ్ళలో పెద్దవాడుగా, చిన్నవాళ్ళలో చిన్నవాడుగా చలామణి కాగల నేర్పుగలవాడు. ఇప్పుడు శకుని కర్ణదుర్యోధనులను పిన్నవాళ్ళుగా చేసి, తాను పెద్దవాడుగా, పై తరానికి చెందిన వ్యక్తిగా వ్యవహరిస్తూ, ధృతరాష్ట్రునికి సన్నిహితు డయినట్లుగా మాట్లాడుతున్నాడు.

వనం సమీపించి, ఒక రమణీయప్రదేశంలో శిబిరాలు ఏర్పరచుకొన్నారు. గోపాలకులు వచ్చి తమ గోవులు సమృద్ధిగా, సుఖంగా ఉన్నాయని వివరించారు. దుర్యోధనాదులు ఆ వనంలో విహరిస్తూ ఒక సరోవరం దగ్గరకు వచ్చారు. దుర్యోధనుడు ఆ సరోవర సౌందర్యానికి ముగ్ధుడై సేవకులను ఆ చెరువు ఒడ్డున విలాస గృహాలు నిర్మించమని ఆజ్ఞాపించాడు. సేవకులు ఆ ప్రయత్నంలో ఉండగా గంధర్వులు కొంతమంది వచ్చి "ఇది గంధర్వపతికి క్రీడార్థమై కల్పింపబడింది. మీరు ఇక్కడ నుండి తొలగిపొండి" అన్నారు. సేవకు లా మాటలు దుర్యోధనునికి చెప్పారు. దుర్యోధనుడు రణదుర్మదులయిన కొంతమంది సైనికులను పంపి, సరోవరాన్ని ఆక్రమించమన్నాడు. ఈ విషయమంతా తెలిసి చిత్రసేనుడనే గంధర్వుడు శతసహస్ర సంఖ్యలలో గంధర్వులతో కౌరవసైన్యాన్ని చుట్టుముట్టాడు. దుశ్శాసనుడూ, కర్ణుడూ నిల్చి వారితో యుద్ధంచేశారు. కర్ణుని రథం విరిగిపోయింది. విరథుడయిన కర్ణుడు వికర్ణుని రథమెక్కి యుద్ధభూమి నుండి పారిపోయాడు. గంధర్వుడు దుర్యోధనుని విరథుని చేసి, జుట్టు పట్టి లాగి, నేలమీద పడవైచి, చేతులు విరిచికట్టి, సింహనాదం చేశాడు. సైన్యాన్ని కూడా బంధించాడు. మిగిలిన పౌరులూ, అమాత్యులూ ఆక్రోశిస్తూ, ఆవనంలోనే ఉన్న ధర్మరాజును శరణు జొచ్చారు. వారిని చూసి భీముడు నవ్వుతూ ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ఇపుడు మనపని తేలిక అయింది. మనం చేయవలసిన పని గంధర్వులు చేశారు. ఏకష్టమూ లేకుండా మనకు జయం చేకూరింది. పుట్టు కల్లరియై (చిన్నప్పటినుండి ఎన్నో అబద్ధా లాడినవాడు), పాపాత్ముడై, లోకులందరి చేత తిట్లుపడిన ఆ దుర్యోధనునికి తగిన శాస్తిచేసి, ఇప్పుడు విధి చతురు డనిపించుకొన్నాడు. మనలను అపహాస్యం చేయటానికని వచ్చి దుర్యోధనుడు తగిన ఫలితాన్ని అనుభవించాడు. అతనిమీద దయ చూపవలసిన పనిలేదు" అన్నాడు. అపుడు ధర్మరాజు "ఇది పరుష వాక్యాలకు సమయంకాదు. అతడు మనకు జ్ఞాతి. మనలో మనకు ఏదయినా సంపద విషయంలో భేదం వచ్చినంత మాత్రాన ఇతరుల చేత అవమానింపబడినప్పుడు ఉపేక్షింపకూడదు. అదీగాక శరణాగతుని రక్షించడం రాజధర్మం. నీవూ, నీ తమ్ములూ వెళ్ళి ఆ దుర్యోధనుని విడిపించండి" అన్నాడు. భీముడు చిన్నప్పటి నుండి దుర్యోధనుడు చేసిన దుష్టచేష్టలన్నీ ఏకరువు పెట్టాడు. దాని కజాతశత్రుడు అనునయపూర్వకంగా ఇలా అన్నాడు. "ఎవరయినా రక్షించమని వచ్చి శరణు

వేడితే ఎంత దుర్బలుడయినా తనకు చేతనయినంత సహాయం చేస్తాడు. అటువంటప్పుడు ఉత్తమ శూరుడు ఊరుకోగలడా? శరణమని వచ్చిన శత్రువు నయినా రక్షించాలి. ఇది దయాస్వభావం కలవారి లక్షణం. ఈ ధర్మంతో ఏ ధర్మమూ సాటిరాదు.

కావరయ్య! యనినఁ గరము దుర్బలుఁడైనఁ
జెనసి యోపినంత సేయు ననిన
నూరకుండు నయ్య? యుత్తమ శూరుండు
దీనజనుల యున్న తెఱఁగు సూచి 3-5-412

శరణం బని వచ్చిన భీ
కర శత్రువు నయినఁ బ్రీతిఁ గావఁగ వలయున్
గరుణా పరుల తెఱం గిది
యిరవుగ సరిగావు దీని కే ధర్మంబుల్ 3-5-413

మీ బల పరాక్రమాలు దుర్యోధనునికి బాగా తెలుసు. మీరు తప్పక విడిపిస్తారనే ఆశలో ఉండి ఉంటాడు. నేనిపుడు యజ్ఞ దీక్షితుడనై యున్నాను. మీరు వెళ్ళి దుర్యోధనుని తీసుకొనిరండి" అన్న ధర్మరాజు మాటలను తమ్ములు నల్గురూ శిరసా వహించి, అతనిని విడిపించి, గంధర్వరాజుతో సహా ధర్మరాజు కడకు తీసికొని వచ్చారు. అప్పుడు ధర్మరాజు దుర్యోధనునికి బంధ విమోచనం చేయించి ఇలా అన్నాడు.

ఎన్నఁడు నిట్టి సాహసము నింక నొనర్పకు మయ్య! దుర్జనుం
డన్నువ సాహస క్రియలయందుఁ గడంగి నశించుఁ గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గై కొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్
సన్నుత! దీని కొండొక విషాదముఁ బొందకుమీ మనంబునన్ 3-5-434

ఎన్నడూ ఇటువంటి సాహసాలు చేయకు. దుర్జనుడు సాహసించి నశించి పోతాడు. అందుచేత మీ తమ్ములను, దొరలనూ తీసుకొని సుఖంగా ఇంటికి పో. దీనికి మనసులో అంతగా బాధపడకు అని బుద్ధిచెప్పి పంపించాడు. దుర్యోధనుడు దీనముఖంతో తలవాల్చుకొని వెళ్ళిపోయాడు.

ఈ పద్యం ధర్మరాజు వాక్చాతుర్యానికి మచ్చుతునక. ఇక్కడ నాల్గు పాదాలూ (సుమారు) నాల్గు వాక్యాలుగా వింగడించాలి. మొదటిది "ఎన్నడు నిట్టి సాహసము నింక నొనర్పకు మయ్య" అనేది. ఈ అయ్య! అనే సంబోధనలోనే ధర్మరాజు యొక్క సోదర ప్రేమ వ్యక్తమవుతుంది. అంతేకాదు. ఒక విధమయిన అవహేళన కూడా లేకపోలేదు. తొందరపడి చేసేపనిని సాహసం అంటారు. తొందరపడి యిక్కడకు వచ్చావు. తొందరపడి బలవంతుడయిన గంధర్వునితో తలపడ్డావు. ఈ రెండూ సాహసాలు. ఈసాహసాల వెనుక దురుద్దేశం ఉండటం మరింత అనర్థదాయకం. ఆ విషయం రెండవపాదంలో ఒక సూక్తిగా మలచి చెపుతున్నాడు "దుర్జనుం డన్నన సాహసక్రియ లొనర్చి నశించు" అంటున్నాడు. సాహసమనేది ఎవరికీ పనికిరాదు. కాని అది దుర్జనుడయితే ప్రాణాలకే ముప్పు కలిగించేటంత చేటు కలుగుతుంది. ఇది పైకి ఒక సూక్తి లాగా, ధర్మం లాగా కనిపిస్తుంది. కాని దురభిమాని అయిన దుర్యోధనునికి వాఙ్మయమయిన శరంలాగా నాటుకోవాలి. నీవు మొదటినుండీ చాలా దుర్మార్గుడవు, చావు కొనితెచ్చుకోకు అన్నభావం దుర్యోధనునికి స్ఫురిస్తుంది. అది సరిగా స్ఫురిస్తుందో, స్ఫురించదో అని గుర్తు చేస్తున్నాడు మూడవ పాదంలో. "తమ్ములనూ, దొరలనూ తీసుకొని వెంటనే పురానికి పో" అంటున్నాడు. ఇందులో తమ్ములనూ, దొరలనూ ఎత్తిపొడుస్తున్నాడు. వారంతా అసమర్థులనీ, వాచాశూరులనీ, క్రియాశూరులు కాదని జ్ఞాపకం చేస్తున్నాడు. కర్ణుడు మరి ఇంతకు ముందే పారి పోయాడుకదా! వాడిని కూడా తీసుకొని మరీవెళ్లు అంటున్నాడు.

నాల్గవ పాదంలో సారాంశం అంతా మళ్ళీ చెపుతున్నాడు. దురభిమాని అయిన దుర్యోధనుడు చేయవలసిన పని అది. ఇపుడు దుర్యోధనుడు గంధర్వుని చేత అవమానింప బడినందుకు దుఃఖించడంలేదు. శత్రువయిన ధర్మరాజుచేత విడిపింపబడినందుకు దుఃఖిస్తున్నాడు. ఆ స్థితిని మరోసారి గుర్తుచేసి విషాదం పొందరాదని వ్యతిరేకదృష్టితో బోధిస్తున్నాడు. పైకి మాత్రం "ధర్మరాజు అనిపించుకొనేటట్లు "దీనికేమీ మనసులో బాధపడకు" అంటున్నాడు. కాని మెత్తనిపులిగా అర్థం చెప్పాలంటే "కుళ్ళి కుళ్ళి ఏడవరా" అని గుర్తుచేసి నట్లు.

రెండు పాత్రల స్వభావాన్ని ఉన్మీలనం చేసే ఇంత చక్కని పద్యం వ్రాస్తూ కూడా ఎఱ్ఱన "దుర్జనుం డన్నన సాహసక్రియ లొనర్చి నశించు" అనడంలో ఆ

మహాకవి యొక్క '"ధర్మైక తత్పరత" గోచరిస్తుంది. ఎటువంటి సన్నివేశంలో నయినా ఒక సూక్తినో, ధర్మన్నో తెలియ జేయాలనే ఎఱ్ఱన తపన గోచరిస్తుంది.

పాండవులచే విడిపింపబడిన దుర్యోధనుడు సిగ్గుతో కుంగిపోయి, చెదరిన సేనలను కూర్చుకొని, కొంతదూరం పోయి, ఒక చోట శిబిరాలు వేసికొని, ఒక్కడూ అభ్యంతర మందిరంలో తల్పం మీద చింతాపరవశుడయి పడిఉన్నాడు. తనకు కలిగిన అవమానాన్ని తలచుకొని కుమిలిపోతున్నాడు. ఇంతలో కర్ణుడు వచ్చాడు. దుర్యోధనుడు గంధర్వుని జయించి వచ్చాడనుకొన్నాడు కర్ణుడు. కర్ణుడు దుర్యోధనుని ప్రశంసించడం మొదలుపెట్టాడు. అప్పుడు దుర్యోధనుడు జరిగినదంతా చెప్పాడు కర్ణునితో. "ఇక నేను ఈ అవమానాన్ని భరించలేను. ప్రాయోపవేశం చేస్తాను" అన్నాడు.

ఇక్కడ ఎఱ్ఱన దుర్యోధనుని ముఖంగా ఒక చక్కని సూక్తిని వివరించాడు. దుర్యోధనుని చేతనే దుర్యోధనుని శీలాన్ని సూచింపజేశాడు. మానవుడు ఎంత దుర్మార్గు డయినా సంతోషంలో కాని, నిర్వేదంలో కాని, భయంలో కాని అప్పుడప్పుడు తన హృదయాన్ని బయటపెడుతూ ఉంటాడు. ఈ మనస్తత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఎఱ్ఱన ఇక్కడ అనుభవ పూర్వకమయిన ఒక చక్కని సూక్తిని చెప్పాడు.

విను దుర్వినయాత్మకుం డగు
జనుఁ డుజ్జ్వలమైన సిరియు సద్విద్యయుఁ గ
ల్గిన నందు మెలఁగ నేరక
చెనఁటి తెఱంగునకుఁ జొచ్చి చెడిపోవుఁ దుదిన్ 3-6-19

దుర్వినీతునికి ఎప్పుడయినా ఉజ్జ్వల మయిన సంపద కాని, విద్య కాని లభిస్తే వాటిని అతడు పోషించుకొనలేడు. సక్రమంగా ప్రవర్తింపలేడు. దుర్మార్గానికి పాల్పడి చెడిపోతాడు. సిరిని కాని, చదువును కాని ఉపయోగించుకొని ఉన్నతిని పొందలేడు. కారణం, అతనికి సహజమైన దుర్జనత్వమే. ఇపుడు దుర్యోధనుడు తనకు అప్రయత్నంగా లభించిన జూదపు సిరిని నిలబెట్టుకోలేక పోతున్నాడు. దుర్మార్గ వర్తనుడై ఉన్నది కూడా ఊడగొట్టుకొనే పరిస్థితికి చేరుతున్నాడు. "చెడిపోవు తుదిన్" అని ఎఱ్ఱన చివరగా ఒక కావ్యార్థ సూచన కూడా చేశాడు. ఇక్కడ సిరిని గూర్చి చెప్పాడు. విద్య కూడా దుర్జనునకు మదం కలిగిస్తుంది. సజ్జనునకు వినయం కలిగిస్తుంది. (చూ - ధనమును విద్యయు... అనే పద్యం 5-235)

ఈ పద్యం దుర్యోధనుని నిర్వేద స్థితిని కూడ తెలియజేస్తుంది. నిర్వేదంతో కుమిలిపోతున్న దుర్యోధనుని కర్ణుడు ఓదార్చాడు. “మహారాజా! శోకశీలం ఏ మాత్రమూ పనికిరాదు. శోక శీలురకు ఒక శోకం వెంట మరోశోకం కలుగుతూనే ఉంటుంది. శోకించే వానిని చూసి శత్రువులు మరింత సంతోషిస్తారు. చంద్రవంశ సంభూతుడ వయిన నీవు ఒక సామాన్యమానవుని వలె ఇలా దుఃఖించడం ఏమీ బాగాలేదు. పాండవుల చేత విడిపింపబడ్డానే అని బాధ పడుతున్నావు. నీ కింకా వివేకం చాలదు. పాండవులు ఎవరు? నీకు భటులు. నీవు మహారాజువు. రాజును రక్షించడం భటుల ధర్మం. పాండవులు వారి సేవాధర్మాన్ని వారు నిర్వహించారు. ఈ మాత్రం విచక్షణ లేకుండా నీవు దుఃఖ పరవశుడవు కావటం సమంజసంగా లేదు.” కర్ణు డెంత చెప్పినా దుర్యోధనుడు వినిపించుకోలేదు. అప్పుడు శకుని కల్పించుకొని యిలా అన్నాడు “నేను అనాయాసంగా బుద్ధిబలంతో రాజ్యమంతా సంపాదించి పెడితే, సుఖంగా అనుభవించలేక, రాజ్యాన్ని కాలదన్ని, ప్రాయోపవేశం చేస్తా నంటున్నావు. ఇంతకంటే వెఱ్ఱితనం ఉందా? అసలు నీకు పెద్దవాళ్ళమీద గౌరవం ఉన్నట్లు తోచదు.

పిఱికితనము, నేమఱుటయు, నొఱవతనము,
మెత్తఁబాటును; గార్యంబు నత్తెఱంగు
నేరమియు, విషయంబులఁ గూరుటయును
గలుగు పతికి నుండదు సిరి దొలఁగి పోవు

కోపమూ, మనస్తాపమూ ఏర్పడినపుడే ధీరుడు అణచుకోవాలి. పిరికితనమూ, ఏమరుపాటూ, కుటిలత్వమూ, మెత్తగా కార్యాన్ని నిర్వహించుకోలేక పోవడం - ఇవి ఉన్న రాజును విడిచి, సిరి వెళ్ళి పోతుంది. రాజనీతి విషయంలో ఈ అయిదూ గమనింపదగినవి.

అందుచేత కార్యజ్ఞుడవు కమ్ము. కార్యజ్ఞానం ఏమిటంటే.... నీకిపుడు పాండవులు ఉపకారం చేశారు. దానికి నీవు ప్రత్యుపకారం చేయటం ధర్మం. ఇది సంతోషింప దగిన సమయం. విచారింపదగిన సమయం కాదు. మనస్సులో కల్మషం వదలి పాండవులను పిలిచి వారి రాజ్యం వారికియ్యి. దానివల్ల నీకు కీర్తీ పుణ్యమూ కలుగుతాయి.”

శకుని ఎన్ని చెప్పినా దుర్యోధనుడు తన నిర్ణయాన్ని వదలలేదు. ఇంతలో సాయంసంధ్యాసమయం కావచ్చింది. దుర్యోధనుడు సంధ్యావందనాదికం నిర్వహించి, ఒక ఏకాంత ప్రదేశంలో సమాధిగతుడై, గాలి లేక నిశ్చలంగా వెలుగుతున్న జ్యోతి వలె ప్రకాశిస్తున్నాడు.

ఈ విషయం నాగలోకంలో ఉన్న అమరశత్రువు లయిన రాక్షసులకు తెలిసింది. "తమ పక్షం నశించిపోతోందే!" అని బాధపడ్డారు. శుక్రుడు మొదలగు వారిని పిలిపించి ఒక హోమం చేయించారు. అందులోనుండి కృత్య వెలువడింది (కృత్య అనగా అతీంద్రియమయిన శక్తిచేత యజమాని కృత్యాన్ని నిర్వహించేది). శుక్రుడు కౌరవేంద్రుని తీసికొనిరమ్మని కృత్యను ఆజ్ఞాపించాడు. వెంటనే కృత్య దుర్యోధనుని తీసికొని వచ్చి, రాక్షసులకు సమర్పించింది.

రాక్షసులు దుర్యోధనుని కౌగిలించుకొని "నీవు భరతవంశంలో పుట్టినవాడవు. మహాపరాక్రమవంతుడవు. సామాన్యుడవు కావు. ఆత్మహత్య చేసుకోవలసిన వాడవు కావు. మేమెంతో తపస్సుచేసి ఈశ్వరుని ప్రసన్నుని చేసికొంటే మాకు రాజుగా ఈశ్వరుడు నిన్ను సృష్టించి యిచ్చాడు. నీ శరీరం వజ్రంతో చేయబడింది. అస్త్రశస్త్రాలు నిన్నేమీ చేయలేవు. నీకు సహాయంగా ఎంతోమంది రాజకుమారులుగా పుట్టాము. భీష్మ ద్రోణాదులు దేవాంశసంభూతు లయినా వారికి రాక్షసావేశం కలుగుతుంది. పాండవపక్షాన్ని సర్వనాశనం చేస్తారు. నీకు కొద్దిగా అర్జునుడంటే భయం ఉంది. దానికి మేము ఒక ఉపాయం ఆలోచించాము. కృష్ణుని చేతిలో చచ్చిన నరకాసురుని అంశ కర్ణుని ఆవేశిస్తుంది. కర్ణుడు కృష్ణార్జునులిద్దరినీ సంహరిస్తాడు. ఇది తెలిసికొని పాండవ రక్షణకోసం ఇంద్రుడు వచ్చి కర్ణుని కవచకుండలాలు అడుగుతాడు. లక్షలు కోట్ల సంఖ్యలో రాక్షసులు సంశప్తకులుగా పుట్టి అర్జునుని జయిస్తారు. శత్రుసంహారం చేసి నీవు నిష్కంటకంగా రాజ్యాన్ని పాలిస్తావు. అంత భవిష్యత్తు కలిగిన నీవు ఆత్మహత్య చేసుకొంటావా? అసలా ఊహ విడిచి సుఖంగా రాజ్యం చేసుకో" అని చెప్పి, కృత్యతో మరల మామూలు చోటుకు పంపించారు

దుర్యోధనుడు చాలా ఆశ్చర్యపోయాడు. ఇదంతా కలా నిజమా అనుకొన్నాడు. నిజమే అని నిశ్చయించుకొని పాండవులను జయిస్తానని మనస్సులో ఉవ్విళ్లూరాడు.

రాత్రి జరిగిన విషయ మెవ్వరికీ చెప్పలేదు. ఉదయమే కర్ణుడు వచ్చి “చచ్చి శత్రువులను సాధింపగలమా? ఇది శోకానికీ, దైన్యానికీ సమయంకాదు” అని దుర్యోధనుని కౌగలించుకొని, “నీకు మనస్సులో అర్జునుడంటే భయం కలిగింది. పదునాలుగో సంవత్సరంలో అర్జునుని జయిస్తానని ఇపుడు ఆయుధం పట్టి ప్రతిజ్ఞ చేస్తున్నాను” అన్నాడు. దుర్యోధనుడీ ప్రతిజ్ఞను రాక్షసుల మాటలతో సమన్వయించుకొని, ఊరడిల్లాడు. కర్ణ శకునులతో హస్తినాపురం చేరాడు.

ఒకనాడు దుర్యోధనుడు పేరోలగంలో ఉండగా భీష్ముడు ఈ విధంగా హితవు చెప్పాడు. “పెద్దలు బుద్ధి చెపితే వినక, దుష్టాత్ములతో కలిసి వెళ్ళావు. ఫలితం ఏం జరిగిందో చూశావా? ద్వేషం లేని ఆ ధర్మరాజక్కడ ఉండబట్టి సరిపోయింది కాని, లేకపోతే ఏమయి ఉండేవాడివి? నీవూ, తమ్ములూ ఆ గంధర్వులకు చిక్కితే ఈ సూతపుత్రుడు యుద్ధభూమినుండి పారిపోయాడు. నీవేమో వీనినే నమ్ముతావు. వీని పరాక్రమ మెంతటిదో కళ్ళారా చూశావుకదా! ఆ పాండవుల పరాక్రమంలో పదునారవ పాలు కూడా లేదు. కర్ణునితో వంశాన్ని, సంపదనూ చెడగొట్టుకోక ఇకనయినా ఆ పాండవులతో కలిసి జీవించు. ఇది నీకు హితమూ, పథ్యమూ కూడాను”.

భీష్ముని యీ మాటలను దుర్యోధనుడు లక్ష్యపెట్టలేదు. కర్ణ శకునులను చూసి నవ్వుతూ వారితో కలిసి అక్కడనుండి వెళ్ళిపోయాడు. భీష్ముడు కూడా సిగ్గుపడి వెళ్ళిపోయాడు. ఆ తరువాత దుర్యోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు. “ధర్మరాజు రాజసూయం చేసినప్పటినుండి నాకు ఆ యజ్ఞం చేయాలని కుతూహలంగా ఉంది. నాచేత ఆ యజ్ఞం చేయించు” అన్నాడు. కర్ణుడు “సరే” అన్నాడు. దుర్యోధనుడు పురోహితుని పిలిపించి విషయం చెప్పాడు. పురోహితుడు విద్వాంసులతో ఆలోచించి, దుర్యోధనునితో ఇలా అన్నాడు “మీకు పాండవులు శత్రువులు. వారిని జయిస్తేనే కాని మీకు రాజసూయం చేయటం కుదరదు. అందుచేత ప్రస్తుతానికి రాజసూయం వంటిదే అయిన వైష్ణవయాగం చేయడం మంచిది.” దుర్యోధనుడు “సరే” అని, కర్ణశకునులతో చెప్పి, భీష్మాదుల అనుమతి కూడా పొందాడు. ఒకదూతను పంపి ధర్మరాజును ఆహ్వానించి రమ్మన్నాడు. ఆహ్వానాన్నందుకొని ధర్మరాజు “దుర్యోధనుడు వైష్ణవయాగం చేస్తున్నాడంటే చాలా సంతోషంగా ఉంది.

అయినా మేము చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చకుండా అక్కడికి ఎట్లా వస్తాము? ఇలా అన్నానని మీ రాజుతో చెప్పు" అన్నాడు. ప్రక్కనున్న భీముడు దూతతో "పదిహేనవ సంవత్సరం చివర ధర్మరాజు రణయజ్ఞం చేస్తాడు. దానిలో ధార్తరాష్ట్రులందరినీ పశువులుగా చేసి హోమం చేస్తాడు. అప్పటిదాకా రాడని చెప్పి ఆ దుర్యోధనుని ఎదుట భయపడకుండా చెప్పు" అని పంపించాడు. వాడు వెళ్ళి ఇద్దరి మాటలూ యథాతథంగా దుర్యోధనునితో చెప్పాడు. దుర్యోధనుడు అనుకొన్నట్లుగా యాగాన్ని పరిసమాప్తి చేశాడు.

ఒకనాడు ధర్మరాజు నిద్రిస్తూ ఉండగా, ఆ అడవిలోని మృగజాతులన్నీ కల లోకి వచ్చి, "మీ వల్ల మా జాతి నశించి పోతోంది. బీజం కూడా లేకుండా పోయేటట్లుంది. మీరు మరో అడవికి వెళ్ళవలసినదిగా కోరుతున్నా" మని చెప్పాయి. ధర్మరాజు వాటికి అభయ మిచ్చాడు. పాండవులు ద్వైతవనం నుండి కామ్యకవనం చేరారు. ఒకనాడక్కడికి వ్యాసభగవానుడు వచ్చాడు. ధర్మజాదులు ఎదురేగి, తోడ్కొని వచ్చి, విశేషార్చనలతో సంతుష్టుని చేశారు. వ్యాసమహర్షి వనవాస దుఃఖితులయిన మనుమలను (పాండవులను) చూసి, చాలా బాధపడి, ధర్మరాజుతో ఇలా అన్నాడు.

కాలవిపర్యయంబున సుఖంబును దుఃఖము వచ్చుచుండు నె
క్కాలము నేరికిన్ ధ్రువముగాదు సుఖంబును దుఃఖమున్ మహీ
పాల! బుధుండు దద్ద్వివిధభంగు లెఱింగి ప్రమోద ఖేదసం
శీలుఁడు గాఁడు రెంటను బ్రసిద్ధ పథంబున నప్రమత్తుఁడై 3-6-106

కాలవశాత్తు సుఖమూ, దుఃఖమూ వస్తూ ఉంటాయి. సుఖం కాని, దుఃఖం కాని ఏదీ శాశ్వతంగా నిలవదు. ఇది తెలిసిన పండితులు సుఖానికి సంతోషం పొందరు. దుఃఖానికి సంతాపం చెందరు. రెండిట సమచిత్తంతో ప్రవర్తిస్తారు.

పొందిన ఆపదలకు దుఃఖించక తపస్సు చెయ్యి. తపస్సు వల్లనే సకల సౌఖ్యాలూ సిద్ధిస్తాయి.

క్షమయు నహింసయు సత్యము
సమతయు నింద్రియ జయంబు శమముఁ బరిత్యా
గమును దపోలక్షణములు
గ్రమమున నిన్నియును నూర్ధ్వగతి కారణముల్ 3-6-108

క్షమ, అహింస, సత్యం, సమత్వం, ఇంద్రియ నిగ్రహం, శమం, పరిత్యాగం ఇవి తపోలక్షణాలు. ఇవన్నీ ఊర్ధ్వగతికి కారణాలు కూడాను.

ఇక్కడ చేసుకొన్న పుణ్యమునే మానవుడు స్వర్గంలో అనుభవిస్తాడు. తరువాతి జన్మ కది మేలు చేస్తుంది. అందుచేత మానవుడు ఈ లోకంలో దాన ధర్మాలు ఆచరించాలి. చిరకాలం నిలిచే పరోపకారం చేయాలి.

ఇందుఁ జేసిన పుణ్యంబ యందుఁ గుడుచు
మీఁది జన్మంబునకు నది మేలుఁ జేయుఁ
గాన తన శక్తితోఁ గూడ దాన ధర్మ
చిర పరోపకారంబులు సేయవలయు 3-6-109

వ్యాసుని మాటలకు ధర్మరాజుకు ఒక సందేహం కలిగింది. "దానము- తపస్సు ఈ రెంటిలో ఏది కష్టమయినది ? ఏది అధికఫలాన్ని ఇస్తుంది?" అని అడిగాడు.

వేద వ్యాసుడిలా చెప్పాడు. "దానమే ఎక్కువ ఫలితాన్నిస్తుంది. కాని అది ధనం చేత మాత్రమే సాధింపదగింది. మానవులకు ప్రాణాలమీద కంటె ధనంమీద ఎక్కువ మక్కువ. ఎన్నో కష్టాలు పడటం, సముద్రాలుదాటి పయనించి శ్రమ పడటం, వ్యవసాయం చెయ్యటం, పశుపాలనం, అడవుల్లో కొండల్లో కష్టాలు పడటం, ఇతరులు చెప్పిన పనులు చేస్తూ సేవావృత్తి నవలంబించటం – ఇవన్నీ ఎందుకంటావు? డబ్బు కోసమే కదా! ఇన్ని కష్టాలు పడి సంపాదించిన ధనాన్ని విడిచిపెట్టాలంటే ఎంతకష్టం! అయితే ఒక్క విషయం గమనించాలి. అన్యాయార్జిత మైన ధనంతో దానం చేస్తే అది ఏమీ సత్ఫలితాన్నివ్వదు. న్యాయార్జితమైన సొమ్ము దేశకాలపాత్రము లెరిగి దానం చేస్తే, అది కొద్ది అయినా గొప్పఫలితా న్నిస్తుంది.

అన్యాయార్జితమైన విత్తమునఁ జేయంబూను దానంబు మూ
ర్ఖన్యాయం బది; దానఁజేసి ఫలపాకం బేమియున్ లేదు; యు
క్తి న్యాయార్జిత మించుకంత యయినం గాలంబు దేశంబు స
మ్మాన్యంబై తగఁ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుం దుదిన్ 3-6-112

పూర్వం ముద్గలుడనే విప్రుడు సన్మార్గంచేత సంపాదించుకొన్న వ్రీహిద్రోణాన్ని సత్పాత్రంలో వినియోగించి పరమసిద్ధిని పొందాడు" అన్నాడు వ్యాసుడు. ధర్మరాజు అదేమిటో సవిస్తరంగా చెప్పమన్నాడు.

వ్రీహిద్రోణాఖ్యానము :

ముద్గలుడనే మహర్షి దారాపుత్రాదులతో కురుక్షేత్రంలో నివసించేవాడు. తాను ఉంఛవృత్తి చేసుకొంటూనే అతిథిప్రియుడై ఉండేవాడు. పక్షోపవాస వ్రతం చేసేవాడు. పాడ్యమి నుండి 14 రోజులూ ఒక్కొక్కగింజగా ఏరి, తూమెడు వడ్లు సమకూర్చుకొని, పర్వదినాల్లో (అమావాస్య, పూర్ణిమ) వాటిని వండి, దేవ పితృపూజ చేసి అతిథులకు అన్నంపెట్టి, మిగిలిన అన్నాన్ని తన భార్యాపుత్రులూ, తానూ తినేవారు. ఇట్లా నియమంతో ఎంతో కాలం జరిగింది. ఒక పర్వదినాన దుర్వాసుడు జుగుప్సావహ మయిన రూపంతో, ఆకలితో తూలుతూ, ముద్గలుని చెంతకు వచ్చాడు. వచ్చిన అతిథికి ముద్గలుడు సంతోషంతో భోజనం పెట్టాడు. అన్నం అంతా తినేసి, దుర్వాసుడు కొద్దిగా మిగిలిన అన్నం ఒంటికి పూసుకొని వెళ్ళిపోయాడు. ప్రతీ పర్వానికీ దుర్వాసుడు వచ్చి, యిట్లాచేసి పోతూ ఉన్నాడు. ఇలా ఆరు పర్వదినాలు గడిచాయి. ముద్గలుడు చేసిన అతిథిపూజకు సంతుష్టుడై దుర్వాసుడు ఇలా అన్నాడు. "నీవంటి దానశీలుని ఏలోకంలోనూ చూడలేదు. దానం ఒకటే కాదు. ప్రసన్నత, సత్యమూ, ధైర్యమూ నీ ధనం. మనస్సునూ, ఇంద్రియాలనూ సరిగా అదుపులో పెట్టుకొనే ధర్మాన్ని తపస్సని చెపుతారు. అది నీయందు సంపూర్ణంగా ఉంది. నీదాన తపో వైభవాల వల్ల నీవు బొందితోనే స్వర్గానికి చేరుతావు" అని చెప్పి దుర్వాసుడు వెళ్ళిపోయాడు. మరుక్షణంలో ఒక దేవదూత విమానంతో ముద్గలుని ముందు నిలిచాడు. "నీ సుకృతంతో నీకీ స్వర్గం ప్రాప్తించింది. త్వరగా వచ్చి ఈ విమానం ఎక్కు" అన్నాడు. ముద్గలుడు దేవదూతను చూసి, దివిజలోకం ఎటువంటిదో, అందలి గుణ దోషాలేమిటో చెప్పమన్నాడు. అతడిలా చెప్పాడు.

"ఈ లోకానికి పై భాగాన స్వర్గలోకం ఉంది. తపస్వులు, యజ్ఞకర్తలు, సత్య సంధులు, జితేంద్రియులు, సమత్వబుద్ధి కలవారు, దానపరులు, రణశూరులు స్వర్గంలో నివసిస్తారు. అప్సరసలు, సాధ్యులు, మరుత్తులు, వసువులు మొదలగు వారు వేరు వేరు ప్రదేశాల్లో స్వర్గంలో ఉంటారు. ఆకలి దప్పులు, శీతోష్ణభయాలు, ముసలితనం, రోగం ఉండవు. అక్కడ మానుష శరీరాలు విడిచి తేజోమయము లయిన దివ్యశరీరాలు ధరించి ఉంటారు. శోకం కాని, భ్రమ కాని, శ్రమ కాని, ఆయాసం కాని అక్కడ ఉండవు. ఈ స్వర్గం కంటె పైని బ్రహ్మలోకం ఒకటి ఉంది. అక్కడి వారు శోకమనేది ఎరుగరు. అది స్వయంప్రకాశమానమై తన వెలుగుతో

లోకాలను వెలిగిస్తుంది. మనువులు, ధాతలు, మునులు అక్కడ ఉంటారు. అక్కడ ఉన్నవారికి లోభం, కోపం, అపకీర్తి, దుఃఖం, పునర్జన్మ ఉండవు. మిగిలిన భువనాలు నశించినా ఆ భువనం నశించదు. ఇంద్రాదులు కూడా దాన్నే కోరుకుంటారు.

స్వర్గంలో ఒకదోషం లేకపోలేదు. ఇక్కడ చేసుకొన్న పుణ్యాలన్నీ స్వర్గంలో అనుభవిస్తాడు. అంతేకాని అక్కడ మళ్ళీ పుణ్యం చేసుకొనే అవకాశం లేదు. ఇది కర్మభూమి. అది ఫలభూమి. పుణ్యం అంతా అనుభవించాక మళ్ళీ భూమికి చేరుతారు. స్వర్గంలో వారికి అసూయాగుణం ఎక్కువ ఉంటుంది.

ఇందుఁ జేసిన పుణ్యంబు లెల్ల నందు
గుడుచుఁ గాని మర్త్యున కందుఁ గడఁగి పుణ్య
మాచరింపఁగఁ గాదు పుణ్యావసాన
మగుడు భూమిక త్రోతురు మగుడ నతని 3-6-135

ఈమాటలు విన్న ముద్గలుడు 'నాకు స్వర్గ సుఖాలు అక్కర లేద'ని దేవదూతను పంపివేశాడు. ఎక్కడకు చేరితే పురుషుడు మరల తిరిగిరాడో అటువంటి ఉత్తమలోకం కావాలని అభిలషించాడు ముద్గలుడు. నిర్వికల్పమయిన జ్ఞానయోగంతో నిందాస్తుతుల పట్ల సమభావం కలిగి, మట్టిబెడ్డను, బంగారాన్ని సమంగా చూస్తూ పరమ సిద్ధిని పొందాడు.[1]

ధర్మరాజా! రాజ్యం పోయిందని బాధపడకు, చక్కగా తపస్సు చెయ్యి, పదమూడవ సంవత్సరం చివర నీపితృభాగం నీకు ప్రాప్తిస్తుంది." అని చెప్పి వ్యాసుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఇంత వరకు వ్యాస మహర్షి ధర్మరాజుకు తపస్సును గురించి, అంతకు మించిన దానాన్ని గురించి చెప్పాడు.

---

1. తుల్య నిందాస్తుతి ర్భూత్వా సమలోష్టాశ్మకాంచనః |
 జ్ఞానయోగేన శుద్ధేన ధ్యాన నిత్యో బభూవహ || ఆరణ్య 247-42

సమలోష్టాశ్మ కాంచనః - మట్టిని, రాయిని, బంగారాన్ని సమానంగా పరిగణించేవాడు.

ముందు తపస్సును గురించి ఆలోచిద్దాం. తపస్సంటే- సకల విషయ వ్యపేత మగునట్టి బుద్ధివైభవము అంటాడు ధర్మవ్యాధుడు. ఇక్కడే ఇంకా కొద్ది ముందుకు పోతే "మనస శ్చేంద్రియాణాం చ ఐకాగ్ర్యం నిశ్చితం తపః" అంటాడు వ్యాసుడు. మనస్సునూ, ఇంద్రియాలను ఏకాగ్ర మొనర్చడమే తపస్సు. మనస్సు, ఇంద్రియాలూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తే మానవునికి కష్టాలూ, దుఃఖాలూ సంక్రమిస్తాయి. ఈ రెంటినీ అదుపులో ఉంచుకొన్ననాడే మానవునకు సుఖశాంతులు లభిస్తాయి. అటువంటి తపస్సువల్ల పొందరానిదంటూ ఏదీలేదు.

తపసో హి పరం నాస్తి తపసా విన్దతే మహత్
నాసాధ్యం తపసః కించి దితి బుధ్యస్వ భారత! 3-245-16

ఈ తపస్సుకు ప్రధానమయినది మనస్సుయొక్క ఏకాగ్రత. లౌకికమయిన జీవితం గడిపేవారికి ఇది కొంత కొరవడుతుంది. అయినా మానవుడు ఆ చిత్తైకాగ్రత కోసం ప్రయత్నించాలి. లౌకికంగా వచ్చే సుఖదుఃఖాలను మానవుడు పరిగణించ రాదట. రోజూ మనం సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూస్తున్నాము. అవి కేవలం కాలాన్ని అనుసరించి వచ్చేవి. ప్రాజ్ఞుడు సుఖదుఃఖాలను కూడా అలాగే దర్శిస్తాడు. వాటికి సంతోష సంతాపాలను పొందక నిశ్చలంగా ఉంటాడు. ఇటువంటి దృష్టాంతాలను దృష్టిలో ఉంచుకొని మనస్సునూ, ఇంద్రియాలనూ ఏకాగ్ర మొనర్చడమే తపస్సు. అది కూడా భగవంతుని మీద చేస్తే లౌకిక విషయాల నుండి మోక్షం లభిస్తుంది.

తపస్సు కూడా నిష్కల్మషంగా చెయ్యాలి. తపస్సుకు దోష మాపాదించే లక్షణాలు 12 ఉన్నాయి. అవి విడిచి తపస్సుచేస్తే ఆ తపస్సు నిష్కల్మషతపస్సు అవుతుంది. ఆ దోషాలు ఇవి.

క్రోధః కామో లోభమోహౌ వివిత్సాఽ
కృపాఽసూయా మానశోకౌ స్పృహా చ|
ఈర్ష్యా జుగుప్సా చ మహాగుణేన
సదా వర్జ్యా ద్వాదశైతే నరేణ - సనత్సుజాతీయం 2-16

1. క్రోధం 2. కామం 3. లోభం 4. మోహం 5. వివిత్స (విషయములను కోరుట) 6. అకృప 7. అసూయ 8. మానం 9. శోకం 10. స్పృహ 11. ఈర్ష్య 12.జుగుప్స.

ఈ పన్నెండూ మానవుని వేర్వేరుగా వేధిస్తాయి. సమయం చూసి వేటాడుతాయి. అందుచేత వీనిని విడిచిపెట్టి తపస్సుచెయ్యాలి. అది సత్ఫలితాన్నిస్తుంది. సద్యః ఫలితాన్నిస్తుంది.

ఈ విషయం సనత్సుజాతుడు ధృతరాష్ట్రునకు చెప్పాడు, విదురనీతి తర్వాత.

రెండవ విషయం దానం. దానమంటే తనకున్నది యితరులకు ఇవ్వడం. ఇది పైకి పరోపకారంగా కనిపిస్తుంది. కాని యిందులో ఒక చక్కని మూలసూత్రం ఉంది. మమకారం బంధహేతువు. నిర్మమత్వం మోక్షహేతువు. ఈ దానంతో 'మమ'కారం పోతుంది. నాది అనుకొనే వస్తువును ఇతరులకు ఇస్తున్నాము. పైగా ఇచ్చేటప్పుడు 'తుభ్యం అహం సంప్రదదే న మమ' (నీకు నేను ఇస్తున్నాను - ఇక నాది కాదు) అంటూ ఇస్తున్నాము. అనగా 'మమ'కారాన్ని విడిచి పెడుతున్నా మన్నమాట. ఎంతో కష్టపడి సంపాదించి 'నాది' అనుకొన్న సొత్తును దానం చెయ్యడం మానవులకు చాలా కష్టం. అందుకే దానగుణం సహజంగా రావాలంటారు.

అయితే ఈ దానం చేసే తీరును తైత్తిరీయోపనిషత్తు చక్కగా తీర్చిదిద్దింది. ఆ తీరులో అహంకార త్యాగం యిమిడ్చారు మహర్షులు. దానం ఎట్లా చెయ్యాలి అంటే...

శ్రద్ధయా దేయమ్ ; అశ్రద్ధయాఽదేయమ్
శ్రియా దేయమ్ ; హ్రియా దేయమ్
భియా దేయమ్ ; సంవిదా దేయమ్

చేసే దానం శ్రద్ధతో చెయ్యాలి. ప్రీతితో హితంగా మాట్లాడుతూ చెయ్యాలి. అశ్రద్ధగా ఎన్నడూ దానం చేయరాదు. శక్తికి లోపం లేకుండా దానం చెయ్యాలి. 'ఇంతకంటె ఎక్కువ ఇవ్వలేక పోతున్నాను' అని సిగ్గుపడుతూ దానం చెయ్యాలి. అంతేకాదు, భయపడుతూ దానంచేయాలి. ఎందుకీ భయం? అంటే, ఈ శరీరం క్షణభంగురం. తరువాతి నిముషంలో ఉంటుందో, ఉండదో చెప్పలేము కనుక మన ఉనికిని గురించి భయపడుతూ దానం చెయ్యాలి. వాయిదా పడనీయకుండా వెంటనే దానం చెయ్యాలి.

ఈ భావంలో మమకారత్యాగం ఒకటేకాదు, అహంకార త్యాగం కూడా ఉంది. (నేనెంత వాడను దానం చెయ్యటానికి - నేను చేయటంలేదు. నిమిత్తమాత్రుడను

అనుకోవడమే అహంకారత్యాగం) అహంకార మమకారాలు రెండూ అంతరిస్తేనే కాని మోక్షం లభించదు. అనగా మోక్షసౌధానికి ఈ దానగుణం సోపానప్రాయ మన్న మాట.

ఇక్కడ రెండింటి (తపస్సు - దానం) తారతమ్యమూ చెపుతూ వ్యాసుడు దానమే గొప్పదని చెప్పాడు. కాని ధర్మరాజుకు తపస్సు చేయమని ఉపదేశించాడు. అనగా ఇపుడు ధర్మరాజుకు తపస్సు ఒకటే సాధ్యం కనుక. దానివల్ల సంపదలు పొంది, దానం చేయటానికి వీలు కలుగుతుంది కనుక. ఈ రెండు గుణాలను చేర్చి వ్యాసుడు ఒక చక్కని చమత్కారయుతమయిన శ్లోకం చెప్పాడు.

ద్వావంభసి వినిక్షేప్యౌ గాఢం బద్ధ్వా గళే శిలామ్ ।
ధనినం చాప్రదాతారం దరిద్రం చాతపస్వినమ్ ॥ - విదురనీతి 32-60

ధనం ఉండి దానం చెయ్యనివానిని, దరిద్రుడయి తపస్సు చేయనివానిని (ఇద్దరినీ) మెడలో రాయి కట్టి నీళ్ళలో ముంచాలి. ఇందులో వ్యాసుని ప్రజాహిత పరమయిన తపన గమనించాలి.

సైంధవ పరాభవం :

ఒకనాడు పాండవులు ద్రౌపదినీ, ధౌమ్యునీ తృణబిందుని ఆశ్రమంలో ఉంచి వేటకై నలుదిక్కులకూ వెళ్లారు. అపుడు సైంధవుడు (దుర్యోధనుని చెల్లెలైన దుస్సల యొక్కభర్త) సాల్వకన్యను పెండ్లిచేసుకోవటానికి చతురంగబలంతో వెడుతున్నాడు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న ద్రౌపదిని చూసి మోహపడ్డాడు. ఆశ్రమంలో ప్రవేశించి, తన అభిలాషను ద్రౌపది కెరిగించాడు. ద్రౌపది ముందుగా సామోపాయంతో చెప్పి చూసింది. వాడు వినిపించుకోలేదు. తరువాత పాండవుల పరాక్రమాన్ని ఉగ్గడిస్తూ కఠినంగా మాట్లాడింది. వాడు ఆమాటలనూ పెడచెవిని పెట్టాడు. బలవంతాన ద్రౌపదిని రథంమీదకు చేర్చి తీసుకుపోయాడు. ధౌమ్యు డడ్డుపడినా, విడిపించుకొని సైంధవుడు వెళ్ళిపోయాడు. కొంతసేపటికి పాండవులు వచ్చారు. విషయాన్ని గ్రహించి, సైంధవుని వెన్నంటి, ఆక్రోశిస్తూ వెడుతున్న ధౌమ్యుని చూశారు. ధౌమ్యునికి నమస్కరించారు. "మీరింక భయపడక మెల్లగా రండి" అని ధౌమ్యుని కోరి, సైంధవుని సేనపై విజృంభించారు. ఒక్కక్షణంలో పాండవులు సైంధవ సైన్యాన్నంతటినీ నుగ్గునుగ్గు చేశారు. సైంధవుని చుట్టుముట్టారు. వెంటనే సైంధవుడు

ద్రౌపదిని విడిచి, రథంమీద పారిపోయాడు. అంతలో భీముడు ధర్మరాజును చూసి "రాజా! మీరూ, ద్రౌపదీ, ధౌమ్యులూ, నకుల సహదేవులూ ఆశ్రమానికి వెళ్లండి. నేనూ, అర్జునుడూ ఆ సైంధవుని సంహరించి వస్తాము" అన్నాడు. ఆ మాటకు ధర్మరాజు మనస్సు చివుక్కుమంది. ధర్మరాజు "అతడు దురాత్ముడయినా, మన తోబుట్టువు దుస్సలను తలచి వానిని చంపరాదు. ఆ గాంధారికి దుఃఖం కలిగించటం మనకు ధర్మంకాదు. అందుచేత చంపవద్దు. ప్రాణాలతో బంధించి తీసుకురండి" అని చెప్పి సాగనంపాడు.

భీమార్జునులు రథమెక్కి, సైంధవుని వెంటాడి వాని గుఱ్ఱాలను చంపివేశారు. వెంటనే రథం దిగి, వెలవెలబోతూ ఆ మనుజపశువు భీతితో పరిగెత్తడం మొదలు పెట్టాడు. "ఇంకెక్కడికి పోతావురా" అంటూ భీమార్జునులు వెంటపడ్డారు. వాడు వెళ్ళి వెళ్ళి ఒక పొదలో దూరాడు. భీమసేనుడు వెళ్ళి, వాని జుట్టు పట్టుకొని, ఈడ్చుకొని వచ్చి, పిడికిలితో ఒళ్ళంతా పిండి పిండిగా కుళ్ళబొడిచాడు. ఒక్కక్షణంలో వాడు వివశుడై పడిపోయాడు. ఇంతలో అర్జునుడు "ఇంకా కొడితే వాడు చచ్చిపోతాడు" అని ధర్మరాజు మాటలు గుర్తుచేసి, వారించాడు. భీముడు కోపం ఆగక "ఆ ధర్మరాజు కరుణే కాని కార్యాన్ని గురించి ఆలోచించడు. నీవు కూడా అలాగే తయారయ్యావు - అసలు వీనిని క్షమించవచ్చా" అని కత్తితో వాని తల గొరిగాడు. "నీకు ప్రాణాలమీద ఆశ ఉంటే ఇప్పటి నుండి ఏసభలో నయినాసరే పాండవ దాసుడను అని చెప్పుకో" అన్నాడు. వాడు ప్రాణభీతితో అలాగే అన్నాడు. అతనిని పెడకేలు విరిచి కట్టి, రథంమీద పెట్టుకొని, తీసికొని వెళ్ళి, భీమార్జునులు ధర్మరాజుకు చూపించి, "ఇదుగో! పాండవ దాసుడు వచ్చాడు" అన్నారు. "అయితే వీనిని విడిచి పెట్టండి" అన్నాడు ధర్మరాజు. ఇక ఎప్పుడూ ఇటువంటి తప్పుపనులు చేయక బద్ధిమంతుడవయి ఉండుమని సైంధవునికి బుద్ధిచెప్పి పంపివేశాడు. వాడు సిగ్గుతో తలవంచుకొని వెళ్ళిపోయాడు. తరువాత గంగాద్వారంలో మహేశ్వరుని గురించి తపస్సుచేశాడు. ప్రత్యక్షమయిన మహేశ్వరుని పాండవులను జయించే వరం కోరాడు. శివుడు "ఇది పొసగనిది. వారిని జయించడం ఇంద్రాదులకు కూడా శక్యం కాదు. అయినా నీకోరిక తీర్చాలి కనుక - అర్జునుని తప్ప మిగిలిన పాండవులు నల్గురినీ ఒకనాటి యుద్ధంలో నీవు జయిస్తావు. ఆ అర్జునుని జయించడం నాకు కూడా చాలా కష్టం. అతనికాశక్తి నా అనుగ్రహం వల్లనే వచ్చింది. అయినా

అతనికి విష్ణువు ప్రియసఖుడు. అందుచేత నీవు అతనిని గెల్వలేవు" అని అంతర్హితు డయినాడు. సైంధవుడు దానికే సంతోషించి తన దేశానికి వెళ్ళిపోయారు.

తరువాత కొన్నాళ్ళకు మార్కండేయుడు ధర్మరాజు దగ్గరకు వచ్చాడు. ఈ విషయమంతా ధర్మరాజు మార్మండేయునికి వివరించి ద్రౌపదివలె కష్టాలు పడిన సాధ్వి కాని, మావలె దుఃఖపడిన రాకుమారులుగానీ ఏలోకంలోనూ లేరనుకొంటాను" అన్నాడు. మార్కండేయుడు - అప్పుడు "నీదుఃఖం ఎంతటిది ? ఆ సీతారాములు కారడవులలో ఎన్ని కష్టాలుపడ్డారు. నీకష్టాలు వాటిని మించినవి కావు" అని, రామాయణం అంతా సవిస్తరంగా చెప్పాడు.

సావిత్రి చరిత్ర

మద్ర దేశాధీశుడయిన అశ్వపతి సంతాన కాంక్షతో 18 సంవత్సరాలు సావిత్రిని ఉపాసించాడు. ఆమె ప్రత్యక్షమయి వరం కోరుకొమ్మంది. అతడు కుమారుని కోరాడు. ఆమె "నీకు కుమార్తె పుడుతుంది" అంది. అశ్వపతి "అమ్మా! నీ కరుణ వల్ల నా కోరిక సఫలం కావద్దా?" అని సవినయంగా అడిగాడు. ఆమె కరుణతో "నేను నీ కోరికను పూర్వమే బ్రహ్మకు చెప్పాను. అతడు కన్య పుడుతుందని చెప్పాడు. బ్రహ్మమాట అమోఘమయినది. అయితే ఆ కుమార్తె కారణంగా నీకు నూర్గురు పుత్రులు కలుగుతారు" అని అంతర్ధానమయినది. తరువాత అశ్వపతి మాళవి యందు సావిత్రిని కని, పెంచి, పెద్దచేశాడు. వరాన్వేషణలో ఉన్న అశ్వపతి దగ్గరకు ఒకనాడు నారదుడు వచ్చాడు. అదే సమయంలో సావిత్రి వచ్చి తండ్రికి నమస్కరించింది. ఆమెను చూసి నారదుడు "యుక్త వయస్సు వచ్చినా ఇంకా వివాహం చేయలేదేమి?" అని అశ్వపతిని అడిగాడు. "ఆమె తనకు నచ్చిన రాకుమారుని వరించడం నాకు సమ్మతం" అని అశ్వపతి చెప్పాడు. అపుడు సావిత్రి "సాళ్వ భూపతి కుమారుడు సత్యవంతుని కోరుతున్నాను. అతనికి ఇయ్యి. ఇపుడా సాళ్వపతి రాజ్యం కోల్పోయి, కనులు కోల్పోయి, అడవిలో ఉన్నాడు. అయినా సరే ఆ సత్యవంతునే నేను వరిస్తాను" అంది. తండ్రి అశ్వపతి వెంటనే అతనిని గురించి నారదుని ఆడిగాడు. నారదుడు "అతడు సకల సద్గుణాలూ కలవాడే కాని అతనిలో ఒక తప్పువుంది. వివాహం అయిన సంవత్సరానికి అతడు చనిపోతాడు" అన్నాడు. "ఆయినా సరే సత్యవంతునే వరిస్తానంటూ సావిత్రి యిలా అంది.

వినుము మనో వాక్కాయము
లను మూఁడు దెఱంగులందు నంతఃకరణం
బనఘ! ప్రధానము గావున
మనసున గైకొన్న భర్త మానుటఁ దగునే? 3-7-183

మనస్సు, వాక్కు, శరీరం (ఈ మూటిని త్రికరణము లంటారు) ఈ మూడింటి లోనూ మనస్సు ప్రధాన మయినది. కావున మనసుతో గైకొనిన భర్తను చేసికొనకుండా మానడం తగదు.

మనోవాక్కాయములు మూడింటిలోనూ మనస్సు ప్రధానమయినది. మిగిలిన రెండూ దాని పనులు నిర్వర్తిస్తాయి, మూలభూత మయినది మనస్సు. మనస్సు అనుకొన్న పనిని వాక్కు చెపుతుంది, శరీరం చేస్తుంది. ఏ క్రియకయినా మూలం మనస్సే. అందుకే “మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః” (మానవుని బంధనానికి కానీ, మోక్షానికి కానీ మనస్సే కారణం) అని మైత్ర్యుపనిషత్తు చెపుతుంది.

సావిత్రి మనసులో సత్యవంతుని కోరింది. తనను తాను అతనికి అర్పించు కొంది. అనగా సావిత్రి మనస్సుతో నిశ్చయించుకొన్నది. అదే ప్రధానమూ, ప్రమాణమూ కూడా. వాక్కుతోనూ, క్రియతోనూ కాక పోయినా సరే. అదే విషయం సంస్కృతంలో

మనసా నిశ్చయం కృత్వా తతో వాచాఽభిధీయతే |
క్రియతే కర్మణా పశ్చా త్ప్రమాణం మే మనస్తతః ||

మనస్సుతో నిశ్చయిస్తాము. తర్వాత వాగ్దానం చేస్తాము. తరువాత క్రియ జరుగుతుంది. ఈ మూటిలోనూ ప్రమాణం మనస్సే. అదిగాక “కన్య ఒక్కసారే ఇవ్వ బడుతుంది” అని కూడా అనుకొంది సావిత్రి.

ఒకసారి సావిత్రి మనస్సులో నిశ్చయించుకొంది, సత్యవంతుని వివాహం చేసుకోవాలని. ఇప్పుడు సత్యవంతుడు అల్పాయుష్కుడని తెలిసింది ‘ఏంచెయ్యాలి!’ అని సావిత్రి మనస్సు సందేహించవచ్చు. ‘మనసుకు ప్రాధాన్యం ఇవ్వాలా, క్రియకు ప్రాధాన్యం ఇవ్వాలా?’ ఇదీ సందేహం.

అయితే ఇటువంటి సందేహాస్పద విషయాల్లో సజ్జనులకు మనస్సు ఏం చెపితే, అదే ప్రమాణం అంటాడు కాళిదాసు. ‘సతాం హి సన్దేహ పదేషు వస్తుషు

ప్రమాణ మన్తఃకరణ ప్రవృత్తయః' (అభిజ్ఞాన శాకుంతలము). ఇప్పుడు సావిత్రి కూడా దాన్నే అనుసరించి, మనస్సే ప్రధాన మయినదని నిశ్చయించింది.

"ఆమె సన్మార్గురాలు కనుక అమెచేసిన పుణ్యవశాత్తు అతడు దీర్ఘాయుష్మంతుడు కావచ్చు. ఆమె స్థిరబుద్ధి కలిగినది. ఆమె తన ధర్మం నుండి చలించదు. మంచిదే. కానివ్వండి" అని నారదుడూ ప్రోత్సహించాడు. ద్యుమత్సేనుడు (సత్యవంతుని తండ్రి) రాజ్యభ్రష్టుడని యైనా విచారించలేదు అశ్వపతి. అడవులలోని ద్యుమత్సేనుని చేరి, తన సంకల్పాన్ని చెప్పాడు అశ్వపతి. అపుడు ద్యుమత్సేనుడు "రాజ్యభ్రష్టులయి అడవులపాలయిన మాతో వియ్యమా" అన్నాడు. దానికి సమాధానంగా ధీరుడయిన అశ్వపతి చక్కని సూక్తి చెప్పాడు.

కలిమియు లేమియున్ సతము గావవి సెందినచోఁ జెలంగుచుం
గలఁగుచు నుక్కి ధీరులప్రకారమె?...

కలిమి లేములు శాశ్వతంకావు. కలిమి వస్తే పొంగిపోవడం, లేమి (దారిద్ర్యం) వస్తే కుంగిపోవడం ధీరుల లక్షణం కాదు.

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్మని రుచ్యతే - భగవద్గీత 2-56

దుఃఖాల్లో ఉద్విగ్నుడు కాకుండానూ, సుఖాల మీద స్పృహ లేకుండానూ, రాగంకాని, భయంకాని, క్రోధంకాని లేకుండా నిశ్చలమయిన మనస్సుకలవాడే ముని అని పిలవబడతాడు.

అని అశ్వపతి ధైర్యంతో ద్యుమత్సేనుని ఒప్పించి, సత్యవంతునికి తన కూతురు సావిత్రి నిచ్చి, వివాహం చేశాడు. సావిత్రి సత్యవంతుని అనుసరించి పతివ్రత అనే పేరును సార్థకం చేస్తోంది. నారదుడు చెప్పిన విషయం గుర్తుంచుకొని, తన మగని ఆయువు విషయమై రోజులు లెక్కించుకొంటోంది. ఇంక సంవత్సరానికి నాల్గురోజులుందనగా త్రిరాత్రోపవాస వ్రతం పూనింది. మూడు రోజులూ చక్కగా వ్రతం ఆచరించింది. నాల్గవ రోజున సత్యవంతునితో కలిసి సమిధలు, దర్భలు, పూలు, పండ్లు తెచ్చేందుకు అడవికి తానూ వెళ్ళింది. సత్యవంతుడు సమిధలకోసం ఒక చెట్టుకొమ్మును కొడుతూ తూలి పడిపోయాడు. సావిత్రి గ్రహించింది. తన

తొడపై భర్త శిరస్సు పెట్టుకొని శీతలోపచారాలు చేయసాగింది. ఇంతలో నీలమేఘం వంటి ఒక ఉన్నతపురుషుని చూసింది సావిత్రి. అతడు వేగంగా సత్యవంతుని దగ్గరకు వచ్చాడు. వెంటనే సావిత్రి తన భర్త శిరస్సు మెల్లగా దింపి, నిల్చి, నమస్కరించి “నీ వెవడవు” అని అడిగింది. “నేను యముడను. నీ పాతివ్రత్యం చేత నీవు నన్ను చూడగలిగావు. నీ భర్తకు కాలం చెల్లింది. ఇతడు పుణ్యాత్ముడు కాబట్టి, యితరులను పంపక నేనే వచ్చాను తీసుకొని పోవటానికి” అని, ఆ జీవుని పాశంతో బంధించి, దక్షిణ దిక్కుగా తీసుకొని పోతున్నాడు. వెంటనే సావిత్రి తన భర్త దేహాన్ని ఒక చోట భద్రంగా ఉంచి తాను ఆ పురుషుని వెంట బయల్దేరింది.

యముడు చూసి “లతాంగీ! నీ విటకు రారాదు. ఆగు”మన్నాడు. అపుడు సావిత్రి యిలా అంది.

పతు లెందుఁ జనిన నచటికి
సతులుం జనవలదె? నీ ప్రసాదమునను మ
త్పతి భక్తి కతమునను సం
స్తుత గుణ! నా కరుగ రాని చోటును గలదే ! 3-7-222

పతులు ఎక్కడకు వెళితే అక్కడకు సతులు మాత్రం వెళ్ళవద్దా? నీ అనుగ్రహం చేతనూ, నా పతిభక్తి వల్లనూ నాకు వెళ్ళలేని చోటులు లేవు.

(పతిని అనుసరించి వర్తించటమే సతిధర్మం. అందుకే పతివ్రత అనడం. అదే పతి భక్తి. సావిత్రికి అది ఎట్లాగూ ఉంది. అంతేకాదు. ధర్మ స్వరూపుడయిన యముని అనుగ్రహం కూడా ఉందని చెపుతోంది. ఈ రెండూ ఉన్న సావిత్రికి వెళ్ళలేని చోటులు ఏవీ లేవు. ఎక్కడికయినా ఆమె వెళ్ళగలదు.)

అన్ని మార్గాలలోనూ ధర్మమార్గం ప్రధానమయింది. ఆ ధర్మానికి ఆధారం సజ్జనులు. సజ్జన సందర్శనం ఎన్నడూ వృథాకాదు. సజ్జన శ్రేష్ఠుండవయిన నీ దర్శనం వల్ల పరమశుభం కలగకుండా నే నెట్లా తిరిగి వెడతాను?”.

ఆ మాటలకు సంతోషించి యముడు ఇలా అన్నాడు “తన్వీ! నీ మాటల తీరుకు సంతోషం కలిగింది. నీ భర్త జీవితం తప్ప మరేదైనా కోరుకో, వర మిస్తాను” అన్నాడు.

అపుడు సావిత్రి "సాళ్వ విభునికి (మామగారికి) కన్నులు కలుగుగాక" అని అడిగింది. యముడు వెంటనే అనుగ్రహించి "ఇక నీవు రావలదు" అన్నాడు. అప్పుడు సావిత్రి యిలా అంది.

ఎడపక వాఙ్మనః క్రియల నేరికి హింస యొనర్పఁబూన; రె
య్యెడలను దీనులన్ గరుణ యేర్పడఁ బ్రోవఁగఁ జూతు రిచ్చుచోఁ
గడమ వడంగనీ కెదిరి కాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు; రె
క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకున్ విను మిన్నియు నార్యధర్మముల్ 3-7-228

ఇక్కడ సావిత్రిముఖంగా ఆర్యధర్మాలు చెప్పబడుతున్నాయి.

1. త్రికరణ శుద్ధిగా ఎవరికీ హింస చేయబూనరు. 2. దీనులను కరుణతో రక్షిస్తారు. 5. దానం చేసేటప్పుడు మిగలకుండా కోరికలన్నీ తీరుస్తారు. 4. ఆశ్రితులకు మనసిచ్చి రక్షిస్తారు. ఇవన్నీ ఆర్యధర్మాలు.

ఇందులో మొదటి ధర్మం అహింస. ఇది ధర్మాలన్నింటిలోనికి మొదటిదీ, ముఖ్యమయినదీను. ప్రాణిహింస చేయడం మానవత్వం కాదు. ఈ హింస నాల్గు విధములంటుంది భారతం. మనస్సుతో, వాక్కుతో, శరీరంతో హింస చేయడం; ఇది గాక మాంస భక్షణం. ఈ నాలుగూ విడనాడాలంటుంది భారతం. (ఆం. భా. అనుశా- 4-283)

త్రికరణములతోనూ హింసను విడనాడాలి. హింసఅంటే చంపడం మాత్రమే కాదు. బాధించడం కూడా. ఎవరినీ మనసుతో కాని, మాటతో కాని, చేతలతో కాని బాధింప రాదు. అటువంటి ప్రవృత్తి అహింసా ప్రవృత్తి అంటాము. అది ఆర్యధర్మాలలో మొదటిది.

దంతి యడుగు లోనఁ దక్కిన జంతు చ
యంబు నడుగు లెల్ల నడఁగి యుండు
నట్ల ధర్మకోటు లన్నియు లోనగు
నిర్ధగుణ! యహింస కింత నిజము భార-అను-4-283

ఏనుగుపాదంలో మిగిలిన జంతువుల పాదాలన్నీ అణగిపోతాయి. అలాగే అహింసలో అన్ని ధర్మాలూ ఇమిడి పోతాయి.

మానవుని శీలానికి వన్నె పెట్టేవి ఆరు. 1. ధ్యానం 2. ఇంద్రియ నిగ్రహం 3. అహింస 4. గురుపూజ 5. నిత్యానుష్ఠానం 6. తపస్సు. వీటిలో అహింస మిగిలిన ధర్మాలకు ప్రకాశాన్నిస్తుంది. అందుకే "అహింసా పరమో ధర్మః" అన్నాడు వ్యాసుడు.

రెండవ ధర్మం దయ. అనగా భూతదయ. సర్వప్రాణుల మీద దయకలిగి ఉండటం. అదనులో ఆదుకొని రక్షించడం. దీనినే ఎఱ్ఱన "ఎయ్యెడలను దీనులన్ గరుణ మేర్పడఁ బ్రోవఁగఁ జూతురు" అన్నాడు. నన్నయకూడా తన భారత భాగంలో.

సర్వభూత దయకు సత్యవాక్యమునకు
నుత్తమంబు ధర్మువొండెఱుంగ 1-3-219

అన్నాడు. ఇది ధర్మ సర్వస్వం. తోటి మానవులపై దయను చూపుమని ఎందరో చెప్పారు. కాని భారతం మరో మెట్టు పైకి ప్రాకింది. తోటి ప్రాణిని దయతో రక్షించు మన్నది. అనగా పశు పక్ష్యాదులను కూడా కలుపుకొంది.

మూడవ ధర్మం సమగ్రంగా దానం చెయ్యటం. ఎదుటివారు పూర్తిగా సంతృప్తి చెందేటట్లు కోరికలన్నీ తీర్చటం. అసలు దానగుణం సహజంగా వస్తుందట. అభ్యాసంతో నేర్చుకొంటే వచ్చేదికాదు. అది ఆర్యధర్మం. ఆర్యులు దాన గుణాన్ని విడువరు. రంతి దేవుడు, శిబి, దధీచి, కర్ణుడు మొదలయిన వారు దాన గుణంలో ప్రసిద్ధి వహించారు.

నాలుగవ ధర్మం ఆశ్రిత రక్షణం. అనగా శరణాగతులను, ఆశ్రయించిన వారిని రక్షించడం. శరణాగత రక్షణం విషయమై శాంతిపర్వంలో ఒక చక్కనికథ ఉంది. ఒక కపోతం తన అతిథియైన బోయవానికి ఆహారంగా తాను అగ్నిలో పడి అతిథికి ఆహారతృప్తి కలిగించింది. అందుచేత శరణాగత రక్షణాన్ని మించిన ధర్మం లేదంటాడు తిక్కన. (లుబ్ధకపోతోపాఖ్యానము – శాంతి-5వ ఆశ్వా.)

ఈ నాల్గు ధర్మాలూ ఇపుడు సావిత్రి మీద యమధర్మరాజు చూపవలసినవి. సత్యవంతుని హింసించరాదు. దీనురాలయిన సావిత్రిపై కరుణ చూపాలి. సావిత్రి కోరికలను పూర్తిగా తీర్చాలి. తన్ను ఆశ్రయించిన సావిత్రిని రక్షించాలి. ఈ కృత్యాలను నేర్పుగా సావిత్రి సూచించింది.

పైగా సావిత్రి యింకా యిలా అంది. "యమధర్మరాజా! నీవెరుగని ధర్మం లేదు. ధర్మాలన్నీ నీ భావాధీనములే. అందుకే నిన్ను ధర్మరాజు అన్నారు. అంతే కాదు. అన్ని ప్రాణులకూ కర్మఫలాలను నీవు సమబుద్ధితో సమకూరుస్తావు. అందుకే నీకు సమవర్తి అనే పేరు లభించింది."

ఈ మాటలతో యముడు సంతృప్తిచెంది మరల "నీ పతి ప్రాణాలు తప్ప మరొక వరం కోరుకో" అన్నాడు. "శత్రులచేత అపహరింపబడిన రాజ్యం మళ్లీ ద్యుమత్సేనునికి (మామగారికి) ప్రాప్తించుగాక" అని కోరింది. యముడు అనుగ్రహించి "ఇక నీ విక్కడ ఆగుము రావలదు" అన్నాడు. అపుడు సావిత్రి మరో ధర్మం చెప్పింది."

ధర్మాత్ములు దమ సలిపెడు
ధర్మక్రియ దప్ప రెట్టి దశలందును మో
హోర్ములుఁ దాపముఁ బుట్టవు
ధార్మిక హృదయములఁ బ్రధమ ధర్మాధ్యక్షా! ఆర-7-237

యమధర్మరాజా! ధర్మాత్ములు తాముచేసే ధర్మక్రియను ఎట్టిదశలోనూ తప్పరు. ధార్మిక హృదయాలలో మోహమూ తాపమూ కలుగవు.

(ధర్మాత్ములు తాము చేసే ధర్మకార్యాలకు ఎన్నడూ ఆటంకం కలుగనివ్వరు. వారినే ధర్మనిరతులనీ, ధర్మాత్ములనీ అంటారు. తామెంత కష్టదశలో ఉన్నా దాన్ని మనసా పట్టించుకోరు. వారి మనసు సర్వదా ధర్మం మీద లగ్నమయి ఉంటుంది. అయితే ధర్మానికి ఆటంకం కలిగించేవి రెండు 1. మోహం 2. తాపం

మోహం: ఇది మానవుని ఎల్లప్పుడూ ఆవరిస్తూ ఉంటుంది. మోహం కెరటాల వంటిది. ఒక కెరటం వెనుక మరొక కెరటం వస్తూనే ఉంటుంది. అలాగే నిరంతరంగా మోహం ఆవరిస్తూనే ఉంటుంది. వాటిని – మోహపుకెరటాలను - మానవుడు తొలగించుకొంటూ అవగాహనం (స్నానం / జ్ఞానసంపాదనం) చేయాలి. ధర్మ నిరతులయినవారి మనస్సులను ఈ మోహమనే కెరటాలు ఆక్రమించవు. అలాగే తాపం. ఇది మూడు విధాలు. దాన్నే తాపత్రయం అంటారు. 1.ఆధ్యాత్మికం 2.ఆధిదైవికము 3.ఆధిభౌతికము - ఈ తాపములు మూడూ ధర్మాత్ములకు కలుగవు.)

నీవీ ధర్మాలన్నీ తెలిసిన వాడవు. నీవు ప్రథమ ధర్మాధ్యక్షుడవు. పతిని అనుసరించడం సతి ధర్మం. ఆ ధర్మాన్ని మోహ పడకుండా ఆచరించవద్దా" అంది సావిత్రి.

అపుడు యముడు "నీవు ధర్మతత్పరవు. అందుచేత నీ పతి ప్రాణం తప్ప మరో వరం కోరుకో" అన్నాడు. సావిత్రి తన తండ్రికి నూర్గురు పుత్రులు కావాలని కోరింది. అట్లే ప్రసాదించాడు యముడు. ఇచ్చి వెనుకకు మరలమన్నాడు సావిత్రిని. సావిత్రి నాకు భర్తృ సంశ్రయం ధర్మం. ఒక్క విన్నపం చేస్తాను అంటూ

ఆత్మధర్మ నిరతులైన పుణ్యాత్ములు
దుర్లభులు సమస్త దురితములును
శాంతిఁ బొందు వారి సంసర్గమునఁ దీర్థ
భూతమతులు వారు భూతలమున. 3-7-243

అంది. లోకంలో ఆత్మ ధర్మాన్ని నిర్వర్తించే పుణ్యాత్ములు దుర్లభులు. వారి స్నేహంతో అన్ని పాపాలూ ఉపశమిస్తాయి. వారు భూమిమీద తీర్థముల వంటి వారు.[1]

వారల పేర్మిఁ గాదె శశి వారిజమిత్రులు నిర్వికార సం
చారత నుల్లసిలల్లెదరు సర్వపయోనిధులున్ నిరాకులా
కారతఁ గ్రాలెడుం గులనగంబులు నిశ్చలరూఢిఁ జాల నొ
ప్పారెడు భూతధాత్రి నిఖిలైక ధురీణతఁ బేర్మిఁ బొందెడున్ 3-7-244

ఆ ధర్మాత్ముల వలననే సూర్యచంద్రులు నిరంతరమూ సంచరిస్తున్నారు. సముద్రాలన్నీ నిరాకులంగా ఉన్నాయి. కుల పర్వతాలు నిశ్చలంగా ఉన్నాయి. ఈ భూమి సర్వభారాన్నీ మోస్తూ, ప్రశస్తి వహిస్తోంది.

ఏడు మాట లాడిన యంత నెట్టివారు
నార్య జనులకు చుట్టంబు లగుదు రనిన-

---

1 దీనినే సజ్జన సాంగత్యం పేరుతో ఈ శ్లోకం వివరిస్తుంది.

సాధూనాం దర్శనం పుణ్యం తీర్థభూతా హి సాధవః
కాలేన ఫలతే తీర్థం సద్యస్సాధుసమాగమః

సజ్జనులు తీర్థముల వంటి వారు. తీర్థం కాలపక్వమయితేనే ఫలిస్తుంది. కాని సజ్జన సాంగత్యం సద్యః (వెంటనే) ఫలితాన్నిస్తుంది.

(ఏడు మాటలు మాట్లాడితే చాలు సజ్జనులకు స్నేహ మేర్పడుతుందట) అటువంటప్పుడు ఇంతసేపు నీతో మాట్లాడటం వలన "నేను నీకు చుట్టాన్ని" అని వేరుగా చెప్పనవసరం లేదు – మిత్రుల కోరిక, బంధువుల కోరిక (ధార్మిక మయినది) తప్పక తీర్చాలి అంది సావిత్రి.

ఆ ధర్మోక్తులకు యముడు సంతుష్టుడై "నీకు ప్రసన్నుడ నయ్యాను. నీ కిష్ట మయిన వరం కోరుకో" అన్నాడు. అప్పుడా సావిత్రి "ధర్మరాజా! ఇంతవరకు నీవు 'నీ భర్త జీవితం తప్ప' అంటూ ఇతర వరాలు ఇచ్చావు. ఇపుడా మాట లేకుండా నాయిష్టం వచ్చిన వరం కోరుకొమ్మన్నావు. పతిలేని జీవితం సతికి చాలా దుస్సహమూ, దుర్భరమూను. శుభకార్యాల్లో ఆమెను దూరంగా ఉంచుతారు. అందుచేత నాభర్త జీవితాన్ని ప్రసాదించు" అంది.

యముడు చాలా సంతోషించి "నీ భర్త జీవితం ఇస్తున్నాను గ్రహించు. ఇతడు 400 సంవత్సరాలు జీవిస్తాడు. నూర్వురు పుత్రులను పొంది వంశవర్ధను డవుతాడు" అని భర్త జీవితాన్ని ఇచ్చి అంతర్థానమయ్యాడు.

ఈ విధంగా సావిత్రి పాతివ్రత్యంతో తన భర్త జీవితాన్ని సయితం రక్షించుకొంది.

ఆ సావిత్రి వలెనే ఈ ద్రౌపది కూడా మహాపతివ్రత. ఆమె శుభ ప్రవర్తనతో మిమ్మూ, మీ వంశాన్నీ ఉద్ధరిస్తుంది." అని మార్కండేయ మహర్షి పాండవులను వీడ్కొని తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

కర్ణ చరిత్ర :

తరువాత జనమేజయుడు వైశంపాయనుని "ఇంద్రుడు కవచకుండలాలు ఎలా హరించాడు" అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పాడు.

"పాండవులు అరణ్యవాసం చేస్తున్నారు. 12వ సంవత్సరం చివరకు వచ్చింది. ఇంద్రుడు పాండవులకు హితం చేయాలనే దృష్టితో కర్ణుని కవచకుండలాలు మాయోపాయంతో హరించాలనుకొన్నాడు. ఈ విషయం సూర్యుడు తెలుసుకొని కర్ణుని దగ్గరకు బ్రాహ్మణ వేషంలో వెళ్ళి, తన్నెరిగించుకొని, 'యింద్రుడు నిన్ను యాచింప వస్తాడు, నీ కవచకుండలాలను ఇవ్వకు' అన్నాడు. అపుడు కర్ణుడు 'అశాశ్వతమయిన శరీరం కోసం శాశ్వతమయిన కీర్తి పోగొట్టుకొమ్మంటావా?

అట్లా ఎన్నడూ చెయ్యను. ఇంద్రుడు వచ్చి నన్ను యాచించటం నా పుణ్యంగా భావించి యిస్తాను.

కీర్తి విడువఁజాలఁ గీర్తితో మెలఁగంగఁ
జావు వచ్చెనేనిఁ జత్తుఁ గాని
జగములోన నెల్ల సడికంటెఁ జావు మే
లనఁగఁ బరగు మాట యనఘ వినవె ? ఆర-7-293

నేను కీర్తిని విడిచి పెట్టలేను. కీర్తితో ప్రవర్తించేటప్పుడు చావు కలిగినా సంతోషంగా అనుభవిస్తాను. అపకీర్తికంటె చావు మేలని ఎన్నడూ వినలేదా? కీర్తి వల్లనే పుణ్యగతి కలుగుతుంది. కీర్తి తల్లివలె రక్షిస్తుంది. సత్కీర్తియే ఆయువునూ, సంపదనూ ఇస్తుంది. కీర్తి లేనివాని జీవనం వ్యర్థం. అంతేకాదు. కీర్తిలేనివారు జీవన్మృతుడు. అపకీర్తి కలవానికి అన్ని కీడులూ సంక్రమిస్తాయి.

అంతేకాదు నాకు కొన్ని వ్రతములున్నాయి. అవి నేను ఎప్పుడూ ఉల్లంఘించను. 1) విప్రులడిగినది తప్పక యివ్వడం 2) శత్రుసంహారం 3) యుద్ధంలో మరణించడం 4) శరణాగత రక్షణం 5) స్త్రీ బాల వృద్ధులను రక్షించడం. ఇవి నా వ్రతాలు. వీటిని తప్పితే నాకు అపకీర్తి ఏర్పడుతుంది. అందుచేత ఇంద్రునికి కవచ కుండలాలు ఇవ్వకుండా ఉండలేను' అన్నాడు.

సూర్యుడు 'నేను నీ హితం కోరి చెపుతున్నాను. తనకూ, తనవారికి కీడు కలగని పద్ధతిలో కీర్తి లభిస్తే స్వీకరించాలి. కాని ప్రాణానికి ముప్ప తెచ్చే కీర్తివల్ల ప్రయోజనం లేదు. తాను పోయిన తరువాత కీర్తి లభిస్తే అది మృతదేహాన్ని అలంకరించినట్లే ఉంటుంది. అదీగాక ఒక దేవరహస్యం ఉంది. దానివల్ల నీమీద నాకు వాత్సల్యం అధికం. నీవు సహజ కవచకుండలాలతో ఉంటే, అర్జునుడు నిన్ను జయించ లేడు' అన్నాడు. అప్పుడు కర్ణుడిలా అన్నాడు. 'నేను యమునకు అంతగా వెఱవను. అసత్యానికి భయపడతాను. అర్జునుని సంహరించడానికి నాదగ్గర చాలా అస్త్రాలున్నాయి. కవచకుండలాలు ఇచ్చేందుకు నాకు అనుజ్ఞ ఇమ్ము' అన్నాడు. 'అదే నీ నిశ్చయ మయితే ఇంద్రునినుండి 'శక్తి' గ్రహించి కవచ కుండలాలు ఇయ్యి. అట్లయితే నీకు శ్రేయస్సు కలుగుతుంది' అని చెప్పి, బ్రాహ్మణరూపంలో ఉన్న సూర్యుడు అంతర్ధానమయ్యాడు. కర్ణుడు ఇంద్రుని రాకకోసం ఎదురు చూస్తున్నాడు."

ఈ కథ వింటున్న జనమేజయుడు “దేవరహస్యం అన్నావు. అదేమిటో ముందు నాకు చెప్పు” అన్నాడు. వైశంపాయనుడు ఇలా చెప్పాడు.

“పూర్వం కుంతిభోజుని యింటికి దుర్వాసుడు వచ్చి ‘నియింట కొంతకాలం ఉండాలని ఉంది. నిర్వ్యాజమయిన భక్తితో ఉపచరింపగలవా?’ అని అడిగాడు. ‘అలాగే’ అని, కుంతిభోజుడు కూతురయిన పృథను నియోగించాడు అతని పరిచర్యకు. (పృథయే కుంతి). కుంతి అతనికి పరమ భక్తితో సంవత్సరంపాటు పరిచర్య చేసింది. దుర్వాసుడు ఎంతో సంతోషించి ‘నీ ఆరాధనకు మెచ్చాను. నీవు కోరిన వరం ఇస్తాను, కోరుకో’ అన్నాడు. ‘మీ అనుగ్రహం ఉంది అదే చాలు’ అంది కుంతి. అయితే ‘ఇదిగో ఒక మంత్రం ఉపదేశిస్తున్నా. దీన్ని పఠించి ఏ దేవతను ఆహ్వానిస్తే ఆ వేల్పు వచ్చి నీ వశంలో ఉంటాడు’ అని ఒక మంత్రాన్ని ఇచ్చి వెళ్ళాడు. కొంత కాలమయిన తరువాత ఒకరోజు సహజ కుండల కవచాభిరాము డయిన సూర్యుని చూసి ‘దేవా! నీతో సమానమయిన సౌందర్యం కల కుమారుని కరుణించు’ అని కోరి మంత్రోచ్చారణం చేసింది. ఆ మంత్ర బలంతో సూర్యుడు మూర్త్యంతరం ధరించి, వచ్చి, ‘ఏమి కావాలి?’ అని అడిగాడు. కుంతి ‘ఏమీ లేదు - ఊరకే మంత్రోచ్చారణం చేశాను’ అంది. దానికి సూర్యుడు ‘కవచ కుండలములు కల నా వంటి పుత్రుని నీవు కోరితివి కదా, అనుగ్రహిస్తాను. అంగీకరించు లేకపోతే నిన్నూ, నీ తల్లిదండ్రులనూ, నీ శీలం తెలియకుండా మంత్రం ఇచ్చిన దుర్వాసునీ దహించి వేస్తాను’ అన్నాడు. అపుడు కుంతి భయపడి ‘మహాత్మా! నీకిది ధర్మమా? నీకు తెలియని ధర్మమున్నదా? నా తండ్రి నీకు ధర్మమార్గంలో ఇస్తే కదా నీవు నన్ను పొందడం’ అన్నది. దానికి సూర్యుడు ‘నిన్ను ఇవ్వటానికి నీ బంధువులు కర్తలు కారు. నీకు నీవే కర్తవు. కన్యాశబ్దానికి అదే అర్థం. అదీ గాక నేను అధర్మం ఎందుకు ఆచరిస్తాను? నా సమాగమంతో నీ కన్యా వ్రతం చెడదు’ అని, ఆమెను కలిసి, ప్రీతుడై వెళ్ళాడు. కుంతి గర్భవతి అయింది. ఈ విషయం దాదికూతు రొక్కతెకే తెలుసు. ఆమె ఈ విషయాన్ని, కుంతిని రహస్యంగా రక్షించింది. పదవనెల ఒకనాటి రాత్రి కుంతి సహజ కవచకుండలాలు కల ఒక కుమారుని కన్నది. లోకాపవాదానికి వెఱచి, ఆ కుమారుని ఒక పెట్టెలో పెట్టి, ఆ పెట్టెను ఒక తెప్పకు కట్టి తానూ, చెలికత్తె ఇద్దరూ వెళ్ళి, అశ్వనదీ ప్రవాహంలో విడిచి వచ్చారు. అది అశ్వనదిలో నుండి చర్మణ్వతికి చేరి, అందుండి యమునా నదిలో చేరి, అక్కడనుండి గంగానదిలో పంపానగర సమీపంలో వెడుతోంది.

ఆ సమయంలో ధృతరాష్ట్రుని సఖుడయిన అధిరథుడనే సూతుడు తన భార్య రాధతో గంగలో జలక్రీడ లాడుతున్నాడు. ఆ పెట్టెను చూసి, తీసి, అందులోని బాలకుని చూసి, ఆశ్చర్యపోయారు దంపతులు. సంతానంలేని వారికి ఆ కుమారుడు దేవసంభవుడుగా తోచాడు. తరువాత ఆ కుమారునికి జాతకర్మాది సంస్కారాలు చేశారు. సహజకుండలాలు కర్ణములకు ఉండటంచేత కర్ణుడని నామకరణం చేశారు. వసుమయమయిన కవచం ధరించినవాడు కావున 'వసుషేణు'డను పేరున కూడా పిలిచారు. ఈ విధంగా సూర్యసుతుడు సూతసుతు డయ్యాడు.

ఈ విషయం కుంతి ఆప్తచారులవలన తెలిసికొని, ఊరడిల్లింది. కొంత కాలానికి యువకుడయిన కర్ణుని తీసుకొనివచ్చి, అధిరథుడు ద్రోణాచార్యుల వద్ద విద్యాభ్యాసం చేయించాడు. అతడింకా కృపాచార్యుల దగ్గరనూ, పరశురాముని దగ్గరనూ శిష్యత్వం చేసి ఎన్నో అస్త్రాలు నేర్చాడు. క్రమంగా దుర్యోధనునితో స్నేహం, చేసి అర్జునునితో మాత్సర్యం వహించాడు.

ఒకనాటి మధ్యాహ్నం కర్ణుడు సూర్యోపాస్తి చేస్తూ బ్రాహ్మణులకు కోరిన వరము లిస్తున్నాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో వచ్చి, 'భిక్షాం దేహి' అన్నాడు. కర్ణుడు 'ఏమికావాలో కోరుకో ఇస్తా' నన్నాడు. బ్రాహ్మణుడు కవచకుండలాలు అడిగాడు. కర్ణుడు అవి యిస్తా, ఇవి యిస్తా నంటూ ప్రలోభపెట్టాడు. బ్రాహ్మణుడు వలదన్నాడు. కర్ణుడు అపుడు చిరునవ్వుతో 'మహేంద్రా! నీవు నన్ను వేడుకొంటున్నావా? సరే! నీ అమోఘమయిన శక్తి నాకిస్తే నా కవచకుండలా లిస్తాను' అన్నాడు. ఇంద్రుడు 'నా శక్తి ఒకరిని చంపి, మళ్ళీ నా చేతికి వస్తుంది. అది నీకిష్ట మయితే గ్రహించు' అన్నాడు. కర్ణుడు 'నాకు ఉన్నది ఒక్కడే శత్రువు కదా!' అనుకొని 'అలాగే' అన్నాడు. అపుడు ఇంద్రుడు 'దీనిని ఆపత్కాలంలో మాత్రమే ఉపయోగించాలి. ఇతరాయుధములతో పనిజరిగేటప్పుడు దీనిని ప్రయోగించరాదు .. అలా ప్రయోగిస్తే నీకే అపాయం కలిగిస్తుంది' అని, శక్తినిచ్చాడు. కర్ణుడు తన కవచ కుండలాలను కోసి యిచ్చాడు ఇంద్రునికి.

ఈ విషయం తెలిసి కౌంతేయులు సంతోషాన్నీ, గాంధారేయులు సంతాపాన్నీ పొందారు.

ఈ విషయం విని జనమేజయుడు "మా తాతలు 12వ సంవత్సరం చివర ఎట్లా ప్రవర్తించారో చెప్పు" అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పాడు.

“మార్కండేయుని వలన పుణ్యకథలు విని, పాండవులు మళ్ళీ ద్వైతవనానికి వచ్చి, సుఖంగా ఉన్నారు. ఒకనాడు ధర్మరాజు దగ్గరకు ఒక బ్రాహ్మణుడు పరుగెత్తి వచ్చి, యిలా అన్నాడు. ‘మహాత్మా! ఒక చెట్టు కొమ్మకు నా అరణిని తగిలించి ఉండగా ఒక మృగం వచ్చి అ చెట్టును రాచుకొంది. అపుడు దాని కొమ్ముకు నా అరణి తగులుకొంది. అరణితో ఆ మృగం పరుగెత్తి పోతోంది. ఆ అరణి లేకపోతే నాకు అగ్నికార్యం జరుగదు. ధర్మలోపం రాకుండా దాన్ని తెప్పించి యిమ్ము’ అన్నాడు. వెంటనే ధనుర్బాణాలు ధరించి, సోదరులంతా బయలుదేరారు. ఆ లేడివెంటపడి, దాన్ని బాణాలతో కొట్టారు. అది వారిని నట్టడవిలోకి తీసుకొనిపోయి, అదృశ్యమయి పోయింది.

అలసిపోయి తమ శ్రమ అంతా విఫలమయినందుకు పాండవులంతా విచారంలో ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. అప్పుడు నకులుడిలా అన్నాడు – ‘సద్వంశంలో పుట్టి, ధర్మ నిబద్ధమయిన దయార్ద్ర బుద్ధి కల మనకు ఈ విధంగా కష్టాలు కలగడానికి కారణం ఏమిటి?’ ఈ మాటలు విని ధర్మరాజు ఇలా అన్నాడు. ‘

వినుము సుఖమునకు దుఃఖం
బునకుం గారణము దనదు పూర్వకృతంబై
చను కర్మము కారణ మిది
యని యన్యము గలుగ నేర దందొక్కటియన్ ఆర-7-384

మానవుని సుఖదుఃఖాలకు కారణం తన పూర్వకర్మమే కాని మరేదీ కాదు.’

ధర్మరాజు సరిపోయిన సమాధానం చెప్పాడు. ధర్మరాజుకు మార్కండేయుడు వస్తూనే కర్మ సిద్ధాంతం గురించి చెప్పాడు. ధర్మరాజు చక్కని అధికారి. గ్రహించిన దానిని సరసంగా నమన్వయించుకోగలిగిన శక్తిమంతుడు. కర్మసిద్ధాంతం గురించి ధర్మజుని సోదరులూ వినే ఉంటారు. కాని వారేమంటున్నారో చూడండి.

అపుడు భీముడు ‘ద్రౌపదిని కొలువులోకి లాగుకొని వచ్చినపుడే ధృతరాష్ట్ర పుత్రులను సంహరించకుండా ఉండడం వల్లనే ఇన్ని కష్టాలు వచ్చాయి మనకు’ అన్నాడు.

అర్జునుడు ‘ఆ సభలో కర్ణుడన్న మాటలు విని కూడా, కోపం వహించకుండా నేను అడవులకు రావడమే మన కష్టాలకు కారణం’ అన్నాడు.

సహదేవుడు 'అసలా శకునిని జూదం సమయంలోనే నేను సంహరించక పోవడమే మన కష్టాలకు కారణం' అన్నాడు.

ఇలా అందరూ తలొకవిధంగా మాట్లాడుతూ ఉంటే ధర్మరాజు నకులుని చూసి, 'నీ సోదరులంతా చాలా దప్పిగొని ఉన్నారు, ఈ చెట్టు ఎక్కి నీవు ఎక్కడయినా నీళ్లున్నా యేమో చూడు' అన్నాడు.

అతడట్లాగే చేసి 'కొద్దిదూరంలో నీళ్ళు ఉన్నా' యన్నాడు. అయితే "నీవు వెళ్ళి, జలం త్రాగి, సోదరులకు పట్టుకురా" అన్నాడు ధర్మరాజు. నకులుడు వెళ్ళి, ఆ సరోవరంలో నీళ్ళు త్రాగబోయాడు. ఇంతలో ఒక అశరీరభూతం ఇలా అంది. "ఈ సరస్సులోని నీళ్ళు తాగాలంటే ముందు నా ప్రశ్నలకు జవాబిమ్ము". ఆ మాటలు నిర్లక్ష్యం చేసి నకులుడు నీళ్ళు తాగాడు. వెంటనే ఆ తీరాన నిశ్చేతనుడై పడిపోయాడు. ఎంత సేపటికీ నకులుడు రాకపోయేసరికి వరుసగా సహదేవుడు, అర్జునుడు, భీముడు వెళ్లి అట్లాగే పడిపోయారు. చివరగా ధర్మరాజు వెళ్లాడు. తమ్ములు నలువురూ పడిఉండటం గమనించాడు. అశరీరభూతం మాటలు విన్నాడు. తన తమ్ములంతా దానివల్లనే పడిపోయారని తెలుసుకొన్నాడు. ఆ అదృశ్య భూతాన్ని 'నీ వెవరవ'ని ప్రశ్నించాడు. 'నేనొక యక్షుడను. నా ప్రశ్నలకు సమాధానం చెప్పు ముందు' అంటూ తన రూపం ప్రదర్శించాడు ఆ యక్షుడు.

ధర్మరాజు 'నీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం నావంటి అల్పబుద్ధునకు శక్యమా? అయినా నాకు చేతనయినట్లు చెపుతాను' అన్నాడు. అవే యక్షప్రశ్నలు.

యక్ష ప్రశ్నలు

1. యక్షుడు: సూర్యుని ఎవరు నడిపిస్తారు?
   ధర్మరాజు: బ్రహ్మము

2. య: సూర్యుని కొలిచి తిరిగే వారెవరు ?
   ధ: దేవతలు

3. య: సూర్యుడు దేనిచేత అస్తమిస్తాడు ?
   ధ: ధర్మంచేత

4. య: సూర్యుని కాధారమేది?
ధ: సత్యం

5. య: దేనివల్ల మానవుడు శ్రోత్రియు డవుతాడు?
ధ: వేదం వల్ల

6. య: మానవుడు దేనివల్ల మహిమ పొందుతాడు ?
ధ: తపస్సు వల్ల

7. య: మానవుడు దేనిచేత సహాయం కలవాడవుకాదు?
ధ: ధైర్యంచేత

8. య: దేనివల్ల మానవుడు బుద్ధిమంతుడవుతాడు?
ధ: బుధులను సేవించడం వలన

9. య: బ్రాహ్మణుడు దేనివలన దేవభావం పొందుతాడు?
ధ: వేదాధ్యయనం వలన

10. య: బ్రాహ్మణుడు సాధుభావం దేనివల్ల పొందుతాడు?
ధ: వ్రతశీలం వల్ల

11. య: బ్రాహ్మణుడు దేనివలన అసాధువవుతాడు ?
ధ: విశిష్టమైన ప్రవర్తన విడిచి

12. య: బ్రాహ్మణుడు కేవల మానుష భావం దేనివల్ల పొందుతాడు ?
ధ: శౌచనియమం లేక మృత్యుభయం కలగడం వల్ల

13. య: జీవన్మృతు డనగా ఎవరు?
ధ: దేవతలకు, అతిథులకు, పితరులకు, సేవకులకు పెట్టకుండా తినేవాడు

14. య: భూమికంటె బరు వయిన దేది ?
ధ: తల్లి

15. య: ఆకాశముకంటె పొడవయిన దేది ?
ధ: తండ్రి

16. య: గాలి కంటె వేగవంత మయిన దేది ?

ధ: మనస్సు

17. య: గడ్డికంటె సాంద్రమయినదేది ?

ధ: చింత (విచారం)

18. య: నిద్రించినా కన్నుమూయనిదేది ?

ధ: చేప

19. య: పుట్టినా చైతన్యం లేని దేది ?

ధ: గ్రుడ్డు

20. య: రూపం ఉన్నా హృదయం లేని దేది ?

ధ: రాయి

21. య: వేగంతో రాణించే దేది ?

ధ: నది

22. య: బాటసారికి బంధు వెవరు ?

ధ: సార్ధము (కూడా వచ్చే వర్తకుల గుంపు)

23. య: రోగార్తునకు బందు వెవరు ?

ధ: వైద్యుడు.

24. య: గృహస్థునకు బంధు వెవరు ?

ధ: మంచి భార్య

25. య: మరణించిన వానికి చుట్ట మెవరు ?

ధ: చేసిన ధర్మం, అనగా దానం

26. య: ధర్మానికి కుదు రేది ?

ధ: దాక్షిణ్యం (దయ)

27. య: కీర్తికి ఆశ్రయ మేది?

ధ: దానం

28. య: స్వర్గలోకానికి దారి ఏది ?

ధ: సత్యం

29. య: సుఖానికి నెల వేది ?

ధ: శీలం

30. య: మానవునకు ఆత్మ ఎవరు ?

ధ: కొడుకు

31. య: మానవునకు దైవికమయిన చుట్ట మెవరు ?

ధ: భార్య

32. య: మానవుని జీవనం దేనివల్ల చెల్లుతుంది ?

ధ: పర్జన్యుని వల్ల (మేఘం)

33. య: మానవుడు దేని వల్ల ఘను డవుతాడు ?

ధ: దానం వల్ల

34. య: అన్ని ధర్మాలలోను గొప్ప ధర్మమేది ?

ధ: అహింస

35. య: ఎప్పుడూ పండి ఉండేది ఏది ?

ధ: యాగ కర్మ (వేదోక్త ధర్మం)

36. య: దేనిని నిగ్రహించుకొంటే ప్రమోదం కల్గుతుంది?

ధ: మనసు

37. య: ఎవరితో స్నేహం ఎప్పుడూ చెడిపోదు ?

ధ: సజ్జనులతో స్నేహం

38. య: లోకానికి దిక్కు ఏది ? (ఆధారం)

ధ: సజ్జనులు

39. య: నీరు, అన్నం దేనివల్ల పుడుతున్నాయి ?

ధ: ఆకాశం నుండి నీరు, భూమి నుండి అన్నం

40. య: విషమనగా ఏది ?

ధ: బ్రాహ్మణ ధనం

41. య: శ్రాద్ధానికి సమయం ఏది?

ధ: బ్రాహ్మణుడు వచ్చినప్పుడు

42. య: దేనిని విడిచి మానవుడు అందరికీ హితుడవుతాడు ?

ధ: గర్వం విడిచి

43. య: దేనిని విడిచి మానవుడు నిశ్శోకు డవుతాడు ? (శోకంలేని వాడు)

ధ: క్రోధం విడిచి

44. య: మానవుడు దేనిని విడిచి అర్థవంతుడవుతాడు?

ధ: లోభం విడిచి

45. య: మానవుడు దేనిని విడిచి సుఖి అవుతాడు?

ధ: తృష్ణ (కోరిక) విడిచి

46. య: పురుషుడనగా ఎవరు?

ధ: దివిని భువిని అంతటా ఎవని కీర్తి ప్రకాశిస్తుందో వాడు పురుషుడు.

47. య: సర్వధని అనగా ఎవడు?

ధ: ప్రియాప్రియములు, సుఖదుఃఖాలు, భూతభవిష్యత్కార్యాలు ఎవనికి సమంగా ఉంటాయో వాడు సర్వధని.

తెలుగులో ఎఱ్ఱన వదలివేసిన యక్షప్రశ్నలు మరికొన్ని సంస్కృతంలో ఉన్నాయి. పాఠకుల సౌకర్యంకోసం వాని నిట పొందుపరుస్తున్నాము.

	య:	కిం క్షత్రియాణాం దేవత్వం?		క్షత్రియులకు దేవత్వం దేనివల్ల కలుగుతుంది?
	ధ:	ఇష్వస్త్ర మేషాం దేవత్వమ్		శస్త్రాస్త్రములవల్ల
2	య:	కశ్చ ధర్మః సతామివ?		క్షత్రియులకు సద్ధర్మ మేది?
	ధ:	యజ్ఞ ఏషాం సతామివ		యజ్ఞమే సద్ధర్మము

3.	య:	కశ్చైషాం మానుషో భావః?		ఏది వీరికి మనుష్యభావం
	ధ:	భయం వై మానుషో భావః		భయమే మనుష్యభావం
4	య:	కిమేషా మసతామివ?		క్షత్రియులకు దుష్టభావ మేది?
	ధ:	పరిత్యాగోఽసతామివ		యుద్ధమును, శరణాగతులను విడచుట - యుద్ధము నుండి పారిపోరాదు, శరణు వేడిన వాడిని విడువరాదు
5	య:	కిమేకం యజ్ఞియం సామ?		యజ్ఞార్హమైన సామ మేది?
	ధ:	ప్రాణోవై యజ్ఞియం సామ		ప్రాణమే యజ్ఞార్హమైన సామము
6	య:	కిమేకం యజ్ఞియం యజుః?		యజ్ఞార్హమైన యజుర్వేద మంత్ర మేది?
	ధ:	మనోవై యజ్ఞియం యజుః		మనస్సు
7	య:	కాచైకా వృశ్చతే యజ్ఞమ్?		యజ్ఞమును ఆచ్ఛాదన మొనర్చున దేది?
	ధ:	వాగైకా వృశ్చతే యజ్ఞమ్		వాక్కు ఒకటే
8	య:	కాం యజ్ఞో నాతివర్తతే		యజ్ఞం దేనిని అతిక్రమింపదు
	ధ:	తాం యజ్ఞో నాతివర్తతే		ఆ వాక్కునే
9	య:	కిం స్వి దాపతతాం శ్రేష్ఠమ్?		పైనుండి పడేవాటిలో శ్రేష్ఠమేది?
	ధ:	వర్ష మాపతతాం శ్రేష్ఠం		వర్షము
10	య:	కిం స్వి న్నిపతతాం వరమ్		భూమినుండి పుట్టేవాటిలో శ్రేష్ఠ మేది?
	ధ:	బీజం నిపతతాం వరమ్		బీజం (విత్తనం)
11	య:	కిం స్విత్ప్రతిష్ఠమానానామ్?		కాళ్ళున్న వాటిలో శ్రేష్ఠ మేది?
	ధ:	గావః ప్రతిష్ఠమానానామ్		ఆవులు
12	య:	కిం స్విత్ప్రవదతాం వరమ్		మాటలు వచ్చినవాటిలో శ్రేష్టమేది?
	ధ:	పుత్రః ప్రవదతాం వరమ్		పుత్రుడు
13	య:	కిం స్వి దేకో విచరతి		ఎపుడూ ఒకడుగా తిరిగేవాడెవడు?
	ధ:	సూర్య ఏకో విచరతి		సూర్యుడు

14	య:	జాతః కో జాయతే పునః?		పుట్టినా మళ్ళీ పుట్టే దెవడు?
	ధ:	చంద్రమా జాయతే పునః		చంద్రుడు
15	య:	కింస్వి ద్ధిమస్య భైషజ్యం?		మంచుకు మందు ఏది?
	ధ:	అగ్నిర్హిమస్య భైషజ్యం		అగ్ని
16	య:	కింస్వి దావపనం మహత్?		పెద్ద ధాన్యపాత్ర ఏది?
	ధ:	భూమి రావపనం మహత్		భూమి
17	య:	ధన్యానా ముత్తమం కిం స్విత్?		ధన్యుల కుత్తమమేది?
	ధ:	ధన్యానా ముత్తమం దాక్ష్యం		దాక్ష్యము (సమర్థత)
18	య:	ధనానాం కింస్వి దుత్తమం?		ధనములలో శ్రేష్ఠ మేది?
	ధ:	ధనానా ముత్తమం శ్రుతమ్		శ్రుతము
19	య:	లాభానా ముత్తమం కిం స్విత్?		లాభాలలోకెల్ల మెలైన దేది?
	ధ:	లాభానాం శ్రేయ ఆరోగ్యం		ఆరోగ్యం
20	య:	కిం సుఖానాం తదోత్తమమ్?		సుఖాలలో ఉత్తమమేది?
	ధ:	సుఖానాం తుష్టి రుత్తమా		సంతోషం
21	య:	మృతః కథం స్యా త్పురుషః?		మృతు డనగా ఎవరు?
	ధ:	మృతో దరిద్ర పురుషః		దరిద్రుడు
22	య:	కథం రాష్ట్రం మృతం భవేత్?		దేశం మృత మెట్లవుతుంది?
	ధ:	మృతం రాష్ట్ర మరాజకం		రాజు లేని దేశం మృతం
25	య:	శ్రాద్ధం మృతం కథం చ స్యాత్?		శ్రాద్ధం మృతం ఎట్లా అవుతుంది?
	ధ:	మృత మశ్రోత్రియం శ్రాద్ధం		శ్రోత్రియుడు లేని శ్రాద్ధం మృతమే
24	య:	కథం యజ్ఞో మృతో భవేత్?		యజ్ఞం ఎట్లా మృతమవుతుంది?
	ధ:	మృతో యజ్ఞస్త్వదక్షిణ		దక్షిణ లేని యజ్ఞం మృతం

ధర్మజుని యా సమాధానాలకు యక్షుడు ఎంతో సంతోషించాడు. అపుడా యక్షుడు ధర్మరాజుతో "మహాత్మా! నా ప్రశ్న లన్నిటికి నీవు చక్కని సమాధానా లిచ్చావు.[1] చాలా సంతోషిస్తున్నాను. నీ తమ్ములలో ఒకని ప్రాణాలిస్తాను కోరుకో"

1 ధర్మరాజు అరణ్యపర్వంలో మహర్షుల వల్ల ఎన్నో ధర్మాలు విన్నాడు. వానిని ధర్మరాజు ఎట్లా గ్రహించాడో తెలుసుకొనటానికి ఇది ఒక ప్రశ్న పత్రం. ఆ ప్రశ్న

అన్నాడు. ధర్మరాజు నకులుని బ్రతికించుమన్నాడు. అప్పుడు యక్షుడు 'భీమార్జునులు మహాబలవంతులు కదా! పైగా వారు నీకు చాలా ప్రియులు కదా! వారిని కోరక నకులు నెందుకని కోరావు' అన్నాడు. దానికి సమాధానంగా ధర్మరాజు 'మా తండ్రి అయిన పాండురాజుకు ఇద్దరు భార్యలు. అందులో కుంతి కొడుకులు ముగ్గురి లోనూ నేను బ్రతికి ఉన్నాను. మాద్రి కొడుకు లిద్దరిలోనూ ఒకడు బ్రతక వద్దూ? అది న్యాయం కదా! నన్ను లోకమంతా ధర్మనందనుడని పిలుస్తారు. అటువంటి నేను ధర్మహానికి ఓర్వలేను' అన్నాడు.

ధర్మరాజు నిశ్చయానికి యక్షుడు మెచ్చి 'నీ తమ్ములంతా బ్రదుకుతా'రని అనుగ్రహించాడు. వెంటనే నలుగురూ నిద్రనుండి లేచినట్లు లేచారు. అపుడు ధర్మరాజు ఆశ్చర్యంతో "మహాత్మా! నీవు యక్ష మాత్రుడవు కావు ఇంద్రుడవో, కుబేరుడవో, అగ్నివో, వాయునివో, లేక నాతండ్రి అయిన యమధర్మరాజువో" అన్నాడు.

వెంటనే యక్షుడు చిరునవ్వుతో 'రాజా! నేను యముడను. సత్యం, శౌచం, దానం, తపము, శమ, జ్ఞానం - ఇవి నా రూపాలు. ఉత్తమ ధార్మికుడ వయిన నిన్ను, నా కుమారుని చూడటానికి వచ్చాను. నన్ను ఆశ్రయించిన వారికి దుర్గతి కలుగదు. నీకే వరం కావాలో కోరుకో' అన్నాడు.

ధర్మరాజు ఆశ్చర్యంతో నమస్కరించి, 'దేవా నా ఆశ్రమంలో నివసించే ఒక బ్రాహ్మణుని అరణిని ఒక లేడి అపహరించుకొని పోయింది. ఆ బ్రాహ్మణునికి కర్మలోపం గాకుండా ఆ అరణిని ప్రసాదించు' అని అర్థించాడు. యముడు నీ మనః ప్రవృత్తి

తెలుసుకోవాలని నేనే ఆపని చేశాను. మృగమూ లేదు ఏమిలేదు' అంటూ ఆ అరణిని ఇచ్చాడు. ఇచ్చి యింకా ఇలా అన్నాడు. 13వ సంవత్సరం మీరు అజ్ఞాతవాసం చెయ్యాలి. అందులో మీ రెవరెక్కడ ఏ రూపంతో ప్రవర్తించా లంటే ఆయా రూపాలు మీకు అలవడుతాయి. ఎట్లా ఉన్నా మిమ్మల్ని ఎవరూ కని

పత్రానికి ధర్మరాజు సమగ్రమైన సమాధానాలిచ్చాడు. అనగా నూటికి నూరు మార్కులు సంపాదించుకొన్నాడు. ప్రాచీన విద్యా పరీక్షలలో నూటికి నూరు పాళ్ళు సమాధానం చెపితేనే సంతృప్తి ఏర్పడేది పరీక్షకులకు.

పెట్టకుండా వరం ఇస్తున్నాను. ఇంకా ఏం కావాలో అడుగు' మన్నాడు. ధర్మరాజు 'నీవు ప్రత్యక్షమయి ఆచరించడంతో నేను ధన్యుడనయ్యాను. ఇంతకు మించిన మేలు ఏమిటి ? అయినా నా మనస్సు ఎల్లప్పుడూ క్రోధమోహాదులను విడిచి ధర్మము నందే లగ్నమయి ఉండేటట్లు అనుగ్రహించు' అని వేడుకొన్నాడు. యమధర్మరాజు అనుగ్రహించి అంతర్హితుడయ్యాడు.

పాండవులు తమ ఆశ్రమానికి వెళ్ళి, బ్రాహ్మణునకు అరణి నిచ్చి, వాని ఆశీస్సులు పొంది పరమానందం పొందారు.

ఇది ఆరణ్యపర్వము

ఉపసంహారము

వ్యాసుడు అరణ్యపర్వంలో ధర్మానికి ప్రాధాన్యం యిచ్చాడు. 'ధర్మా దర్థశ్చ కామశ్చ' అని కదా ఆయన దృష్టి. ఆ దృష్టి ననుసరించి సాగిన వాడు ఎఱ్ఱన. ఆయనది ధర్మైకతత్పరమయిన దృష్టి. ఏ కథ చెపుతున్నా మనసు మాత్రం ధర్మం మీదనే లగ్నమయి ఉంటుంది. ఆ ధర్మైక తత్పరతయే ఎఱ్ఱనను ఇద్దరు మహాకవుల మధ్య చిరస్థిరంగా నిలిపింది. దాన్ని దృష్టిలో పెట్టుకొనియే 'ఎఱ్ఱన ధర్మోక్తి' అని నామకరణం చేయబడింది యీ గ్రంథానికి. ఎఱ్ఱన భారతభాగం ఆది మధ్యాంతాలలో ఈ ధర్మోక్తిని యథాశక్తి ప్రపంచించటానికి ప్రయత్నించాము. ఈ రుచితో పాఠకులకు మూలగ్రంథ పఠనాసక్తి కలిగితే అదే మా యీ ప్రయత్నానికి సాఫల్యం.

అనుబంధము

కలియుగ ధర్మాలను గురించి ప్రస్తావన హరివంశంలో కూడా ఉంది. ఉత్తర భాగం 9వ ఆశ్వాసంలో వ్యాసుడు జనమేజయునకు కలియుగధర్మాలు తెలియ జేస్తాడు. మూలకర్త, అనువక్త ఒకరే కావడం చేత పాఠకుల సౌకర్యంకోసం, విశేష జ్ఞానం కోసం హరివంశంలోని ధర్మాలను కూడ ఇక్కడ పొందుపరుస్తున్నాము.

(9ఆ - 36 నుండి 70 పద్యము వరకు)

కలియుగంలో వర్ణాశ్రమాలు సంకరము లయిపోతాయి. ధర్మం కనిపించదు. స్వల్పధర్మమే ఎక్కువ ఫలితం సాధిస్తుంది. రాజులు పన్నులు గ్రహిస్తారు కాని ప్రజలను రక్షించరు. క్షత్రియులు కాని వారే పరిపాలిస్తారు. వారు ఆత్మపోషణమే కాని ప్రజలకు హితం చేయరు. బ్రాహ్మణులు ఆయుధంపట్టి శూద్రులను సేవిస్తారు. శూద్రులు బ్రాహ్మణ ధర్మాన్ని పాటించి చరిస్తారు. ఇరువురూ ఏక పంక్తిని భుజిస్తారు. దొంగలు రాజులవుతారు. రాజులు దొంగలవుతారు. సజ్జన చరిత్ర నెవరూ పూజించరు. ఏవిధంగా నయినా సరే డబ్బు సంపాదించడమే ప్రధానమవుతుంది. భృతిలేక సేవకులు స్వామి యివ్వని సొమ్ములను ఆశిస్తారు. పతితులతో కలిసి తిరగటానికి కూడా అసహ్యించుకోరు. అన్నం అమ్ముకొంటారు. విప్రులు వేదాలు అమ్ముకొని జీవిస్తారు.

కాషాయ వస్త్రాలు ఎక్కువవుతాయి. శూద్రులు ధర్మబోధ చేస్తారు. శాక్తం, బౌద్ధం మొదలయిన మతాలను శ్లాఘిస్తారు. గోసంపద తగ్గి, క్రూరమృగాలు పెరుగుతాయి. దుర్జనులు వృద్ధి చెందుతారు. సజ్జనులు దుర్దశల పాలవుతారు. అడిగేవారు ఎక్కువవుతారు, ఇచ్చేవారు తగ్గిపోతారు. పురుషులు తక్కువ, స్త్రీలు ఎక్కువ అవుతారు. కులములు చెడిపోతాయి. దొంగలు, జారులు ఎక్కువవుతారు. దహనకాండలు, కరువులు అధికమవుతాయి. వీటివల్ల ప్రజలు నశించిపోతూ ఉంటారు. ఒప్పందములు, సత్యసంధతలు, విశ్వాసాలు చెడిపోతాయి. ఋణ మిచ్చే చోట, తీసుకొనేచోట న్యాయముండదు. చదవకుండా పండితులమని చెప్పుకొంటారు. ధర్మం తెలుసుకోకుండా తెలిసినట్లు నటిస్తారు.

పరలోకం సందేహం అని భావిస్తారు. పుణ్యానికి ఫలంలేదంటారు. శరీర సౌఖ్యమే ప్రధాన మనుకొంటారు. యజ్ఞమునూ, తపస్సునూ, అగ్నిహోత్రమునూ

విప్రులు విడిచివేస్తారు. కొందరు మద్యమాంసాలు స్వీకరిస్తూ, బ్రహ్మవాదులమని ధనకాంక్షతో ప్రజలను మోసగిస్తారు. బలి, భిక్షము పెట్టరు. ఇలవేల్పులను పూజించరు. గృహస్థులు అతిథిసత్కారం చేయరు. పితృకార్యాలను స్మరించరు. కొడుకు తండ్రిని ఆజ్ఞాపిస్తాడు. కోడలు అత్తను ఆదరింపక పనిచేయించుకొంటుంది. భార్యాభర్తలు పరస్పరమూ మోసగిస్తూ ప్రవర్తిస్తారు. శిష్యుడు గురువును నిష్ఠురంగా మాట్లాడుతాడు.

అంతటా శారీరక మానసిక రోగాలు ప్రబలిపోతాయి. ఎక్కడ చూసినా మదం, గర్వం, అసూయ, రోషం తాండవిస్తాయి. అతివైరం, అతియుద్ధం, మనుషులను నశింపజేస్తాయి. ధైర్యం చెడిపోతుంది. సిగ్గు నశిస్తుంది.

ప్రజలందరిలో అధ్యయనం లోపిస్తుంది. దుస్సహమైన అహంకారం ప్రబలుతుంది. ప్రజలు అధికమూర్ఖులూ, అర్థపరాయణులూ, అతిలుబ్ధులూ, పరస్త్రీ నిరతులూ, పరధనాపహారులూ, కామపరులూ, అపరాధులూ, తమ కార్యం మాత్రమే చేసుకొనేవారూ అవుతారు. అన్నమాట నిలబెట్టుకొనవలెననే జ్ఞానం ఉండదు. రాజులు నేరస్థులనే ఆదరిస్తారు ప్రజలను రక్షించరు. ఈ విధంగా కలియుగంలో ధర్మం క్షీణించి పోతుంది.

కవి పరిచయాలు

డా. సూరం శ్రీనివాసులు

జననం	: 03-06-1951, నెల్లూరు
తల్లిదండ్రులు	: కడయింటి శేషమ్మ, సూరం హనుమంతయ్య
విద్యాభ్యాసం	: 20 సం॥ వయస్సు వరకు నెల్లూరులోనే
ప్రాథమిక విద్య	: 1-3 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, అత్తితోట అగ్రహారం 4-5 తరగతి ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఉస్మాన్ సాహెబ్ పేట
ఉన్నత విద్య	: 6-8 తరగతి - వి.ఆర్. హైస్కూల్ 9 - ఎస్.ఎస్.ఎల్.సి. - వేద సంస్కృత పాఠశాల, మూలపేట - 1967
కళాశాల విద్య	: సాహిత్య శిరోమణి, వేద సంస్కృత కళాశాల – 1971, మూలపేట (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రథమస్థానం)
ప్రైవేటుగా	: పి.ఒ.ఎల్. 1975, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. భాషా ప్రవీణ 1976, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. (సంస్కృతం) 1977, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. ఎమ్.ఎ. తెలుగు 1978, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు. పి. హెచ్.డి. 1986, ఆంధ్ర విశ్వకళా పరిషత్ వాల్తేరు.
ఉద్యోగం	: 1971 - 1972, ఎస్.వి.ఎస్.ఓ.ఎస్. స్కూల్, చేకూరపాడు, ప్రకాశం జిల్లా.
లెక్చరర్	: 1972 - 1976, ఓరియంటల్ కాలేజ్, ఏలూరు & ఓరియంటల్ కాలేజీ, చిననింద్రకొలను. 1976 - 1980, ఓరియంటల్ కాలేజీ, పొన్నూరు.
ప్రిన్సిపల్	: 1980-1990, ఓరియంటల్ కాలేజీ, తాడికొండ. 1990-2009, ఓరియంటల్ కాలేజీ, తిమ్మసముద్రం
పార్ట్ టైమ్ లెక్చరర్	: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (1 సంవత్సరం)
Visiting Fellow	: రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి. (2008-09)
Adjudicator	: For Several Dessertations Submitted for Ph.D

పురస్కారాలు : – ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ గ్రంథం
బహుమతి – 1979 'సంస్కృత భాణ సాహిత్య' గ్రంథం
– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమాధ్యాపక బహుమతి–1981
– తెలుగు వెలుగులు – శ్రీనాథపీఠం–1987
– పుష్పకిరీట సన్మానం, చెన్నై
– ఉగాది సాహితీ పురస్కారం, లలితకళా పరిషత్, చీరాల–2001
– బహుముఖ ప్రజ్ఞ పురస్కారం, సహజ సాహితి, చీరాల–2009
– పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్టప్రతిభాపురస్కారం – 2011
– సృజన సాహిత్య పురస్కారం, అద్దంకి–2013
– సి.పి.బ్రౌన్ సాహితీసేవాపురస్కారం, బెంగుళూరు – 2020 నవంబర్
– శ్రీమతి ఆసూరి మరింగంటి సులోచనా రంగాచార్య స్మారక పురస్కారం –
సిరికోన ఉత్తమ కవితా పురస్కారం – 2021
– తెలుగు మరియు సంస్కృత అకాడమీ.. హంసపురస్కారం – 2023 సెప్టెంబరు
– శ్రీమాన్ కృష్ణమాచార్య కళాపీఠం వార్షిక పురస్కారం – 2023 సెప్టెంబరు
– శ్రీమతి రావిళ్ల మునెమ్మ స్మారక పురస్కారం – 2024 మే
– 1970 విద్యార్థి దశ నుండి వివిధ ప్రాంతాలలో అవధాన సభలలో
సన్మానాలు, బిరుద ప్రదానాలు.

వృత్తిపరంగా నిర్వహించిన బాధ్యతలు

1. Member, Academic Council, Acharya Nagarjuna University.
2. Member, Academic Senate, Acharya Nagarjuna University.
3. Member, Board of Studies in Oriental Languages, Aharya Nagarjuna University.
4. Adhoc PG Board of Studies (Sanskrit), Acharya Nagarjuna University.
5. Resource Person, Refresher Courses
6. P.R.O., Oriental College, Resource Teachers Association (AP)

ప్రచురణలు

1. మత్తవిలాసప్రహసనము – తెలుగు అనువాదం – 1974
2. సౌమనస్యము (ఖండకావ్యం – పద్యం) – 1979
3. సంస్కృతప్రహసనసాహిత్యం (విమర్శ) – 1986
4. Hasya and Prahasana: A Critical Study (Ph.D..thesis) - 1989
5. పూజాకుసుమమ్. (రేడియో నాటకం.. సంస్కృతం) – 1985

6. కరావలంబమ్. (〃 〃) – 1987
7. ధూర్తానుభవభాణః (సంస్కృతం)
8. గురువరరంజనభాణః (〃)
9. కవిజనమండనభాణః (〃)
10. నటసమాగమభాణః (〃)
11. సున్నితపుత్రాసు (వచనకవితాసంకలనం) – 2002
12. నికష (విశ్వధర్మవాణి మాసపత్రిక సంపాదకుడుగా వ్రాసిన సంపాదకీయాల సంకలనం) – 2009
13. రుక్మిణీశవిజయమ్ (సంస్కృతమహాకావ్యానికి విస్తృతంగా తెలుగు వ్యాఖ్య)
14. భవానీ భారతి (అరవిందుని సంస్కృతకావ్యానికి తెలుగు వ్యాఖ్య) – 2019
15. దశావతారస్తోత్రమ్ (వాదిరాజతీర్థరు రచనకు తెలుగువ్యాఖ్య) – 2019
16. శివానందలహరికి జ్యోతిష్మతీ వ్యాఖ్య (సంస్కృతంలోనే – వ్యాకరణవిశేషప్రస్తావనతో) – 2020
17. రాధాషోడశ నామస్తోత్రం (అర్థతాత్పర్యాలు) – 2020
18. కుమారసంభవమ్(కాళిదాసరచితమ్) (అష్టమసర్గ – తెలుగులో వ్యాఖ్య) – 2021
19. ధాతృప్రశ్నః అథవా వేదాన్తమణ్డనమ్ – 2021
20. స్థావరజంగమం (వచనకవితాగీత) – 2021
21. ఏటివాలు జ్ఞాపకం (వచనకవితాసంపుటి) – 2022
22. రసవిద్య (కవన శిల్ప సమీక్ష) – 2022
23. కాలగీత (వచనకవితాగీత) – 2023
24. విడుపుముడి (వచనకవితాగీత) – 2024
25. విష్ణుసహస్రనామ స్తోత్రం, తాత్పర్యం – 2024.

ఇతరాలు:

1973 నుండి ఆకాశవాణి ద్వారా సంస్కృత పాఠాలు, సంస్కృత ప్రసంగాలు కథలు, ఏక పాత్రలు, సూక్తి సుధ, సద్వాణి, తెలుగు సాహిత్య ప్రసంగాలు –

1973 నుండి జాగృతి, భారతి, నాట్యకళ, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, రచన, సమాలోచనమ్, గైర్వాణి, సుధర్మా, ఆత్మజ్యోతి, సంవిత్, సంస్కృత సమ్మేళనమ్ మొదలైన పత్రికలలో వచన కవితలు, విమర్శ వ్యాసాలు, శ్లోకాలు, నాటికలు ముద్రితాలు, బొమ్మలకొలువు – అసంపూర్ణ నవల – విద్యాజ్యోతిలో సీరియల్

1991 నుండి 'విశ్వ ధర్మ వాణి' పత్రికా సంపాదకత్వం

కుటుంబ వివరాలు:

శ్రీమతి : సులోచన

కుమార్తెలు : 1. మాధవి, BE (Hons) M.S

అల్లుడు : కావూరి శ్యామ్ సుందర్

మనవడు : శ్రీహర్ష

మనవరాలు : గాయత్రి

2. డా॥ సుషమ., M.B.B.S., D.O

అల్లుడు : డా॥ ప్రవీణ్ కుమార్

మనవరాలు : వాహిని

అభీష్ట విషయాలు : 1. అధ్యయనం, అధ్యాపనం

2. ఆధ్యాత్మిక, అది భౌతిక జీవితాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అనుగుణంగా విశ్లేషణాత్మక పరిశీలన

3. ఆచరణ ప్రాధాన్యం

డా. తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

జననం : 20–4–1939

తల్లిదండ్రులు : పేరమ్మ, సత్యనారాయణ

విద్యాభ్యాసము : భాషాప్రవీణ, మొదటితరగతి, ప్రథముడు
శ్రీ మార్కండేయ ఓరియంటల్ కళాశాల ఆగిరిపల్లి
ఎం.ఏ. మొదటితరగతి – ప్రథముడు, ఆంధ్ర విశ్వవిద్యాలయము
పిహెచ్.డి. – రససిద్ధాంతము ఆంధ్రుల వరివస్య

ఉద్యోగము: పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తు, తెలుగు పండితుడు;
భీమవరం, అమలాపురం, ఏలూరు, నాగార్జున సాగర్ కళాశాలల్లో
తెలుగు ఉపన్యాసకుడు

ముద్రిత రచనలు:

1. రస సిద్ధాంతము ఆంధ్రుల వరివస్య
2. మహాభారత ప్రశ్నోక్తి (భారతం క్విజ్)
3. శివ సహస్రనామ నిరుక్తి
4. తప్పులు లేని శివసహస్ర నామముల
5. సంక్షిప్త మహాభారతము, గీతా ప్రెస్, గోరఖ్‌పూర్
6. విదురనీతి, గీతాప్రెస్, గోరఖ్‌పూర్
7. రామాయణ ప్రశ్నోక్తి (రామాయణం క్విజ్)

చిరునామా: డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
11–192ఎ, శివాలయం వెనుక, పోలకంపాడు,
వయా తాడేపల్లి పోస్టు – 522501.

సంయుక్త రచనలు:

1. సంస్కృతభాణసాహిత్యము (విమర్శ)
   (ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహూమతి 1979)
2. భారతనిరుక్తి – నన్నయరుచిరార్థసూక్తి – 1983
3. భారతనిరుక్తి – తిక్కన సరసోక్తి
4. భారతనిరుక్తి – ఎఱ్ఱన ధర్మోక్తి
5. జనహిత వ్యాఖ్య (ఆంధ్రమహాభారతము – విరాటపర్వము) – 1989
6. జనహితవ్యాఖ్య (ఆంధ్రమహాభారతము – ఉద్యోగపర్వము) – 2000
7. జనహితవ్యాఖ్య (నిర్వచనోత్తరరామాయణము – తిక్కన) – 2005
8. వ్యాసమహాభారతం – తెలుగువచనం – 2010
   (వ్యాసభారతానికియథాతథానువాదం) 20 సంపుటాలు (6000 పుటలు)
9. మహాభారతము — తెలుగు (మూలం.. అనువాదం.. విశేషాంశాలు.. గీతాప్రెస్.. గోరఖ్ పూర్ ప్రచురణ) A4 సైజులో.. 7 సంపుటాలు.. 7250 పుటలు – 2018
10. శ్రీమహాభారతము(సంస్కృతం) విరాటపర్వము
    (జనహితవ్యాఖ్య – తెలుగులో – గీతాప్రెస్, గోరఖ్‌పూర్ ప్రచురణ) 2005